Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

శుక్రవారం, డిసెంబర్ 27, 2024 | సంపుటి - 20 | సంచిక 89 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## విలేకరులు కావలెను



అనతికాలంలోనే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విశేష ప్రజాదరణ పొందుతున్న ది క్రైమ్ న్యూస్ దిన పత్రికకు ఉమ్మడి జిల్లాలకు స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకర్గాల వారిగా ఆర్‌సీ ఇంచార్జిలు, మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవజ్ఞులకు ప్రాధాన్యత ఇవ్వబడును

ది క్రైమ్ న్యూస్ తెలుగు దినపత్రిక

రాజకీయ అవగాహన కలిగిన కొత్త వారికి అవకాశం ఇవ్వబడును.

వివరాలకు సంప్రదించండి 6305584064

## చలితో ఉత్తరాది గజగజ


**దారుణంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు**

**రోడ్లపై మంచు దుప్పటి.. రాకపోకలకు తీవ్ర అంతరాయం**



న్యూఢిల్లీ : జమ్ము కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ , ఉత్తరాఖండ్ సహా ఉత్తరాది రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయాయి. ముఖ్యంగా హిమాచల్ ప్రదేశ్‌ను మంచు దుప్పటి కప్పేసింది. ఎడతెరిపి లేకుండా మంచు వర్షం కురుస్తూనే ఉంది. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. 2లో

## అటకెక్కిన ఆరు గ్యారంటీలు



హైదరాబాద్ : ఆరు గ్యారంటీలు ప్రకటించి గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను కూడా అటకెక్కించారని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నేత, ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా పనిచేసిన ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని కేటీఆర్ అన్నారు. 2లో



## మహాకుంభమేళాకు భారీగా ఏర్పాట్లు

**ముఖ్య అతిథుల కోసం ప్రత్యేకంగా విభాగాలు**

**అడర్ టన్నెట్ డ్రోన్లతో ప్రమాదాల నివారణ చర్యలు**


అలహాబాద్ : మహాకుంభమేళ.. 12 ఏళ్లకు నిర్వహించే వేడుక. సాధువులు, భక్తులు, పర్యాటకులు భారీగా కుంభ మేళాకు తరలివస్తారు. ఈసారి 45 కోట్ల మంది రావచ్చనే అంచనాల మేరకు యూపి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. .అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లపై దృష్టి పెట్టింది. ఈ వేడుకను విజయవంతం చేసేందుకు ఈసారి విరివిగా ఆధునిక టెక్నాలజీని వాడుతున్నారు. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు ప్రయాగ్ రాజ్‌లో జరిగే మహాకుంభమేళాకు ఉత్తరప్రదేశ్ సర్కార్ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. ప్రత్యేకంగా హైఎండ్ టెక్నాలజీని వాడుతున్నారు. అండర్ వాటర్ డ్రోన్లను అందుబాటులోకి తెస్తున్నారు. సీసీ కెమెరా నిఘా నేత్రాలు ఎటూ వుంటాయి. ఐతే ఈసారి సరికొత్తగా అండర్ వాటర్ డ్రోన్లను వినియోగించ బోతున్నారు. ట్రయిల్స్ కూడా నిర్వహించారు. 2లో

## మాజీ ప్రధాని మన్మోహన్ కన్నుమూత

**ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి**

**ఆర్థికమంత్రిగా, ప్రధానిగా కీలక భూమిక**

**పలువురు ప్రముఖుల సంతాపం** 2లో






## శాంతిభద్రతల్లో రాజీపడే ప్రసక్తే లేదు

**అభిమానులను కంట్రోల్ చేయాల్సిన బాధ్యత సెలబ్రిటీలదే**

- బెనిఫిట్ షోలకు అనుమతి ఇచ్చేదే లేదు
- తెలంగాణ అభివృద్ధిలో మీరూ భాగస్వాములు కండి
- మీపై సామాజిక బాధ్యత ఉందని గుర్తించండి
- డ్రగ్స్ తదితర సామాజిక దుర్మార్గాలపై పోరాడండి
- చిత్రపరిశ్రమ అభివృద్ధికి మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు
- సినీ ప్రముఖులతో భేటీలో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- ప్రభుత్వంతో కలసి పనిచేస్తామన్న ఎఫ్‌డిసి ఛైర్మన్ దిల్ రాజు



హైదరాబాద్ : కలసి పనిచేద్దాం రండి..తెలంగాణ అభివృద్ధిలో మీరూ భాగస్వాములు కండి అని సిఎం రేవంత్ రెడ్డి చిత్రపరిశ్రమను ఆహ్వానించారు. సినీ పరిశ్రమలో సమస్యలు, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీనిపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు అధికారులకు ఆయన సూచనలు చేశారు. సినీ పరిశ్రమ కూడా ఓ కమిటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు.

**శాంతి భద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, అభిమానులను నియంత్రించాల్సిన బాధ్యత సెలబ్రిటీలదేనని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇకపై బౌన్సర్లపై విషయంలో సీరియస్‌గా ఉంటామన్నారు. టికెట్ల పెంపు, బెనిఫిట్ షోలకు అనుమతి ఇచ్చేది లేదని తేల్చిచెప్పారు. అసెంబ్లీలో చేసిన ప్రకటనకే కట్టుబడి ఉంటామన్నారు. హైదరాబాద్ బంజారా హిల్స్ ఓలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సినీ ప్రముఖులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు.**

మంత్రివర్గ ఉపసంఘం సినీ పరిశ్రమకు చెందిన పలు అంశాలపై అధ్యయనం చేయనుంది. రానున్న రోజుల్లో ఇండస్ట్రీ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, అదనపు షోల నిర్వహణకు సంబంధించిన మార్గదర్శకాలు, టికెట్ రేట్ల పెంపుపై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందజేయనుంది. దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టనుంది. సినీ పరిశ్రమ కూడా ఓ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించిన నేపథ్యంలో ఇండస్ట్రీ ప్రముఖులు తమ సూచనలను ఉప సంఘం దృష్టికి తీసుకెళ్లనున్నారు. 2లో

## ప్రమాదంలో మహాత్మాగాంధీ వారసత్వం

**పరోక్షంగా బిజెపి, ఆర్ఎస్ఎస్‌లపై సోనియా ధ్వజం**

**రాజ్యాంగ సంస్థలను గుప్పట్లో పెట్టుకున్నారన్న ఖర్గే**

**బెళగావిలో సిడబ్ల్యూసి సమావేశాలు ప్రారంభం**



**మహాత్మాగాంధీ వారసత్వం ముప్పులో ఉందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ ఈ రోజు అన్నారు. ఢిల్లీలో అధికారంలో ఉన్న వారు, వారికి మద్దతు ఇచ్చే సంస్థల నుంచి మహాత్మా గాంధీ వారసత్వం ముప్పును ఎదుర్కొంటోందని అన్నారు. పరోక్షంగా బీజేపీ, దాని మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్‌పై సోనియా గాంధీ దాడి చేశారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రదేశాల్లో గాంధీ సిద్ధాంతాలు, సంస్థలు దాడులకు గురవుతున్నాయని అన్నారు. ఈ శక్తుల్ని ఎదుర్కోవడానికి మన సంకల్పాన్ని పునరుద్ధరించడం తమ పార్టీ పవిత్ర కర్తవ్యమని ఆమె చెప్పారు.**

బెంగళూరు : కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాలు కర్ణాటక బెలగావిలో జరుగుతోంది. శతాబ్దం క్రితం ఇదే వేదికగా మహాత్మాగాంధీ కాంగ్రెస్‌కి అధ్యక్షత వహించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి అనారోగ్య కారణాల వల్ల సోనియా గాంధీ హాజరుకాలేదు. ఈ సందర్భంగా లిఖితపూర్వక ప్రకటనలో రాజ్యాంగ విలువలు, గాంధీ ఆశయాలను పరిరక్షించడం పార్టీ కర్తవ్యమని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ బెలగావిలో కాంగ్రెస్ అధ్యక్షుడవ్వడం పార్టీకి, స్వాతంత్ర్య ఉద్యమానికి మలుపు అని ఆమె తన సందేశంలో పేర్కొన్నారు.

మిగతా 2లో

## ఇండియా కూటమిలో భగ్గుమన్న విభేదాలు

**ఆప్‌ను తొలగించేందుకు ప్రయత్నాలు..?**

న్యూఢిల్లీ : ప్రతిపక్ష ఇండియా కూటమిలో విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. ముఖ్యంగా కూటమి భాగస్వామ్య పక్షాలైన కాంగ్రెస్, ఆప్ మధ్య వైరం రోజురోజుకూ పెరిగిపోతోంది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ ఆమ్ ఆద్మీ పార్టీపై కాంగ్రెస్ ఆరోపణలతో ఈ వైరం మరింత ముదురుతోంది. తాజాగా ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్ పార్టీని బయటకు పంపించేందుకు అధికార ఆమ్ ఆద్మీ పార్టీ ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆమ్ ఆద్మీ పార్టీ ఇస్తున్న ఎన్నికల హామీలపై కాంగ్రెస్ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఎన్నికల సందర్భంగా ఆచరణ సాధ్యం కాని హామీలు అమలు చేస్తామని కేజ్రీవాల్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ హస్తం పార్టీ ఆరోపించింది.

మిగతా 2లో

## గ్రూప్ -1అభ్యర్థులకు హైకోర్టు షాక్



హైదరాబాద్ : గ్రూప్ -1 అభ్యర్థులకు తెలంగాణ హైకోర్టు షాకిచ్చింది. గ్రూప్-1 అభ్యర్థుల పిటిషన్‌ను హైకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. రిజర్వేషన్లతో పాటు పలు అంశాలపై హైకోర్టును గ్రూప్-1 అభ్యర్థులు ఆశ్రయించారు. వారి పిటిషన్‌పై గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది.

మిగతా 2లో

## చిల్డ్రన్స్‌డేను మార్చాల్సిందే

**వీర బాల దివస్‌ను చిల్డ్రన్స్‌డేగా గుర్తించాలి**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**



హైదరాబాద్ : చిల్డ్రన్స్ డేను మార్చాల్సిందేనని, వీర బాల దివస్‌ను చిల్డ్రన్స్‌డేగా గుర్తించాలని, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో వీర్ బాల్ దివస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి భారతీయ 2లో

## సినిమా వాళ్ళు బెదరించే ప్రయత్నం

**సిఎం తీరుపై మండిపడ్డ హరీష్ రావు**



హైదరాబాద్ : సినిమా వాళ్లను భయపెట్టి సీఎం మంచి చేసుకోకూడదని బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సంధ్య థియేటర్ ఘటనను ప్రభుత్వం రాజకీయం చేస్తోందని అన్నారు. గురుకులాల్లో మృతి చెందిన వారి కుటుంబాలను సీఎం పరామర్శించిన సందర్భాలు లేవు.రాష్ట్రంలో ఓ సర్పంచి ఆత్మహత్య చేసుకుంటే.. అందుకు కారణమైన సీఎం తమ్ముడిని ఎందుకు అరెస్టు చేయలేదు? చట్టం అందరికీ సమానమన్న సీఎం.. వాళ్ల తమ్ముడిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. 2లో

## చలితో ఉత్తరాది గజగజ

రోడ్లపై అడుగుల మేర మంచు పేరుకు పోయింది. అప్రమత్తమైన అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా రహదారులను తాత్కాలికంగా మూసివేశారు. హిమాచల్ ప్రదేశ్‌లో మూడు జాతీయ రహదారులు సహా మొత్తం 226 రోడ్లను మూసివేశారు. ఇందులో సిమ్లాలో 123 రోడ్లు, లాహౌల్, స్పితిలో 36, కులులో 25 రోడ్లు ఉన్నాయి. 173 ట్రాన్స్‌ఫార్మర్లకు అంతరాయం ఏర్పడింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో తీవ్రమైన చలి పరిస్థితుల కారణంగా భారత వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా దట్టమైన పొగమంచు కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. ఇక ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో మంచు దట్టంగా కురుస్తోంది. దీంతో త్యుని-చక్రతా-ముస్సోరీ జాతీయ రహదారి, ధరణాధర్-కోటి కనసర్ రహదారి పూర్తిగా మంచుతో కప్పుకుపోయింది. జమ్ము కశ్మీర్‌లోని పలు ప్రదేశాలు చలికి అల్లాడిపోతున్నాయి. శ్రీనగర్‌లో మైనస్ 7 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు భారత వాతావరణ విభాగం తెలిపింది. రాబోయే రెండు రోజుల్లో ఇది మరో 2 నుంచి 3 డిగ్రీల వరకూ తగ్గే అవకాశం ఉందని అంచనా వేసింది.

## అటకెక్కిన ఆరు గ్యారంటీలు

ఎన్నికల ప్రచారంలో దళిత, బహుజన వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం బీఆర్ఎస్ తరఫున ప్రశ్నిస్తున్నందుకే ఎర్రోళ్లపై కక్షగట్టి అక్రమ కేసులతో వేధించాలని చూస్తున్నారు. కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా తెల్లవారుజామున ఎర్రోళ్ల ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులను భయభ్రాంతులకు గురిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇందిరమ్మ రాజ్యంలో ఆరు గ్యారెంటీలను అటకెక్కించి, ఏడో గ్యారెంటీగా ఎమర్జెన్సీని ముఖ్యమంత్రి అమలుచేస్తున్నారు. ప్రజల్లో వెల్లువెత్తుతున్న వ్యతిరేకతను తట్టుకోలేక.. నిర్బంధం, అణచివేతతో బీఆర్ఎస్ గొంతునొక్కే విఫల యత్నం చేస్తున్నారు. రోజురోజుకూ పెరిగిపోతున్న నేరాల నియంత్రణలో పూర్తిగా చేతులెత్తేసి, ప్రధాన ప్రతిపక్షాన్ని ఎలా నియంత్రించాలనే దానిపైనే సర్కారు ఒడ్డుతున్నారు. అక్రమంగా అరెస్టుచేసిన ఎర్రోళ్ల శ్రీనివాస్ ను వెంటనే విడుదల చేయాలి. తప్పుడు కేసులతో రాజకీయ ప్రత్యర్థులను భయపెట్టాలని చూసే విష సంస్కృతికి చరమగీతం పాడాలి. బీఆర్ఎస్ పార్టీకి కేసులు కొత్తకాదు, అరెస్టులు అంత కన్నా కాదు.. ఆత్మగౌరవ పోరాటాలతో సాధించుకున్న తెలంగాణలో ఇలాంటి బెదిరింపు చర్యలకు భయపడే వారెవరూ లేరంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

## మాజీ ప్రధాని మన్మోహన్ కన్నుమూత

న్యూఢిల్లీ : భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ (92) కన్నుమూశారు. గురువారం సాయంత్రం ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. గురువారం రాత్రి 9:15 నిమిషాలకు మన్మోహన్ చనిపోయినట్లు ప్రకటించారు. అంతకుముందు మన్మోహన్ అస్వస్థతకు గురి కాగానే రాత్రి 8 గంటలకు ఎయిమ్స్‌కు తరలించి అత్యవసర విభాగంలో చికిత్స అందించారు. చికిత్స పొందుతూ ప్రాణాలు వదిలారు. దేశంలో ఎన్నో ఆర్థిక సంస్కరణలు చేపట్టిన వ్యక్తిగా నిలిచిన మన్మోహన్ సింగ్.. అక్టోబర్ 1991లో తొలిసారి రాజ్యసభలో అడుగుపెట్టారు. 1991 నుంచి 1996 వరకు పీవీ నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పని చేసిన ఆయన.. ఆ తర్వాత 2004 నుంచి 2014 వరకు పదేళ్ల పాటు భారత ప్రధానిగా సేవలందించారు. దేశాన్ని సుదీర్ఘకాలంపాటు పాలించిన ప్రధానుల్లో ఒకరిగా నిలిచారు. మన్మోహన్ సింగ్ సెప్టెంబర్ 26, 1932లో అప్పటి అవిభక్త భారతదేశంలోని ప్రస్తుత పాకిస్తాన్ పంజాబ్ లోని గాహ్‌లో జన్మించారు. ఆక్స్‌ఫర్ యూనివర్సిటీ నుంచి ఎకనామిక్స్‌లో డాక్టరేట్ పొందారు. ప్లానింగ్ కమిషన్ చీఫ్‌గా, ఎకనామిక్ అడ్వైజర్‌గా భారత ప్రభుత్వంలో కీలక పదవుల్లో పనిచేశారు. 1991లో అప్పటి పీవీ నరసింహారావు ఆయనను తన మంత్రివర్గంలో ఆర్థిక మంత్రిగా తీసుకున్నారు. భారత ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన వ్యక్తిగా, సంస్కరణలకు శ్రీకారం చుట్టిన వ్యక్తిగా మన్మోసింగ్ ఘనత వహించారు. 2004 నుంచి 2014 వరకు యూపీఏ హయాంలో పదేళ్లపాటు భారత ప్రధానిగా పనిచేశారు. ఈ సంవత్సరం ప్రారంభంలో రాజ్యసభ నుంచి పదవీ విరమణ చేశారు. 33 సంవత్సరాల తర్వాత ఎగువ సభలో తన రాజకీయ ప్రస్థానాన్ని ముగించారు. పీవీ.నరసింహారావు నేతృత్వంలోని ప్రభుత్వంలో జూన్ 1991లో ఆర్థిక మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అస్సాం నుంచి ఎగువ సభలో ఐదు పర్యాయాలు ప్రాతినిధ్యం వహించారు. 2019లో రాజస్థాన్‌కు మారారు. పార్లమెంటులో పెద్ద నోట్ల రద్దును మన్మోహన్ సింగ్ వ్యతిరేకించారు. దీన్ని 'వ్యవస్థీకృత దోపిడీ మరియు చట్టబద్ధమైన దోపిడీ'గా మన్మోహన్ అభివర్ణించారు. మన్మోహన్ మృతికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీ, సోనియాగాంధీ, మల్లికార్జున ఖర్గే,రాహుల్ గాంధీ, ప్రియాంక, రాబర్ట్ వాద్రా, సిఎంరేవంత్ రెడ్డి తదితరులు సంతాపం ప్రకటించారు. ఆయన దేశానికి సేసిన సేవలను కొనియాడారు.

## ఇండియా కూటమిలో భగ్గుమన్న విభేదాలు

ఈ నేపథ్యంలోనే ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్ పార్టీని బయటకు పంపించేందుకు ఆప్ ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు కూటమి నుంచి కాంగ్రెస్‌ను బయటకు పంపించేలా ఇతర పార్టీలను ఒప్పించేందుకు ఆప్ ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు సమాచారం. కేంద్రంలో బీజేపీని అధికారం నుంచి దించేయాలన్న ప్రధాన లక్ష్యంతో సుమారు 24 విపక్ష పార్టీలతో ఏర్పడిన ఇండియా కూటమి బీటలు వారుతున్నది. ఇప్పటికే కూటమిలో ఉన్న విభేదాలు లోక్‌సభ ఎన్నికల్లో ప్రస్ఫుటం కాగా, ఇటీవల జరిగిన పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూటమికి నేతృత్వం వహిస్తున్న రాహుల్ గాంధీ పట్ల అందులోని పార్టీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. 'ఎన్నికల్లో విజయం సాధించి పెట్టలేని నాయకుడిని మనం ఇంకా ఎంతకాలం భరించాలి' అన్న ధోరణి ఆ పార్టీల్లో ఇటీవల అధికమైంది. రాహుల్ నాయకత్వంలో బీజేపీని ఎదుర్కోవడం కష్టమేనని, కాంగ్రెస్‌ను నమ్ముకుంటే తామూ మునగడం ఖాయమని ఆయా పార్టీల నేతలు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రత్యామ్నాయంగా బెంగాల్ సీఎం మమతా బెనర్జీ నాయకత్వానికి జై కొడుతున్నారు. ఇప్పటికే సమాజ్‌వాదీ, ఎన్సీపీ (శరద్‌చంద్ర పవార్), శివసేన (యూబీటీ) సహా పలు మిత్రపక్ష పార్టీలు దీదీకి మద్దతు తెలిపిన విషయం తెలిసిందే.

## 28న డయల్ యువర్ ఇవో: టిటిడి

తిరుమల : డిసెంబర్ 28న శనివారం 'డయల్ యువర్ ఈవో' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీటీడీ ప్రకటించింది. టీటీడీ 'డయల్ యువర్ ఈవో' కార్యక్రమం డిసెంబరు 28వ తేదీ ఉదయం 9 నుండి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరుగనుందని, ఈ కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుందని టీటీడీ ప్రకటించింది. ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలను, సూచనలను టీటీడీ ఈవో జె.శ్యామలరావు కి ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి తెలుపవచ్చునన్నారు. ఇందుకు భక్తులు ఈ నెంబరు 0877-2263261 కు సంప్రదించాలని కోరారు.

# శాంతిభద్రతల్లో రాజీపడే ప్రసక్తే లేదు

తెలుగు సినిమా ఇండస్ట్రీ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని.. సినిమా పరిశ్రమ సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు నేతృత్వంలో సినీ ప్రముఖులు సిఎం రేవంత్ ను కలిశారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. సినీ పరిశ్రమకు చెందిన పలు అంశాలపై మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేస్తుందని చెప్పారు. రానున్న రోజుల్లో ఇండస్ట్రీ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై నివేదిక రూపొందించి సర్కార్ అందజేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ రైజింగ్‌లో ఇండస్ట్రీ సోషల్ రెస్పాన్స్‌బిలిటీతో ఉండాలని చెప్పారు. డ్రగ్స్ క్యాంపెయిన్, మహిళా భద్రత క్యాంపెయిన్‌లో చొరవ చూపాలని, టెంపుల్ టూరిజం, ఎకో టూరిజంను ప్రమోట్ చేయాలని సిఎం సూచించారు. ఈ క్రమంలో సినీ పరిశ్రమను ప్రోత్సహించడమే తమ ముఖ్య ఉద్దేశమని రేవంత్‌రెడ్డి అన్నారు. ఇండస్ట్రీ సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం సహకారం అందిస్తుందని భరోసానిచ్చారు. సినీ ప్రముఖులతో సీఎం భేటీ గురువారం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధిలో సినీ పరిశ్రమ సామాజిక బాధ్యతతో ఉండాలని ముఖ్యమంత్రి సినీ పెద్దలకు సూచించారు. బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్‌రాజు ఆధ్వర్యంలో సుమారు 50 మంది సీఎంతో సమావేశమయ్యారు. ఈ భేటీకి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డీజీపీ జితేందర్ తదితరులు హాజరయ్యారు. సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట, అల్లు అర్జున్ అరెస్ట్ అనంతర పరిణామాల నేపథ్యంలో దీనికి ప్రాధాన్యం ఏర్పడింది. సమావేశం ప్రారంభంలో సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించిన వీడియోను సినీ ప్రముఖుల ఎదుట సీఎం ప్రదర్శించారు. అనంతరం పలువురు సినీ పెద్దలు తమ అభిప్రాయాలను ముఖ్యమంత్రితో పంచుకున్నారు. ప్రభుత్వం వైఖరిని సీఎం వారికి వివరించారు. 'ప్రభుత్వం ఇండస్ట్రీతోనే ఉంది. శాంతి భద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. అభిమానుల్ని కంట్రోల్ చేసుకోవాల్సిన బాధ్యత సెలబ్రిటీలదే. తెలంగాణ అభివృద్ధిలో పరిశ్రమ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి. మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన, మహిళా భద్రతపై ప్రచారంలో సినీ ప్రముఖులు చొరవ చూపాలి. ఆలయ పర్యటకం, ఎకోటూరిజంను ప్రచారం చేయాలి. ఇన్వెస్ట్‌మెంట్ల విషయంలోనూ ఇండస్ట్రీ సహకరించాలి. ఇకపై బౌన్సర్ల విషయంలో సీరియస్‌గా ఉంటాం' అని ముఖ్యమంత్రి రేవంత్ తేల్చి చెప్పారు. సినీ పరిశ్రమ సమస్యలను ప్రముఖులు మా దృష్టికి తెచ్చారు. అనుమానాలు, అపోహలు, ఆలోచనలు పంచుకున్నారు. మా ప్రభుత్వం ఇండస్ట్రీకి ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. సినీ పరిశ్రమను ప్రోత్సహించడమే మా ముఖ్య ఉద్దేశం. 8 సినిమాలకు మా ప్రభుత్వం స్పెషల్ జీవోలు ఇచ్చింది. పుష్ప సినిమాకు పోలీసు గ్రౌండ్ ఇచ్చాం. తెలుగు ఇండస్ట్రీకి ఒక బ్రాండ్ సృష్టించాలనే ఈ నిర్ణయం తీసుకున్నాం. ఐటీ, ఫార్మాతో పాటు మాకు ఈ రంగం కూడా ముఖ్యమే. తెలంగాణలో అవార్డులు ఇవ్వడం లేదని తెలిసి గద్దర్ అవార్డును తీసుకొచ్చాం. ప్రభుత్వానికి, పరిశ్రమకు మధ్యవర్తిగా ఉండాలని దిల్ రాజును ఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా నియమించాం. సినీ పరిశ్రమ సమస్యల పరిష్కారం కోసం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశాం. పరిశ్రమ కూడా కమిటీని ఏర్పాటు చేసుకోవాలి. హాలీవుడ్, బాలీవుడ్ హైదరాబాద్ వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. నగరంలో పెద్ద సదస్సులు నిర్వహించి ఇతర సినీ పరిశ్రమలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాం. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు మెరుగు పరుస్తున్నాం. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసి నైపుణ్యాలను పెంచి ఉద్యోగాలు కల్పిస్తున్నాం. ఇండస్ట్రీకి ఏం చేసినా కాంగ్రెస్ ప్రభుత్వాలే చేశాయి. ఆ వారసత్వాన్ని మేమూ కొనసాగిస్తాం. తెలుగు పరిశ్రమ తెలుగుకే పరిమితం కాకుండా అంతా కలిసి అభివృద్ధి చేద్దాం' అని సీఎం వివరించారు. సినీ పరిశ్రమ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వ సహకారం ఉంటుందని.. ఆ మేరకు సినీ ప్రముఖులకు భరోసా ఇచ్చినట్లు ఆ తర్వాత ముఖ్యమంత్రి 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ.. 'ప్రభుత్వం మూలధన పెట్టుబడులు కల్పిస్తేనే మన సినీ పరిశ్రమ ప్రపంచ స్థాయికి ఎదుగుతుంది. హైదరాబాద్ ప్రపంచ సినిమా రాజధాని కావాలనేదే మా కోరిక. యూనివర్సల్ లెవల్‌లో స్టూడియో సెటప్‌లు ఉండాలి' అని తెలిపారు. మర్రి చెన్నారెడ్డి, అక్కినేని వల్లే పరిశ్రమ హైదరాబాద్‌కు వచ్చిందని దర్శకుడు త్రివిక్రమ్ చెప్పారు. 'తెలంగాణలో అద్భుతమైన పర్యటన ప్రదేశాలున్నాయి. ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను హైదరాబాద్‌లో నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. అందరు సీఎంలూ పరిశ్రమను బాగానే చూసుకున్నారు. ఈ ప్రభుత్వం కూడా మాకు ప్రోత్సాహం అందిస్తోంది. దిల్‌రాజును ఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా నియమించడం హర్షణీయం అని దర్శకుడు రాఘవేంద్రరావు అన్నారు. 'నేను చిన్నప్పటి నుంచి పరిశ్రమను చూస్తున్నా. హైదరాబాద్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాలి. చిన్న చిన్న విషయాలను పట్టించుకోవద్దని నిర్మాత శ్యాంప్రసాద్ రెడ్డి అన్నారు. సంధ్య థియేటర్ ఘటన మమల్ని ఎంతగానో బాధించింది. ఎన్నికల ఫలితాల మాదిరిగానే సినిమా రిలీజ్ ఫస్ట్‌డే ఉంటుంది. సినిమా రిలీజ్‌లో పోటీ వల్లే ప్రమోషన్ కీలకంగా మారింది. ప్రపంచ వ్యాప్తంగా సినిమాలు విడుదలవుతున్నందున విస్తృతంగా ప్రమోషన్లు చేస్తున్నాం అని మురళీ మోహన్ అన్నారు. ప్రభుత్వంపై మాకు పూర్తి నమ్మకం ఉంది. ప్రభుత్వం సాయంతోనే ఆ రోజుల్లో సినీ పరిశ్రమ చెన్నై నుంచి హైదరాబాద్‌కు వచ్చింది. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ సహా అన్ని ఏజెన్సీలకు హైదరాబాద్ కేరాఫ్ అడ్రస్‌గా ఉండాలి. నగరాన్ని ఇంటర్నేషనల్ ఫిల్మ్ డెస్టినేషన్‌గా చేయాలనేది మా కల అని నిర్మాత దగ్గుబాటి సురేశ్ బాబు అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశం అనంతరం ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు మీడియాతో మాట్లాడారు. సీఎంతో చర్చించిన విషయాల గురించి తెలియజేశారు. తెలుగు చిత్ర పరిశ్రమ అభివృద్ధే ఈ మీటింగ్ ముఖ్య ఉద్దేశం అని అన్నారు. తెలుగు సినిమా స్థాయిని పెంచేందుకు ముఖ్యమంత్రి తమకు కొన్ని విషయాల్లో దిశా నిర్దేశర చేశారని చెప్పారు. ఇటీవలి కాలంలో పరిశ్రమ, ప్రభుత్వం మధ్య దూరం ఏర్పడిందనే ప్రచారం జరిగిందని, అదంతా కేవలం అపోహ మాత్రమేనని స్పష్టం చేశారు. త్వరలోనే మరోసారి ముఖ్యమంత్రితో భేటీ అవుతామని చెప్పారు. తెలుగు సినీ పరిశ్రమ పట్ల తనకు ఉన్న విజన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాతో పంచుకున్నారు. తెలుగు సినిమాను ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం, పరిశ్రమ కలిసి పనిచేయాలనే దానిపై ఆయన చర్చించారు. అందుకు అనుగుణంగా మేమంతా కలిసి వర్క్ చేస్తాం. ఇండియన్ సినిమా వాళ్లే కాకుండా హాలీవుడ్ వాళ్లు కూడా హైదరాబాద్‌లో షూటింగ్స్ చేసుకునేలా ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలనే విషయంపై చర్చించారు. దానిపై చిత్రపరిశ్రమ మొత్తం మరోసారి చర్చించుకుని ఎఫ్‌డీసీ ద్వారా ఆయనకు సలహాలు, సూచనలు ఇస్తాం. హైదరాబాద్‌ను సినిమా ఇండస్ట్రీకి ఇంటర్నేషనల్ హబ్‌గా మార్చేందుకు అడుగులు వేస్తాం. డ్రగ్స్ విషయంలో ప్రభుత్వానికి సహకరిస్తాం. ఈ మధ్య జరిగిన కొన్ని అనివార్య సంఘటనల వల్ల పరిశ్రమ, ప్రభుత్వం మధ్య దూరం పెరిగిందనే ప్రచారం జరుగుతోంది. అది అపోహ మాత్రమే. ఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా నేను బాధ్యతలు తీసుకుని వారం రోజులు అయింది. యూఎస్ వెళ్లి రాగానే ముఖ్యమంత్రిని కలిశాను. ఇండస్ట్రీ అభివృద్ధి మాత్రమే ఇక్కడ విషయం. బెనిఫిట్ షోలు, టికెట్ రేట్లు అనేది చిన్న విషయం. అది ముఖ్యం కాదు. ఇంటర్నేషనల్‌గా తెలుగు చిత్రపరిశ్రమను అభివృద్ధి చేయడం అనేది అజెండా' అని దిల్ రాజు తెలిపారు.

## మహాకుంభమేళాకు భారీగా ఏర్పాట్లు

ఎవరైనా నీళ్లలో మునిగిపోతే వెంటనే గుర్తించే వారిని కాపాడేలా అండర్ వాటర్ డ్రోన్లను వినియోగంలోకి తెస్తున్నారు. ఇప్పటికే ప్రయాగ్‌రాజ్‌లో పర్యాటకుల వసతి సహా భద్రత కోసం పకడ్బందీ ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తలెత్తకుండా .. మహాకుంభమేళ-2025ని విజయవంతం చేసేలా చర్యలు చేపడుతున్నారు అధికారులు.ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించనున్న మహా కుంభ మేళా 2025 సందర్భంగా భారతదేశం నుంచి మాత్రమే కాదు విదేశాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు అలాగే భారీ సంఖ్యలో సెలబ్రేటీలు పాల్గొనే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రయాగ్‌రాజ్ ఫెయిర్ అథారిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఈ మహా కుంభమేళాలో పాల్గొనే ప్రముఖులందరికీ ఆహ్లాదకరమైన అనుభూతిని అందించడానికి, వారి బస, ఇతర ప్రోటోకాల్‌లకు సంబంధించిన సౌకర్యాలు కల్పించడానికి సన్నాహాలు చేయబడ్డాయి. మహాకుంభమేళా 2025 మొదటి ప్రధాన స్నానోత్సవం (పుష్య మాసం పౌర్ణమి) నుండి అంటే 13 జనవరి 2025న ప్రారంభమవుతుంది. చివరి ప్రధాన స్నానోత్సవం (మహాశివరాత్రి) 26 ఫిబ్రవరి 2025న జరగనుంది. ఈ మహా కుంభ మేళాను మొత్తం 45 రోజుల పాటు నిర్వహించనున్నారు.మహా కుంభమేళా జరిగే సమయంలో యాత్రికులు, పర్యాటకులు, భారతదేశం, విదేశాల నుంచి ప్రముఖులు, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు వస్తారు. జాతర ప్రాంతంలో విశిష్ట/అతి విశిష్ట వ్యక్తుల రాక సమయంలో సౌలభ్యం కోసం, 24 గంటల పాటు అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూం ఏర్పాటు చేయబడింది. ఇక్కడ అధికారులు, ఉద్యోగులు మోహరించనున్నారు. జాతరకు వచ్చే ప్రముఖుల ప్రోటోకాల్ ఏర్పాట్ల కోసం ప్రభుత్వ స్థాయిలో ముగ్గురు అదనపు జిల్లా మెజిస్ట్రేట్లు, ముగ్గురు డిప్యూటీ జిల్లా మెజిస్ట్రేట్లు, ముగ్గురు నాయబ్ తహసీల్దార్లు, నలుగురు అకౌంటెంట్లను నియమించారు. దీనితో పాటు డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులను మొత్తం 25 సెక్టార్‌లలో సెక్టార్ మేజిస్ట్రేట్‌లుగా నియమించారు. వారు వారి సంబంధిత రంగాలలో ప్రోటోకాల్ ఏర్పాట్లను నిర్ధారిస్తారు. ప్రత్యేక ప్రముఖులకు ప్రోటోకాల్ ప్రకారం మహా కుంభ మేళా -2025 సందర్భంగా 50 మంది టూరిస్ట్ గైడ్‌లను , ఇతర సహాయక సిబ్బందిని నియమించడం కూడా జరుగుతుంది. జాతరకు వచ్చే ప్రముఖులకు వసతి సౌకర్యాలు కల్పించేందుకు జాతర ప్రాంతంలో ఐదు చోట్ల 250 టెంట్ల సామర్థ్యంతో సర్క్యూట్ హౌస్ లను ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చే విశిష్ట, అతి విశిష్ట ప్రముఖుల సౌకర్యార్థం టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా 110 కాటేజీలతో కూడిన టెంట్ సిటీ, ఉత్తరప్రదేశ్ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తున్నారు. 2200 కాటేజీలతో టెంట్ సిటీని అభివృద్ధి చేస్తున్నారు. దీని బుకింగ్ ప్రయాగ్‌రాజ్ ఫెయిర్ అథారిటీ ద్వారా చేయబడుతుంది. దీనిని వెబ్‌సైట్ ద్వారా నావిగేట్ చేయవచ్చు. నదిలో స్నానానికి ఘాట్ సిద్ధం చేయడమే కాదు.. జెట్టీ, మోటారు బోటు సౌకర్యం కల్పించనున్నారు. జాతర ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన మొత్తం 15 శాఖలు తమ సొంత శిబిరాలను నిర్మించుకున్నాయి, వీటిలో శాఖల అధికారులు రాక బస చేసేందుకు కాటేజీలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన మొత్తం 21 శాఖలు జాతర ప్రాంతంలో తమ సొంత శిబిరాలను ఏర్పాటు చేశాయి, అందులో డిపార్ట్‌మెంటల్ అధికారులు వచ్చే సమయంలో బస చేసేందుకు కాటేజీలు ఏర్పాటు చేశారు. అంతేకాదు జిల్లా పరిపాలన అధికారులు ప్రయాగ్‌రాజ్‌లో అందుబాటులో ఉన్న 21 అతిథి గృహాలలో వీఐపీలు వసతి కోసం మొత్తం 314 గదులను ఏర్పాటు చేశారు.

## చిల్డ్రన్స్‌డేను మార్చాల్సిందే

సాహసయోధులైన సాహిబ్‌జాదా జొరావర్ సింగ్, సాహిబ్‌జాదా ఫతే సింగ్‌లకు ఘన నివాళులర్పించి, వారి త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్ రావు, పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. 1500 ఏండ్ల క్రితం భారతీయత కోసం, ధర్మం కోసం పదవ సిక్కు గురువు శ్రీ గురు గోవింద్ సింగ్ కుమారులైన.. బాబా జోరావర్ సింగ్, బాబా ఫతే సింగ్ బలిదానమయ్యారని తెలిపారు. డిసెంబర్ 26ను వీర్ బాల్ దివస్‌గా గుర్తించడం వారి త్యాగానికి, ధైర్యానికి ఘన నివాళి అని అన్నారు. భారతీయ జనతా పార్టీ తరఫున, తెలంగాణ ప్రజల తరఫున ఆ వీరపుత్రులకు ఘన నివాళులర్పిస్తున్నామని కిషన్ రెడ్డి తెలిపారు. వారిద్దరు సిక్కుల పథానికి, ధర్మానికి అంకితమై తమ ప్రాణాలను అర్పించి చిన్న వయసులోనే అమరులైన వీరులు అని కొనియాడారు. మన దేశంలో ప్రతి సంవత్సరం నవంబరు 14న బాలల దినోత్సవం జరుపుకుంటాం.. అదేవిధంగా డిసెంబరు 26న వీర్ బాల్ దివస్ వేడుకలు జరుపుకుంటున్నామని అన్నారు. ప్రధానమంత్రి మోడీ వీర్ బాల్ దివస్‌ను యావత్ భారతదేశానికి స్ఫూర్తిదాయకంగా నిర్వహించాలని పిలుపునిచ్చారని పేర్కొన్నారు. డిసెంబరు 2022లో సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో వీర్ బాల్ దివస్ కార్యక్రమాలు మొదటి సారిగా నిర్వహించబడ్డాయని కేంద్రమంత్రి తెలిపారు. సాహిబ్‌జాదా జోరావర్ సింగ్, సాహిబ్‌జాదా ఫతే సింగ్‌ల ధైర్యం, త్యాగాలకు నివాళి అర్పించడం జరిగిందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. నవంబర్ 14 బాలల దినోత్సవం జరుపుకుంటున్నాం.. ఆ రోజుకు బాలల దినోత్సవం జరుపుకోవడానికి సంబంధం లేదని అభిప్రాయపడ్డారు. మార్చాల్సిన అవసరం ఉంది.. డిసెంబర్ 26 చిల్డ్రన్ డే జరుపుకోవడానికి సరైన రోజని కిషన్ రెడ్డి వెల్లడించారు.

## మహారాష్ట్రలో ఓటర్ల జాబితా కుట్ర

బెంగళూరు : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. బెళగావిలో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో రాహుల్ మాట్లాడారు. ఓటర్ల జాబితాలో కుట్ర జరిగిందని ఆరోపించారు. 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత మహారాష్ట్రలోని 118 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 72 లక్షల మంది కొత్త ఓటర్లు చేరారని తెలిపారు. ఆ నియోజకవర్గాల్లో 102 స్థానాలను బీజేపీ గెలుచుకుందని వెల్లడించారు. ఓటర్ల జాబితాలో మార్పులు కారణంగానే బీజేపీ ఎన్ని స్థానాలు గెలుచుకుందని పేర్కొన్నారు. మహారాష్ట్ర ఫలితాల వెనుక సీఈసీ పాత్ర అనుమానాస్పదంగా ఉందని ధ్వజమెత్తారు. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ ప్రతినిధి బృందం.. ఎన్నికల సంఘాన్ని కలిసి ఆందోళన వ్యక్తం చేసింది. ఓటర్ల జాబితాలోని వ్యత్యాసాలను, ఓటర్ల సంఖ్య అసాధారణంగా పెరగడాన్ని ఎత్తి చూపించింది. లోక్‌సభ ఎన్నికల తర్వాత 47 లక్షల మంది ఓటర్లు కొత్తగా చేరారని చేపించింది. అయితే కాంగ్రెస్ ఆరోపణలను ఈసీ తోసిపుచ్చింది. కేవలం 2 శాతం మందే కొత్తగా చేరారని తెలిపింది. కొత్త ఓటర్లంతా 18-19 వయసు వారని పేర్కొంది.మహారాష్ట్రలో మొత్తం 288 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. మహాయుతి కూటమి 230 స్థానాలు గెలుచుకుంది. బీజేపీ 132, శివసేన 57, ఎన్సీపీ 41 స్థానాలు గెలుచుకుంది. కాంగ్రెస్ కేవలం 16 స్థానాలే గెలుచుకుంది. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ (92) (ఓజీనిపనీతజీని ఈూతినిణర) తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆయన ఆరోగ్యం క్షీణించడంతో దిల్లీ ఎయిమ్స్‌కి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం అత్యంత విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ, పలువురు కాంగ్రెస్ నేతలు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో ఎయిమ్స్ వద్ద భద్రతను పెంచారు.

## ప్రమాదంలో మహాత్మాగాంధీ వారసత్వం

స్వాతంత్య్రం కోసం ఎలాంటి పోరాటం చేయని సంస్థలు మహాత్మా గాంధీని తీవ్రంగా వ్యతిరేకించాయని, ఒక విషతుల్యమైన వాతావరణాన్ని ఏర్పాటు చేశాయని, వీటి వల్లే ఆయన హత్య జరిగిందని, కేంద్రంలో అధికారంలో ఉన్న వారి వల్ల గాంధీ ఘటన ప్రమాదంలో పడిందని అన్నారు. న్యూఢిల్లీలో అధికారంలో ఉన్నవారు, వారి సిద్ధాంతాలు, సంస్థల నుంచి మహాత్ముడి వారసత్వానికి ముప్పు ఉందని చెప్పారు. ఇదే వేదిక నుంచి భాజపాపై కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. రాజ్యాంగపరమైన సంస్థలను తమ గుప్పిట్లో ఉంచుకునేందుకు ఆ పార్టీ విశ్వ ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. 'జవహర్‌లాల్ నెహ్రూ, గాంధీ సిద్ధాంతాలు, బీఆర్ అంబేడ్కర్ గౌరవం కోసం చివరి శ్వాస వరకు మేమంతా పోరాడుతాం. ఈసీ నిష్పాక్షికతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎన్నికల నియమావళిలో మార్పుల ద్వారా కేంద్రం ఏం చేయాలను కుంటోంది..?' అని ఖర్గే ప్రశ్నించారు. వచ్చే ఏడాదిలో పార్టీలో ఖాళీగా ఉన్న స్థానాలను భర్తీ చేస్తామని మల్లికార్జున ఖర్గే తెలిపారు. ఎన్నికల్లో నెగ్గేందుకు అవసరమైన నైపుణ్యాలతో పార్టీని మరింత బలంగా సన్నద్ధం చేస్తాం. కేవలం శ్రమిస్తే మాత్రమే సరిపోదు. సమయానుకూలంగా వ్యూహాలు ఉండాలి. ఒక నిర్దిష్ట మార్గం అవసరం. కొత్త నాయకత్వానికి అవకాశం ఇవ్వాలి' అని పేర్కొన్నారు. కాగా.. బెళగావిలో 'నవ సత్యాగ్రహ బైఠక్' (సీడబ్ల్యూసీ సమావేశం) ప్రారంభమైంది. జెండా ఎగురవేసి కార్యక్రమాన్ని ఖర్గే ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ సీనియర్ నేతలు రాహుల్ గాంధీ, జైరాం రమేశ్, సిద్ధరామయ్య, డీకే శివకుమార్, భూపిందర్ హుడా, రాజీవ్ శుక్లా తదితరులు హాజరయ్యారు.

## సినిమా వాళ్ళు బెదరించే ప్రయత్నం

సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో తీవ్రంగా ఘాయపడి కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను గురువారం భారాస నేతలు పరామర్శించారు. ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, వివేకానంద, బండారు లక్ష్మారెడ్డి, సీనియర్ నేతలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, నవీన్ రావు తదితరులు ఆసుపత్రికి చేరుకుని బాలుడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ప్రకటించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. 'శ్రీతేజ్‌కు మెరుగైన వైద్యం అందిస్తున్నట్టు కిమ్స్ డాక్టర్లు చెప్పారు. బాలుడు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాం. శ్రీతేజ్ తండ్రి భాస్కర్‌కు మనోధైర్యం ఇమ్మని కేసీఆర్ ఆదేశించారు. మృతిచెందిన రేవతి ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తున్నాం.

## గ్రూప్ -1అభ్యర్థులకు హైకోర్టు షాక్

ఇప్పటికే గ్రూప్-1 పరీక్షలు పూర్తి అయ్యాయి. దీంతో రిజర్వేషన్లు తేలేంత వరకు గ్రూప్-1 ఫలితాలను ఆపాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది.

## ఖరీదైన కారుకు మంటలు

### 45 నిమిషాలు శ్రమించి మంటలు ఆర్పివేసిన సిబ్బంది

ముంబై : మహారాష్ట్ర ముంబైలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. కోస్టల్ రోడ్‌లో కోట్ల ఖరీదైన లగ్జరీ లాంబోర్గినీ కారు మంటల్లో చిక్కుకుంది. బుధవారం రాత్రి 10:20 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకొని దాదాపు 45 నిమిషాలు శ్రమించి మంటలను ఆర్పివేశారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు తెలియరాలేదు. గుజరాత్ రిజిస్ట్రేషన్‌తో ఉన్న ఆరెంజ్ కలర్ కారు క్యాబిన్‌లో మంటలు వస్తున్న వీడియోను వ్యాపార దిగ్గజం గౌతమ్ సింఘానియా ఎక్స్ వేదికగా షేర్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది. ఈ కారు ఖరీదు రూ.9 కోట్లు అని సమాచారం.

### ప్రజాస్వామ్య పరిరక్షణ, మత రాజకీయాలకు వ్యతిరేకంగా

# సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలి

## • సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రజాస్వామ్య పరిరక్షణకు, మత రాజకీయాలకు వ్యతిరేకంగా సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. కమ్యూనిస్టు పార్టీ స్థాపించి నేటికి 100 సంవత్సరాల శతజయంతి ఉత్సవాల సందర్భంగా గురువారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో సిపిఐ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సదానందం మాట్లాడుతూ100 సంవత్సరాల వ్యవధిలో కమ్యూనిస్టు పార్టీ ఎన్నో పోరాటాలు చేసి ఎన్నో విజయాలను సాధించిందని, కమ్యూనిస్ట్ పార్టీ అఫ్ ఇండియా (సిపిఐ) పార్టీ 1925 డిసెంబర్ 26,వతేదీన కాన్పూర్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో స్థాపించబడిందని, నాటి స్వతంత్ర ఉద్యమం నుండి నేటి తెలంగాణ ఉద్యమం వరకు వీరోచితంగా పోరాడింది కమ్యూనిస్టు లేనని అన్నారు.కమ్యూనిస్టు పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పదవులు ఉన్నా లేకున్నా ప్రతినిత్యం ప్రజల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కడు పేద వాడికి అండగా కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన, మహిళా, ఉద్యోగ, ఉపాధ్యాయ, రచయితలు, కళలు, కళారంగం , శాస్త్ర సాంకేతిక రంగాలు, పత్రికా మీడియా రంగాలు , ఏర్పాటు చేసి దేశ అభివృద్ధి లో దేశ ప్రజల సంక్షేమంలో సిపిఐ పాత్ర మరువ లేనిదన్నారు. ఈ రోజు ప్రజలు దేశం లో భరోసా గా జీవిస్తున్నారని, కానీ బిజెపి ప్రభుత్వం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్నారని, దీనికి నిదర్శనమే హెూం మంత్రి పార్లమెంటులో అమీత్ షా వ్యాఖ్యలే నిదర్శనమని, ఇప్పటికైనా హెూం మంత్రి జాతికి క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని, లేకుంటే సిపిఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. అలాగే తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఆరు గ్యారెంటీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే సిపిఐ తగిన రీతిలో స్పందిస్తుందని తెలిపారు. 100 ఏళ్లుగా ఎర్ర జెండా ను మోస్తున్న వీరులకు వారి కుటుంబాలకు , వీర మరణం పొందిన అమరులకు కష్టాలు కన్నీళ్లు ఎన్నో త్యాగాలు తో పార్టీ ని కాపాడుతున్న ప్రతి కమ్యూనిస్టు ముద్దు బిడ్డలకు విప్లవ జోహార్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కోడం స్వామి,అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు ఆరెపల్లి మానస్ కుమార్.సిపిఐ పట్టణ కార్యదర్శి చంద్రగిరి ఉదయ్, అంజి, సహాయ కార్యదర్శి కళ్లేపల్లి శంకర్, ఓదెలు, నవీన్, లక్ష్మణ్, శంకర్, బండారి సదానందం, రవి, రమేష్ మరియు వివిధ శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.

# భగవతి, ఆర్విన్ ట్రీ పాఠశాలలలో క్రీడా పండుగలు





**కరీంనగర్ టౌన్, డిసెంబర్26(ది క్రైమ్ న్యూస్):** ఫిట్ ఇండియా స్ఫూర్తితో స్థానిక భగత్ నగర్ లోని భగవతి, ఆర్విన్ ట్రీ పాఠశాలలో ఫిట్ఎక్స్ పో -2024 పేరుతో ఆటలపోటీల ప్రారంబోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా ఒలంపిక్ సంఘం ముఖ్య కార్యదర్శి జనార్ధన్ రెడ్డి, యుఏఈ దేశంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ భగవతి, ఆర్విన్ ట్రీ పాఠశాలలకు విద్యావిధానం పై సహకారాన్ని అందిస్తున్న ప్రతాప్ ముఖ్య అతిథులుగా హాజరైనారు. అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బాగంగా ముందుగా రిలే టార్చి పరుగును ముగించి విద్యార్థుల పరేడ్ గౌరవవందనాన్ని అతిథులు స్వీకరించారు. పాఠశాలల చైర్మెన్ బి. రమణరావు మాట్లాడుతూ విద్యార్థులు కేవలం తరగతి గదులకే పరిమితం కాకుండా వినూత్నమైన ఆలోచనలకు పదును పెట్టే విధంగా మరియు శరీరక దారుఢ్యాన్ని పెంపొందించడానికి ఆటలు ఎంతో ఉపయోగపడతాయి అనే ఉద్దేశంతో క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన జనార్ధన్రెడ్డిగారు మాట్లాడుతూ ప్రతిఒక్కరు కూడా శారీరక శ్రమ కలిగి ఉన్నప్పుడే ఆరోగ్యాన్ని కాపాడుకోగలుగుతారని అన్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులు అటల యందు మక్కువ చూపాలని అప్పుడే ఉన్నత వ్యక్తులుగా ఎదుగుతారని, ప్రతి విషయాన్ని కూడా విని అలోచించి సాధించాలని కోరారు.పాఠశాలల చైర్మెన్ బి. రమణరావు ఆటలపోటీల కార్యక్రమాన్ని ఎంతో అట్టహాసంగా ప్రారంబిస్తూ విద్యార్థులచే అటలకై ప్రమాణ స్వీకారాన్ని చేయించారు. కారక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన పలు వ్యాయామ నృత్యాలు, ఎరోబిక్స్, నృత్యాలు ఎంతగానో అలరించాయి. విద్యార్థులకు వివిధ రకాలైన ప్రత్యేకమైన ఆటలను నిర్వహించారు. చిన్న పిల్లలకై మ్యాజికల్ చైర్, ఫ్రాగ్ జంప్, త్రోబాల్, ఇన్ డోర్ బౌలింగ్ తదితర వినూత్నమైన క్రీడలను నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో ఈ క్రీడలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఏబీవీపీ రాష్ట్ర కమిటీలో పెద్దపల్లి జిల్లా వాసులు



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఏబీవీపీ విద్యార్థి సంఘం 43వ రాష్ట్ర మహాసభలు సిద్దిపేట జిల్లాలో ఈ నెల 23,24,25, నిర్వహించారు. ఈ మహాసభలలో విద్యారంగ, సామాజిక సమస్యలపై అనేక తీర్మానాలు చేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జానారెడ్డి రామ్ రాష్ట్ర కమిటీని ప్రకటించారు. ఈ కమిటీలో పెద్దపల్లి జిల్లా వాసులకు సంచితస్థానం దక్కినది. రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ గా పెద్దపల్లి మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన శ్రీపతి సాయి తేజ, ( స్టూడెంట్ ఫర్ డెవలప్మెంట్) రాష్ట్ర కో కన్వీనర్ గా పాలకుర్తి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మారం సందీప్, ( స్టూడెంట్ ఫర్ సేవ) రాష్ట్ర కో కన్వీనర్ గా ఎలిగేడు మండలం దుళికట్ట గ్రామానికి చెందిన సందనవేణి ఓమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కమాన్పూర్ పట్టణానికి చెందిన జంగపల్లి అరవింద్, పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి గ్రామానికి చెందిన యతిరాజు అజయ్, నియమించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాపై నమ్మకంతో మాకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తామని విద్య రంగ సమస్యలపై అరుపెరుగని పోరాటం చేస్తామని వారన్నారు రాష్ట్ర శాఖకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## గుండెపోటుతో కార్మికుడు మృతి



**ముత్తారం.డిసెంబర్.26.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలంలోని మచ్చుపేట గ్రామానికి చెందిన సింగరేణి రిటైర్డు కార్మికుడు దుండె రాజేషం (62) బుధవారం రాత్రి సమయంలో గుండెపోటుతో మృతి చెందాడు.కుటంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి సమయంలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడగా సెంటనరికాలనిలోని తన కుమారునికి సమాచారం అందించాడు.ఇంటికి చేరుకున్న కుమారుడు సిపిఆర్ చేయగా ఒక్కసారి స్పృహలోకి వచ్చిన తరువాత ఆసుపత్రికి తీసుకెళ్లే క్రమంలో మార్గమధ్యలో మరణించినట్లు కుంటుంబ సభ్యులు తెలిపారు.కాగా సింగరేణి కార్మికుడిగా ఉన్న సమయంలో యూనియన్ నాయకుడిగా ఉన్నాడు.మృతునికి భార్య శ్యామల,కూతురు రజిత, కుమారుడు వినిత్ ఉన్నారు.రాజేషం మృతదేహనికి ముత్తారం మండల కాంగ్రెస్ నాయకులు నివాళులు అర్పించారు.

## తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటు



**ఇల్లందకుంట డిసెంబర్ 27 (ది క్రైమ్ న్యూస్):** నూతనంగా మండల ఏర్పాటయినప్పటి నుండి గత ప్రభుత్వం బస్టాండ్ ఏర్పాటు చేయక ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారు. మండల కేంద్రంలో తాత్కాలిక బస్టాండును ఏర్పాటు చేయడం కోసం దాతలు భామండ్ల శివన్న ముందుకు వచ్చారు. ఉమ్మడి జమ్మికుంట మండలం అంకుశ పురం గ్రామానికి చెందిన బామండ్ల పల్లి శివన్న తన తండ్రి మహా లింగం జ్ఞాపకార్థం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో, శ్రీరాములపల్లి గ్రామంలో తాత్కాలి బస్టాండ్ ను ఏర్పాటు చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండ్ ను ఆరే సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శెట్టిపల్లి శివాజీ, జిల్లా అధ్యక్షులు ఇంగిలే రామారావు కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ జెండా రాజేష్ వరంగల్ జిల్లా ఆరే సంఘం నాయకులు కె. మనోహర్ రావు, నాగేశ్వరరావు శ్రీనివాస్ వీరన్న లక్ష్మయ్య వెంకటేశ్వర్లు రాజు ప్రభాకర్ సుధాకర్ సుధాకర్ రామారావు పేదల పాల్గొన్నారు.

## దేవాలయానికి నుస్తులాపూర్ మాజీ సర్పంచ్ విరాళం



**తిమ్మాపూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నల్లగొండ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయానికి నుస్తులాపూర్ మాజీ సర్పంచ్ రావుల రమేష్ రూ50వేలు విలువ చేసే ఏసీని విరాళంగా గురువారం ఆలయ కమిటీకీ అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు రావుల రమేష్ కు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బండారిపల్లి లక్ష్మణ్ గౌడ్, డైరెక్టర్లు కందుకూరి లక్ష్మీరాజ్యం, అంజయ్య, భేతి శ్రీనివాస్ రెడ్డి, నూనె సురేష్, వంగల శ్రీనివాస్ రెడ్డి (పెద్ద), అజ్జు భాయ్, రాములు,బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ కనకయ్య ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## మృతునికి నివాళులు అర్పించిన కాంగ్రెస్ నాయకులు



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)డిసెంబర్ 26:** మచ్చుపేట గ్రామానికి చెందిన దుండ రాజేశం మృతదేహానికి కాంగ్రెస్ నాయకులు గురువారం నివాళులు అర్పించారు.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మచ్చుపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దుండ రాజేశం బుధవారం రాత్రి గుండెపోటుతో మరణించగా వారి మృతి దేహానికి పూలమాలవేసి వాళ్ళ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తోట చంద్రయ్య, రామగిరి మండలం తాజా మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య , రామగిరి మండల ప్రచార కమిటీ కన్వీనర్ ముస్తాలశ్రీనివాస్, సెంటనరీ కాలనీ టౌన్ ప్రెసిడెంట్ కాటం సత్యం, ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు వాజిద్ భాష తదితరులు పాల్గొన్నారు..

# సంపాదకీయం

## దర్యాప్తు సంస్థలను బలోపేతం చేయాలి !

కేంద్ర దర్యాప్తు సంస్థలు సిబిఐ, ఇడిలను బలోపేతం చేయడంతో పాటు నిజాయితీగా పనిచేసే సంస్థలుగా తీర్చిదిద్దాల్సి ఉంది. మెరికలైన అధికారులను వీటికి కేటాయించాలి. ఎలాంటి కేసునైనా ఛేదించి ఫలితం చూపేలా తయారు చేయాలి. దేశంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారి గుండెల్లో రైళ్లు పరుగెత్తిం చాల్సి అవసరం ఉంది. కానీ ఇప్పుడు రాజకీయ పార్టీలకు ఇడి, సిబిఐలు అంటే భయం లేకుండా పోయాయి. వీటి సమర్థతపై ఉన్న అనుమానాలే దీనికి కారణమని వేరుగా చెప్పనక్కరలేదు. ఈ విషయంలో మోడీ ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకోవాల్సి ఉంది. కేవలం రాజకీయ కక్ష తీర్చుకునేందుకు వీటిని ఉపయోగి స్తున్నారన్న ఆరోపణల నుంచి బయటపడాలి. ఇప్పటివరకు ఏ ఒక్క కేసులోనూ నిగ్గు తేల్చిన దాఖలాలు లేవు. మద్యం కేసు కావచ్చు..ఇతర అవినీతి కేసులు కావచ్చు..ఏవీ ముందకు సాగడం లేదు. అంతెందుకు వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసును ఆరేళ్లయినా నిగ్గు తేల్చలేదు. అందుకే దర్యాప్తు సంస్థల ప్రతిష్టను పెంచేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలి. ఇకపోతే ఢిల్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ విమర్శలకు పదను పెడుతున్నారు. బిజెపికి కేజ్రీవాల్ సవాళ్లు విసురుతున్నారు. ఇదే క్రమంలో ఢిల్లీ సిఎం అతిషిపైనా కేసులు తప్పకపోవచ్చన్న ప్రకటన చేశారు. బిజెపి కేసులతో లొంగదీసుకోవాలని చూస్తోందని మండిపడ్డారు. నిజానికి బిజెపి ముందు ఇప్పుడు ఢిల్లీ ఎన్నికలు తప్ప మరో ఎన్నిక లేదని చెప్పాలి. ఢిల్లీలో మరోమారు అధికారం కోసం కేజ్రీవాల్ చెమటోడుస్తున్నారు. అయితే గతంతో పోలిస్తే అంత సులభంగా విజయం దక్కక పోవచ్చు. ఆప్‌కు చెందిన అనేకులు పార్టీని వీడి బిజెపిలో చేరారు. అయితే రాజకీయ ప్రత్యర్థులను వేధించడమే లక్ష్యంగా మోడీ సర్కారు కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడానికి బరితెగిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. తమకు అనుకూలంగా ఉన్నవారిని ఒక రకంగా లేనివారిని మరో రకంగా చూస్తున్నారు. జగన్, కెసిఆర్ విషయంలో మాత్రం బిజెపి ఎందుకనో వెనకడుగు వేసింది. ఈ ఇద్దరిపైనా అవినీతి ఆరోపణలు చేసినా, పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పటికీ బిఆర్ఎస్‌తో లోపాయకారి అవగాహన ఉందన్న ప్రచారం ఉంది. ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగట్టడంతో పాటు, తెలంగాణలో ఓ ప్రాంతీయ పార్టీ అవసరం ఉందని బిజెపి గుర్తించివుంటుంది. అందుకే బిఆర్ఎస్ అవినీతిపై మాట్లాడినా పెద్దగా పట్టించుకోవడం లేదు. కవిత విసయంలో కూడా కేసు పెద్దగా బలంగా లేదన్న వాదనలు ఉన్నాయి. ఈ కేసులో కేజ్రీవాల్, కవితలు ఇద్దరూ బెయిల్‌పై బయలకు వచ్చారు. అందుకే గత కెస్ ప్రభుత్వంపై వచ్చిన అవినీతి ఆరోపణలపై బిజెపి నేతలు స్పందించడం లేదు. జగన్ లోపాయకారిగా బిజెపికి అనుకూలంగా ఉన్నాడని విమర్శలు ఉన్నాయి. తెలంగాణలో కూడా కెసిఆర్ అనుకూలంగా ఉన్నందువల్లే ఆయనపైనా ఈగ వాలనీయడంలేదని అంటున్నారు. ఈ విషయమై ఎన్ని విమర్శలు చేసినా కేంద్ర ప్రభుత్వ వైఖరిలో నామమాత్రపు మార్పు కూడా కనిపించడంలేదు. గతంలో విపక్షాలపై అదేపనిగా కేసులు పెట్టడంతో ప్రతిపక్షాలన్నీ కలిసి మూకుమ్మడిగా అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చింది. ఇడి, సిబిఐ వంటి సంస్థలను తమ జేబు సంస్థలుగానే మోడీ ప్రభుత్వం భావిస్తోందని ఇండియా కూటమి బాహాటంగానే విమర్శిస్తోంది. ప్రతిపక్షనేతలను నయానో, భయానో లొంగదీసుకోవడానికి, అలా లొంగని వారిని కేసులతో వేధించడానికి ఆ సంస్థలను దుర్వినియోగ పరుస్తున్న తీరుపై రాజకీయ పార్టీలో ఆందోళన చెందుతున్నాయి. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను కేసుల్లో ఇరికించినా ఆయన మళ్లీ అధికారం చేపట్టగలిగారు. బిజెపి నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా గట్టిగా పోరాడుతున్నందునే ఇడిని ఉపయోగించి కేసులు పెడుతున్నారని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఎప్పటినుంచో ఆరోపిస్తోంది. దేశ రాజధాని ఢిల్లీలోనూ ఇదే స్థితి. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆప్ అధ్యక్షుడు కేజ్రివాల్‌తో పాటు ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు ఇడి బాధితులుగా మారడానికి కారకులెవరో అందరికీ తెలిసిందే. ఇలా చెప్పుకుంటూ పోతే బిజెపి దుర్నీతికి, దుర్వినియోగానికి ఉదాహరణాలెన్నో! 2014వ సంవత్సరంలో నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి గత ఏడాది జనవరి వరకు దేశ వ్యాప్తంగా 121 మంది రాజకీయ నేతలపై ఇడి కేసులు పెట్టి విచారణ చేపట్టింది. వీరిలో 115 మంది అంటే 95 శాతం మంది ప్రత్యర్థి రాజకీయ పార్టీలకు చెంది, బిజెపిని గట్టిగా వ్యతిరేకించే వారే కావడం గమనార్హం. ఇలా కేసులు నమోదైన వారు బిజెపిలో చేరితే వెంటనే వారిపై నమోదైన కేసులను ఎత్తివేయడం, వారిలో కొందరికి ప్రభుత్వ పదవులను సైతం కట్టబెట్టడం మోడీ సర్కారు బరితెగింపునకు మరో నిదర్శనం. మరోవైపు ఇడి కేసుల్లో నేరం రుజువై శిక్షపడినవి చాలా తక్కువ. అధికారిక లెక్కల ప్రకారం 2011 నుండి ఇడి 1600 కేసులు నమోదు చేసి, 1800 దాడులను ఇడి నిర్వహించింది. అయినా, భయపడుతున్నారంటే ఇతర దర్యాప్తు సంస్థలకు లేని ప్రత్యేక అధికారాలు ఇడి కి ఉండటమే కారణం. ముఖ్యంగా న్యాయస్థానాల అనుమతి లేకుండానే ఆస్తులు జప్తు చేసే అధికారం ఒక సారి కేసు నమోదైతే నేరం చేయలేదని రుజువు చేసుకునే బాధ్యత నిందితునిపైనే మోపడం వంటి అధికారాలను ఇ.డి కి అప్పగించారు. ప్రస్తుత పార్లమెంటులోని ప్రతిపక్ష సభ్యుల్లో దాదాపు 90 శాతం మంది ఏదో ఒక కేంద్ర దర్యాప్తు సంస్థ నిఘానీడలో ఉన్నట్లు ఇటీవల విడుదలైన ఒక నివేదిక పేర్కొంది. తీవ్ర స్థాయిలో జరుగుతున్న ఈ అధికార దుర్వినియోగాన్ని అరికట్టి, దర్యాప్తు సంస్థల నిష్పాక్షికతపై ప్రజానీకంలో తిరిగి నమ్మకం కలిగించాల్సి ఉంది. దర్యాప్తు సంస్థలకు స్వయం ప్రతిపత్తి మాత్రమే దీనికి పరిష్కారం. ఇలా చేయడం వల్ల నిజంగానే తప్పులు చేసిన వారి భరతం పట్టవచ్చు.

# హిమాచల్, కాశ్మీర్‌లపై మంచుదుప్పటి



### మంచు కారణంగా జాతీయ రహదారుల మూసివేత

### ఉత్తరాది రాష్ట్రాల్లో పెరిగిన చలిగాలులు

న్యూఢిల్లీ : హిమాచల్‌ప్రదేశ్, జమ్ముకాశ్మీర్, ఉత్తరాఖండ్‌లపై దట్టమైన మంచు దుప్పటి పరుచుకుంది. దట్టమైన మంచుతో పలు జాతీయ రహదారులను మూసివేసినట్లు అధికారులు ప్రకటించారు. హిమాచల్‌ప్రదేశ్‌లో మూడు జాతీయ రహదారులతో పాటు సుమారు 266 రహదారులు మూసివేయబడ్డాయి. మూసివేసిన 266 రహదారుల్లో సిమ్లాలో 123, లాహౌల్‌లో 36, స్పితి, కులులో 25 ఉన్నాయి. 173 ట్రాన్స్‌ఫార్మర్‌లకు అంతరాయం ఏర్పడిందని, దీంతో రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని తెలిపింది. హిమాచల్‌ప్రదేశ్‌లో తీవ్రమైన చలి పరిస్థితుల కారణంగా భారత వాతావరణ విభాగం (ఐఎండి) 'ఆరెంజ్' అలర్ట్ జారీ చేసింది. దట్టమైన పొగమంచు ఉండే అవకాశం ఉందని, కొన్ని ప్రాంతాల్లో వారాంతంలో వర్షం, మంచు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో భారీ హిమపాతం కురిసింది. త్యుని-చక్రతా-ముస్సోరి జాతీయ రహదారిపై 30 కి.మీ మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. రాష్ట్రంలోని ధరణాధర్-కోటి కనసర్ రహదారిపై భారీ మంచుతో ఢిల్లీ నుండి వచ్చిన ఇద్దరు పర్యాటకులు చిక్కుకుపోయారని స్థానిక మీడియా తెలిపింది. ఉత్తర భారతదేశంలోని అనేక ప్రాంతాల్లోనూ దట్టమైన మంచు కమ్మేసింది. జమ్ముకాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో కనిష్ట ఉష్ణోగ్రత మైనస్ 7 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. ఇకపోతే చలి తీవ్రతతో ఉత్తర భారతం గజగజలాడుతోంది. ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతున్నాయి. కశ్మీర్‌లోని పలు ప్రదేశాలు చలికి అల్లాడిపోతున్నాయి. జలాశయాలు గడ్డకట్టుకుపోయాయి. నీటి సరఫరా గొట్టాల్లో నీరు గడ్డకట్టేస్తోంది. శ్రీనగర్‌లో మైనస్ 7.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. రాబోయే రెండ్రోజుల్లో ఇది మరో 2-3 డిగ్రీల వరకు తగ్గిపోతుందని వాతావరణ విభాగం అంచనా వేసింది. కశ్మీర్‌లో అత్యంత చల్లగా ఉండే 40 రోజుల కాలం ఈ నెల 21న ప్రారంభమైంది. అప్పటి నుంచి కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా ఉంటున్నాయి. అమర్‌నాథ్ యాత్రకు బేస్‌క్యాంపు అయిన పహేల్గామ్‌లో మైనస్ 8.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంది. రాజస్థాన్‌లోని అనేక ప్రాంతాలను దట్టమైన పొగమంచు కమ్మేస్తోంది. పశ్చిమ రాజస్థాన్‌లోని పలు ప్రాంతాలకు అత్యంత చల్లని రోజుగా బుధవారం నిలిచిపోయింది. పంజాబ్, హరియాణాల్లోనూ శీతల గాలులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దిల్లీని పొగమంచు కప్పేసింది. దిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతాల్లో బుధవారం తెల్లవారుజామున 9.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మంచు దట్టంగా కురుస్తూ.. 100 మీటర్ల దూరంలో ఉన్న వాహనాలు కూడా కన్పించని పరిస్థితి నెలకొంది. దీంతో పలు విమానాలు, రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం వాటిల్లింది. వాయు నాణ్యతా సూచీ (ఏక్యూఐ) 334గా నమోదైంది.

# కేడర్‌ను కాపాడుకునే యత్నం



### కూటమి ప్రభుత్వం విఫలం అయ్యిందన్న ప్రచారం

### కొత్త ఎత్తులతో ప్రజల్లోకి వెళ్లేలా వైకాపా అడుగులు

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో ఆరు నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ ఘోరంగా పరాజయం పాలయ్యాక ఇప్పుడు మళ్లీ తమదే అధికారం అంటూ..ఆ పార్టీ నేతలు బల్లగుద్ది చెబుతున్నారు. పార్టీ అధినేత కూడా కూటమి ప్రభుత్వానికి కాలంచెల్లిందని విమర్శలుచేస్తున్నారు. ఆరునెలల్లోనే ప్రభుత్వం అప్రతిష్టను మూటకట్టుకుందని, అన్నిరంగాల్లోనూ విఫలంఅయ్యిందని విమర్శలుచేస్తోంది. జనవరి నుంచి నియోజకవర్గాల బాట పట్టాలని వైసీపీ అధినేత జగన్ నిర్ణయించుకున్నారు. దీనికి తగ్గట్టుగానే కేడర్, లీడర్‌లను సమాయత్తం చేసేందుకు అదిగో ఎన్నికలు అన్నట్టు ప్రచారం చేస్తోంది. జమిలి ఎన్నికల బిల్లు పార్లమెంట్‌లో ఉంది. దీనిపై జేపీసీ స్టడీ చేస్తోంది. అది వచ్చే పార్లమెంట్ సమావేశాలకు ఆమోదం పొందుతుంది. అది అమోదం పొంది అమల్లోకి వస్తే మాత్రం 2027లోనే ఎన్నికలు వస్తాయని వైసీపీ చెబుతోంది. అధినేత నుంచి గల్లీ లీడర్ వరకు అంతా అదే ప్రచారం చేస్తున్నారు. దీనికి చాలా కారణాలు ఉన్నాయి. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన షాక్ నుంచి ఇంకా చాలా మంది వైసీపీ నేతలు తేరుకోలేక పోతున్నారు. అలాంటి తీర్పు ఎలా ఇచ్చారనే మధనపడుతున్నారు. మరికొందరు కూటమి పార్టీల్లో ఏదో పార్టీలో చేరిపోవాలనే ఆలోచన చేస్తున్నారు. ఇప్పటికే చాలా మంది ఆ పని చేశారు కూడా. కొన్ని నియోజకవర్గాల్లో ఇన్చార్జ్‌లు లేకపోవడంతో ఎవరితో నడవాలో తెలియని పరిస్థితిలో కేడర్ ఉంది. ఇలాంటి స్థితిని హ్యాండిల్ చేయలేకుంటే పార్టీకి భారీగా డ్యామేజ్ తప్పదని గ్రహించిన వైసీపీ ఇదిగో ఎన్నికలు అంటూ ప్రచారం చేస్తోంది. ఒక వేళ 2027లో ఎన్నికలు జరిగితే ఇంకా మూడేళ్లే నాలుగేళ్లే ఉందని నేతలంతా జనంలో ఉంటారని వైసీపీ ఎ÷-లాన్. కేడర్‌లో కూడా ఉత్సాహం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో 151 అసెంబ్లీ స్థానాలతో దేశ చరిత్రలోనే అతి పెద్ద విజయాన్ని అందుకున్న ఆ పార్టీ ఐదేళ్లు తిరిగే సరికి 11 స్థానాలకు పరిమితం అయింది. ఈ షాక్‌లో ఉన్న కేడర్‌ను, పక్క పార్టీల వైపు చూస్తున్న లీడర్‌ను తమతో ఉంచుకునేందుకు ఎన్నికల పాట అందుకుంది. జమిలీ ఎన్నికలు 2027లోనే వస్తాయని అప్పటి కూటమిపై వ్యతిరేకత తీవ్ర స్థాయిలో ఉంటుందని నూరి పోస్తోంది. దీన్నే జనంలోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తోంది. కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో పగ్గాలు చేపట్టి ఆరు నెలలు అవుతోంది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను క్రమంగా అమలు చేస్తూ వస్తోంది. మరోవైపు పారిశ్రామికవేత్తలను రాష్ట్రంవైపు తిప్పుకునేందుకు పాట్లు పడుతోంది. అమరావతిని పట్టాలు ఎక్కిస్తోంది. హామీల అమలు విషయంలో మాత్రం కాస్త తడబాటు ఉంది. దీన్నే వైసీపీ తమకు అనుకూలంగా మార్చుకుంటోంది. ప్రజల్లో వ్యతిరేకత మరింతగా పెంచేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ మధ్య కాలంలోనే రైతులకు సంబంధించిన ధాన్యం కొనుగోలు సరిగా జరగడం లేదని ధర్నాలు చేపట్టింది. విద్యుత్ ఛార్జీలపై కూడా నిరసనలు చేసేందుకు సిద్ధమైంది. ఇలా వివిధ సమస్యలు ప్రజల్లోకి తీసుకెళ్తూనే... గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నగదు బదిలీ పథకాలను గుర్తు చేస్తోంది. ఇప్పుడు వాటిని కూటమి ప్రభుత్వం ఆపేసిందన్న ప్రచారానికి తెరతీసింది. అందుకే అప్పట్లో జగన్ ఉండి ఉంటే అనే ప్రచారం తీసుకొచ్చింది. అది పెద్దగా వర్కౌట్ కాలేదు. నియోజకవర్గాల పునర్విభజన కంటే ముందే ఎన్నికలు వస్తాయని ప్రచారం చేస్తే పార్టీ మారే వారి ఆలోచన కూడా మార్చవచ్చని చెబుతున్నారు. కూటమి హౌస్‌ఫుల్ అయినందున వైసీపీ నుంచి దూకేందుకు సిద్ధంగా ఉన్న వాళ్లు తగ్గుతారని ఎ÷-లాన్. ఇలా నలువైపులా ఆలోచించిన వైసీపీ 2027లోనే ఎన్నికలు రాబోతున్నాయని కచ్చితంగా వైసీపీ అధికారంలోకి వస్తుందని ప్రచారం చేస్తోంది. ఇప్పటి వరకు ఈ ప్రచారం ఎంపీలు, కింది స్థాయి నాయకులు మాత్రమే చేస్తూ వచ్చారు. ఇప్పుడు ఏకంగా అధ్యక్షుడు జగన్ అందుకున్నారు. పులివెందులలో పర్యటించిన జగన్ 2027లో ఎన్నికలు వస్తాయని వైసీపీ అధికారంలోకి వస్తుందని అన్నారు. అమలు చేయలేదని హామీలు ఇచ్చిన ఇప్పుడు ప్రజల వ్యతిరేకత ఎదుర్కొంటున్న చంద్రబాబు సర్కారుకి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. పులివెందుల పర్యటనలో భాగంగా ఆయన కడప నేతలు, కార్పొరేటర్లు, కీలక నేతలతో సమావేశమయ్యారు. జిల్లా, రాష్ట్ర రాజకీయాలు, పార్టీ బలోపేతంపై చర్చించారు. కష్టాలు శాశ్వతం కావని.. పార్టీని అంటిపెట్టుకున్న వాళ్లకు భవిష్యత్‌లో గుర్తింపు ఉంటుందని జగన్ అన్నారు. ఇలాంటి టైంలో వ్యక్తిత్వాన్ని అమ్ముకోకూడదని నేతలకు సూచించారు. దేశ చరిత్రలోనే ఎవరూ చేయని విధంగా సంక్షేమ కార్యక్రమాలు చేశామని అన్నారు. కేవలం అబద్ధాలు చెప్పలేకపోవడంతోనే ప్రతిపక్షంలో కూర్చున్నా మన్నారు జగన్. ప్రజలు వాస్తవాలు తెలుసుకుంటారని గత ప్రభుత్వంతో ఈ ప్రభుత్వం పని తీరును పోల్చి చూస్తారని అన్నారు. 2027లో జరిగే ఎన్నికల్లో కచ్చితంగా వైసీపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# అక్రమ అరెస్టులతో రేవంత్‌రెడ్డి పాలన


### రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి భంగం : హరీశ్‌రావు

హైదరాబాద్ : సీఎంగా రేవంత్‌రెడ్డి అయిన తరువాత నుంచి అక్రమ అరెస్టులు పెరిగాయని, అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్నాడని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్టును సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. ఉదయాన్నే పోలీసులు ఇంటి వద్దకు వచ్చి అక్రమ అరెస్టు చేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు కనీస సమాచారం ఇవ్వకుండా, ఎలాంటి నోటీసు లేకుండా అరెస్ట్ చేయడం పూర్తిగా అప్రజాస్వామికమన్నారు. ఇది ఇందిరమ్మ రాజ్యమా.. పోలీస్ రాజ్యమా? అంటూ ఎక్స్ వేదికగా ఫైర్ అయ్యారు. అడిగితే అరెస్టులు.. ప్రశ్నిస్తే కేసులు.. నిలదీస్తే బెదిరింపులు అంటూ విరుచుకుపడ్డారు. ప్రజాస్వామ్య పాలన అని డబ్బా కొడుతూ, రాక్షస పాలన కొనసాగిస్తున్నారన్నారు. సెలవు రోజుల్లో కావాలని బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేస్తూ సీఎం నియంతలా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. హోం మంత్రిగా శాంతి భద్రతల నిర్వహణలో విఫలమైన రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ కార్యకర్తలను వేధించడంపైనే దృష్టి పెట్టారన్నారు. ఈ పైశాచిక ఆనందం ఎక్కువ కాలం నిలవదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మీ పిట్ట బెదిరింపులు, అక్రమ కేసులకు భయపడే వారు మేము కాదని గుర్తుంచుకోండి. తెలంగాణ సమాజమే మీకు తగిన బుద్ధి చెబుతుందని హరీశ్‌రావు ట్వీట్ చేశారు.



# నాలోని దైవానికి..

'తమ శరీరమందే స్వయం జ్యోతిగా సర్వసాక్షిగా ప్రకాశించే ఆత్మను.. పాపాలు నశించిన వారే చూడగలరు. మాయ కమ్మేసిన వారు చూడలేరు' అని పై శ్లోకానికి అర్థం. దీనిని బలపరిచే దృష్టాంతాలు పురాణాల్లో కోకొల్లలు. ఆంజనేయుడు తన వక్షస్థలాన్ని చీల్చి.. తన గుండెల్లో కొలువుదీరిన సీతారామ లక్ష్మణులను లోకానికి చూపించాడు. అది పురాణ కాలం. పురాణ పురుషుడు, మహానుభావుడు కాబట్టి అలా చూపించగలిగాడు అనుకోవచ్చు. కానీ, చరిత్రలో చోటు చేసుకున్న ఓ సంఘటన గురించి తెలుసుకుందాం. తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరులో విష్ణుచిత్తుడు అనే మహా భక్తుడు ఉండేవాడు. ఆయన ప్రతినిత్యం వటపత్రశాయి అయిన చిన్నికృష్ణుడికి పూలహారాలు అర్పిస్తూ అర్చించేవాడు. ఆయనకు భగవత్ ప్రసాదంగా తులసి తోటలో ఒక చిన్నారి లభించింది. కోదై అంటే పూలమాల. ఆ చిన్నారికి అదే పేరు పెట్టుకున్నాడు. ఆ చిన్నారి శ్రీరంగనాథుడి సేవలో తరిస్తూ గోదాదేవిగా లోకప్రసిద్ధి చెందింది. గోదాదేవి పసితనం నుంచి కృష్ణ భక్తురాలే. తన తండ్రి స్వామి కోసం అల్లిన పుష్పమాలికలను చాటుగా తన మెడలో వేసుకొని అద్దంలో చూసుకొని మురిసిపోయేది. అంటే%ూ% అద్దంలో గోదా తనను తాను చూసుకుందని కాదు! తనలోని కృష్ణుడిని చూసుకొని పొంగిపోతుండేది. స్వామి కైంకర్యానికి కట్టిన హారాలు తన కూతురు ముందుగానే మెడలో వేసుకోవడం చూసి ఆమె తండ్రి ఎంతగానో బాధపడ్డాడు. భూదేవి అపర అవతారమేనని పేర్కొన్నాడు. ఆమె ధరించిన హారాలు తనకు ప్రీతిపాత్రమని పలికాడు. స్వామి స్వప్న సాక్షాత్కారంతో విష్ణుచిత్తుడు కుదుటపడ్డాడు. తనలో దేవుడు ఉన్నాడని అనుకోవడం వేరు. తానే దేవుడిని అని భావించడం వేరు. శ్రీరామకృష్ణ పరమహంస అమ్మవారి మీద పూలు చల్లుతూ తన నెత్తిమీద కూడా వేసుకునేవాడట! అంటే నేనే కాళీమాతను అయిపోయానని అనుకోలేదు.



ఆధ్యాత్మికం

# బాధిత కుటుంబానికి సుల్తానాబాద్ వాకర్స్ విరాళం అందజేత

## - వాకర్ సభ్యులను అభినందించిన 303 డిప్యూటీ గవర్నర్



**సుల్తానాబాద్ డిసెంబర్ 26( ది క్రైమ్ న్యూస్):** రోడ్డు ప్రమాదంలో గాయపడిన నిరుపేద కుటుంబానికి చెందిన కొయ్యడ భాను చికిత్స నిమిత్తం సుల్తానాబాద్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు అండగా నిలిచారు. కరీంనగర్ లో పరీక్షలు రాసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాదులోని యశోద ఆసుపత్రిలో చావు బతుకుల మధ్య కొట్టు మిట్టాడుతున్నాడు. వైద్య ఖర్చులకోసం దాదాపు రూపాయలు 10 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్న విషయం తెలుసుకున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వెంటనే స్పందించి అప్పటికప్పుడు రూపాయలు 30,000 జమ చేసి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిసి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ ఐల రమేష్ మాట్లాడుతూ కడు పేదరికంలో ఉన్న భానుకు వాకర్ సభ్యులు అండగా నిలిచి ఆర్థిక సాయం చేయడం అభినందనీయం అన్నారు. వాలీబాల్ క్రీడాకారుడైన భాను తండ్రి చిన్నతనం లోనే చనిపోయాడని, అతని ఆర్థిక పరిస్థితి గమనించి దాతలు ముందుకు వచ్చి సాయం చేయాలని భాను త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆపదలో ఉన్న భాను చికిత్సకు సుల్తానాబాద్ వాకర్ అసోసియేషన్ సభ్యులు ముందుకు వచ్చి ఆర్థిక సాయం చేసిన సభ్యులను జిల్లా 33 వాకర్స్ అసోసియేషన్ డిప్యూటీ గవర్నర్లు బుర్ర జగదీశ్వర్ గౌడ్ రవీందర్ రెడ్డి సుధాకర్ రెడ్డిలు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బైరగోని రవీందర్ గౌడ్ కార్యదర్శి మంద శ్రీనివాస్ సభ్యులు కందుకూరి ప్రకాష్ రావు, చొప్పరి సుమన్, కొమురవెల్లి భాస్కర్, దూడం లింగమూర్తి, పెగడ పరశు రాం, పల్ల సురేష్, అమీరిశెట్టి తిరుపతి, పళ్ళ శ్రీనివాస్, వల్లాల రాజు, కొమరవెల్లి శ్రీనివాస్, సిద్ధ తిరుపతి, దర్శనాల రామచందర్, నాగమల్ల ప్రశాంత్, వేణు, శ్రీనివాస్, కందుకూరి కుమార్, కొలిపాక రవీందర్, యూసుఫ్, కొమరవెల్లి ప్రభాకర్, నిట్టూరు శ్రీనివాస్, పురం రమణ, ఇల్లందుల మల్లేశం, వాకర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మాపూర్ మండలంలో సిపిఐ 100వ ఆవిర్భావ దినోత్సవాలు










**తిమ్మాపూర్ (ది క్రైమ్ న్యూస్ ):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని మొగిలిపాలెం,పర్లపల్లి, కొత్తపెల్లి, పోలంపల్లి ఇంద్రనగర్, నుస్తులాపూర్ గ్రామాలలో సిపిఐ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఆయా గ్రామాల పార్టీ గ్రామశాఖ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పోలంపల్లిలో సిపిఐ మండల కార్యదర్శి బోయిని తిరుపతి మాట్లాడుతూ...... భారత కమ్యూనిస్టు పార్టీ 1925 డిసెంబర్ 26న కాన్పూర్ నగరంలో ఆవిర్భవించిందని గురువారంతో 100వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో గ్రామాల్లో జెండాలు ఎగురవేసినట్లు తెలిపారు.కార్యక్రమాల్లో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, సహాయ కార్యదర్శిలు పిట్టల శ్రీనివాసు, సూరం మల్లేశం,ఆయా గ్రామాల గ్రామ శాఖ కార్యదర్శులు కాంతాల తిరుపతిరెడ్డి, గూడెం రమేష్ , పార్నంది రాజకుమార్, గంగిపల్లి శంకర్ పార్టీ నాయకులు కొలిపాక రమేష్, లక్ష్మణ్, క్రాంతి కుమార్,ముత్త యేళ్ళస్వామి, కనకం మొండయ్య, మర్రి కొమరయ్య,సరంగం రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిమ ఫౌండేషన్ ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

**కమలాపూర్ (ది క్రైమ్ న్యూస్ ):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని ఉప్పల్ గ్రామంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో గురువారం ప్రతిమ హాస్పిటల్స్ ఫౌండేషన్ వారి సహకారంతో ఆర్యవైశ్య మహాసభ హనుమకొండ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కార్డియాలజీ, న్యూరాలజీ, జనరల్, ఆర్థోపెడిక్, పల్మానాలజీ, వివిధ ఆరోగ్య విభాగాలలోని స్పెషలిస్ట్ డాక్టర్లు ఓ.పీ. ద్వారా వచ్చిన పేషంట్ లకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. అవసరమైన వారికి ఉచితంగా ప్రతిమ సంచార ఆరోగ్య రథంలో అత్యాధునిక డయాగ్నోస్టిక్ అయిన 2- ఎకో, కార్డియాక్ పరీక్షలు, మమ్మోగ్రఫీ, ఎక్స్ రే, మినీ లాబొరేటరీలో వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు కూడా పంపిణీ చేశారు. అవసరమైన వారికి కరీంనగర్ లోని ప్రతిమ హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. వైద్య శిబిరం ఏర్పాటుపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డాక్టర్లు, ఆర్యవైశ్య మహాసభ హనుమకొండ జిల్లా అధ్యక్షులు తోట సురేష్, గ్రామ పెద్దలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.





# మార్కెట్‌ను శాసిస్తున్న ఈవీ కార్లు. స్పీడ్ అండ్ లుక్స్‌లో వీటికి ఏవీ సాటిరావంతే




రిమాక్ నెవెరా సూపర్ ఈవీ కారు ఎలక్ట్రిక్ మోటార్లు 1,914 బీహెచ్‌పీ పవర్‌తో వస్తుంది. ఈ కారు 2,360 ఎన్ఎం టార్క్ ఉత్పత్తి చేస్తుంది. ఈ కారు కేవలం 1.74 సెకన్లలో 0-100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. అలాగే ఈ కారు 415 కిలోమీటర్ల గరిష్ట వేగాన్ని అందుకుంటుంది. రిమాక్ ఆటోమొబిలిటీకు సంబంధించిన క్రొయేషియన్ కార్ కంపెనీ ఈ కారు తయారు చేస్తుంది. పినిన్ఫారినా బాటిస్టా ఈవీ కారు 1877 బీహెచ్‌పీ పవర్, 2,300 ఎన్ఎం టార్క్ ఉత్పత్తి చేస్తుంది. ఈ కారు కేవలం 1.89 సెకన్లలో 0-100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. అలాగే ఈ కారు గరిష్ట వేగం 350 కిలోమీటర్లుగా ఉంటుంది. ఈ కారు బ్యాటరీ ప్యాక్ రిమాక్ ద్వారా సరఫరా చేస్తుంది. ఈ కారు మొత్తం కార్బన్ ఫైబర్తో తయారు చేశారు. పినిన్ఫారినా బాటిస్టా ఓ స్టైలిష్ కారు అని ప్రపంచవ్యాప్తంగా పేరుంది. అమెరికన్ ఈవీ కార్ మేకర్ అయిన లూసిడ్ లూసిడ్ ఎయిర్ సఫైర్ పేరుతో మొట్టమొదటి ఈవీ కారును రిలీజ్ చేసింది. టెస్లా మోడల్ ఎస్‌కు పోటీగా ఈ కారును రిలీజ్ చేశారు. ఈ కారులో ఉండే శక్తివంతమైన ఎలక్ట్రిక్ మోటార్‌తో 1,234 బీహెచ్‌పీ పవర్, 1,939 ఎన్ఎం టార్క్ న్ను ఉత్పత్తి చేస్తుంది. ఈ కారు కేవలం 1.89 సెకన్లలో 0-100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. అలాగే ఈ కారు 330 కిలో మీటర్ల గరిష్ట వేగంతో దూసుకుపోతుంది. పోర్స్చే టైకాన్ టర్బో జీటీ అనేది టైకాన్‌కు సంబంధించిన విప్లవాత్మక ఎడిషన్ టర్బో జీటీ కారు 1,019 బీహెచ్‌పీ పవర్‌తో 1,340 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ కారు కేవలం 2.1 సెకన్లలో 0-100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. అలాగే ఈ కారు గంటకు 305 కిలో మీటర్ల వేగంతో దూసుకుపోతుంది. టెస్లా మోడల్ ఎస్ టెస్లాస్‌కు చెందిన ప్లాయిడ్ వెర్షన్ 1,020 బీహెచ్‌పీ పవర్‌తో 1,420 ఎన్ఎం టార్క్ ఉత్పత్తి చేస్తుంది. ఇది కేవలం 2.1 సెకన్లలో 0-100 కిలో మీటర్ల వేగాన్ని అందుకుంటుంది. ఈ కారు గరిష్టంగా 320 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతుంది.

# ద్విచక్ర వాహనాదారులకు పండగే.. ఆ టూ-వీలర్స్ లాంచ్



కొత్తగా బైక్ లేదా స్కూటర్ కొనాలనుకునే వారు ప్రతి నెలా ఏయే మోడల్స్ బైక్లు, స్కూటర్ లాంచ్ అవుతాయో? ఎదురుచూస్తూ ఉంటారు. ముఖ్యంగా ప్రతి ఏడాది మార్చి వరకూ కొత్త బైక్స్‌ను ఎవరూ కొనడానికి ఇష్టపడరు. పాత ఇంజిన్ తయారీ సంవత్సరంతో వస్తుందనే భయంతో ఆ జోలికి వెళ్లరు. అయితే ఏప్రిల్ నుంచి ఇంజిన్ తయారీ సంవత్సరం అప్‌డేట్ అవుతందనే ఉద్దేశంతో కొనుగోళ్లకు ఆసక్తి చూపుతూ ఉంటారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ నెలలో బైక్ తయారీ కంపెనీలు కూడా సరికొత్త బైక్స్‌ను లాంచ్ చేస్తూ ఉంటాయి. మారుతున్న టెక్నాలజీ నేపథ్యంలో ఎలక్ట్రిక్ స్కూటర్లను ప్రజలు ఇష్టపడుతున్నారు. కాబట్టి ఈ నెలలో వాటి లాంచ్‌లు కూడా ఆకట్టుకుంటున్నాయి. కాబట్టి ఏప్రిల్‌లో లాంచ్ అయ్యే ఎలక్ట్రిక్ స్కూటర్లతో పాటు బైక్‌ల గురించి వివరాలను తెలుసుకుందాం. ఆంపియర్ ఎన్ఎక్స్‌జీ ఎలక్ట్రిక్ ఏప్రిల్‌లోనే లాంచ్ అయ్యే అవకాశం ఉంది. ఈ స్కూటర్ తక్కువ నిర్వహణతో అసాధారణమైన పనితీరును అందిస్తుంది. ఈ స్కూటర్‌ను ఒకే ఛార్జ్‌పై 100-120 కిలోమీటర్ల మైలేజ్ అందిస్తుంది. అందువల్ల ఆంపియర్ ఎన్ఎక్స్‌జీ పట్టణ ప్రజలకు అనువుగా ఉండేలా రూపొందించారు. వినూత్న ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలకు ప్రసిద్ధి చెందిన ఏథర్‌కు చెందిన ఏథర్ రిజ్టా కూడా ఈ నెలలో లాంచ్ చేస్తున్నారు. సొగసైన డిజైన్, ఆకట్టుకునే పనితీరు సామర్థ్యాలతో ఈ-స్కూటర్ ప్రీమియం ఎలక్ట్రిక్ మోటార్‌సైకిళ్ల ప్రమాణాలను పునర్నిర్వచించటానికి సెట్ చేస్తుంది. ఈ స్కూటర్ ఇది రైడర్‌లకు మునుపెన్నడూ లేని విధంగా అద్భుతమైన అనుభూతిని అందిస్తుంది. బీఎండబ్ల్యూ ఆర్ 1300 జీఎస్ కూడా ఈ ఏప్రిల్‌లో భారతీయ మార్కెట్‌లో లాంచ్ అయ్యే అవకాశం ఉంది. ఈ బైక్ అడ్వెంచర్ టూర్స్ కోరుకునే వాళ్లను ఆకర్షిస్తుంది. రైడింగ్‌లో థ్రిల్ కోరుకునే ఈ బైక్ మంచి రైడింగ్ అనుభవాన్ని అందిస్తుంది. బజాజ్ కంపెనీ కూడా పవర్-ప్యాక్డ్ పల్సర్ 400ని ఈ నెలలోనే విడుదల చేసే అవకాశం ఉంది. అడ్రినలిన్-పంపింగ్ పనితీరుతో పల్సర్ 400 సెగ్మెంట్‌లో కొత్త బెంచ్‌మార్క్‌లను సెట్ చేయడానికి సిద్ధంగా ఉంది. ఇది రైడర్‌లకు ఉత్తేజకరమైన ప్రయాణాన్ని అందిస్తుంది. కేటీఎం, రాయల్ ఎన్‌ఫీల్డ్ (ఊహిస్తున్న క్లాసిక్ 350 బాబర్‌తో), సుజుకి జీఎస్ఎక్స్-8ఎస్‌ను ఏప్రిల్ నెలలోనే ఆవిష్కరించే అవకాశం ఉందని నిపుణులు వివరిస్తున్నారు.

# ఈ కంపెనీ గురించి తక్కువ మందికి తెలుసు! దీని షేర్ ఎంత లాభమో తెలుసా?




గ్లోబల్ వీసా ప్రాసెసింగ్, పౌరులకు ప్రభుత్వం అందించే సేవల అవుట్‌సోర్సింగ్ సర్వీసులు.. ఇవన్నీ అవుట్ సోర్సింగ్ మార్కెట్ లో ఓ భాగం. ఈ సెక్టార్ కు సంబంధించి ఏకైక లిస్టెడ్ కంపెనీ ఇంటర్నేషనల్. ఈ వ్యాపారానికి ఎక్కువ ఆస్తులు, మూలధనం అవసరం లేదు. నగదు ఉత్పత్తి బలంగా ఉంటుంది. ఇక వృద్ధి కోసం ఎక్కువ డబ్బును వెచ్చించాల్సిన అవసరం లేదు. వీటన్నింటితో పాటు, ప్రయాణ రంగంలో గ్లోబల్ రికవరీని దృష్టిలో ఉంచుకుని చూస్తే.. ఇది బలమైన సంస్థ. 2005వ సంవత్సరంలో పోర్చుగల్ రాయబార కార్యాలయానికి సేవలను అందించడం ప్రారంభించింది. కంపెనీ వ్యాపారం ఇలా ప్రారంభమైంది. మార్కెట్ వాటా ప్రయాణాల పెరుగుదల, మేజర్ కాంట్రాక్టుల రెన్యువల్ తో మెరుగుపడుతుందని భావిస్తున్నారు. అభివృద్ధిని ప్రోత్సహించడానికి, కంపెనీ ప్రభుత్వం నుండి పౌరుల సేవలు అంటే బ్యాంకింగ్ కరస్పాండెన్స్.. అంటే వ్యాపారంలోకి విస్తరిస్తోంది. వీసా ప్రాసెసింగ్, కాన్సులర్.. అంటే వ్యాపారం.. అసెట్ లైట్ లాంటిది. అంటే, ఆస్తుల కోసం పెద్దగా ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. మరి ఈ కంపెనీ తక్కువ మందికే తెలిసినా.. దీని షేర్ ఎంత లాభమో తెలుసుకోవాలంటే ఈ వీడియో చూడాల్సిందే.

# చీకట్లు తొలగిస్తూ.. వెలుగులు పంచుతూ

## • వారి మాటల్లోని సంతోషం చెప్పలేనిది: లయన్ మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి

**రామగిరి(ది క్రైమ్ న్యూస్)డిసెంబర్ 26:** లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ, రేకుర్తి కంటి హస్పటల్ కరీంనగర్ వారి ఆధ్వర్యంలో నిన్న బేగంపేటలో జరిగిన ఉచిత కంటి పరీక్షల అనంతరం ఆపరేషన్ కోసం పంపించిన వారిని గురువారం ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించి తిరిగి బేగంపేట్ కి వారిని క్షేమంగా తీసుకురావడం జరిగింది. అలాగే వారి నుండి ఆపరేషన్ జరిగిన విధానాన్ని, అక్కడ చేసిన ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకొని పండ్లు ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమాన్ని బేగంపేట్ లో ఏర్పాటు చేసిన లయన్ గుండ శ్రీనివాస్ ని ఆపరేషన్ చేయించుకున్న వారు శాలువాతో సన్మానించడం జరిగింది. క్లబ్ ప్రెసిడెంట్ మొలుమురి శ్రీనివాస్, డైరెక్టర్ మాజీ జడ్పీటీసీ గంట వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పేదవారు కంటి ఆపరేషన్ కోసం ప్రైవేట్ ఆస్పత్రులలో 15వేల నుండి 20 వేల భరించవలసి వస్తుంది. ఇది రోజువారి కూలీ చేసుకునే పేదలకు అంత మొత్తం భరించడం చాలా కష్టం కాబట్టి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రిలో కార్పొరేట్ దీటుగా ఉచితంగా కంటి పరీక్షలు, ఆపరేషన్ చేయడం జరుగుతుందని, ఆపరేషన్ అనంతరం వారి మాటల్లోని సంతోషం చెప్పలేనిదని




ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని లయన్స్ క్లబ్ తరఫున పేదవారికి ఉపయోగపడే విధంగా చేస్తామని తెలిపారు. తదుపరి ఉచిత కంటి పరీక్షలను జనవరి 17 న నిర్వహిస్తామని ఇట్టి అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని , వేదిక వివరాలను త్వరలో తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేకల మారుతి యాదవ్, బేగంపేట్ మాజీ ఎంపీటీసీ కుమార స్వామి, దాసరి శివ, తీగల శ్రీధర్. తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ముత్యాల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన..!

**రామగిరి(ది క్రైమ్ న్యూస్)డిసెంబర్ 26:** కమాన్ పూర్ మండల కేంద్రంలోని ముత్యాల పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. పోచమ్మ కట్టపైన నూతనంగా నిర్మించిన ముత్యాల పోచమ్మ గుడిలో వేకువ జామున పాత ఆలయంలో నుండి పోచమ్మ విగ్రహాన్ని పంబాల పూజారులు జమిడిక డప్పు చప్పుల్ల మధ్య తీసి నూతనంగా నిర్మించిన ఆలయంలో పునః ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బోనాల ఉత్సవ కార్యక్రమం నిర్వహించి అమ్మ వారిని దర్శించుకుని నైవేద్యం సమర్పించినారు. చివరగా బలి కార్యక్రమంతో ముగించారు. ఆలయం ఆవరణలో భక్తులకు అన్న ప్రసాదం చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు, భక్త జనులు పాల్గొన్నారు. భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.



# ఏబీవీపీ స్టూడెంట్ ఫర్ సేవా స్టేట్ -కో కన్వీనర్‌గా

## పెద్దపల్లి జిల్లా వాసి సందనవేణి ఒమేష్ నియామకం

**పెద్దపల్లి, డిసెంబర్ 26 ( ది క్రైమ్ న్యూస్ ):** స్థానిక వివరాలకు వీలితే సిద్దిపేట జిల్లాలో డిసెంబర్ 23 24 25 తేదీలలో జరిగిన ఏబివిపి 43వ రాష్ట్ర మహాసభలలో అనేక రకాల సమస్యలపై విద్యారంగ స్థితి, రాష్ట్ర స్థితి, నిరుద్యోగ స్థితి పై తీర్మానాలు చేసిన అనంతరం నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని వివిధ ఆయామాల కన్వీనర్ లను ప్రకటించారు. ఏబీవీపీ నూతన రాష్ట్ర కార్యవర్గంలో ఎలిగేడు మండలం దులికట్ట గ్రామానికి చెందిన సందనవేణి ఒమేష్ ని ఎస్ ఎఫ్ ఎస్ స్టేట్ -కో కన్వీనర్ గా ఏబివిపి రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి ప్రకటించడం జరిగిందన్నారు .ఓమేష్ గతంలో కళాశాల కార్యదర్శిగా, పెద్దపల్లి నగర సంయుక్త కార్యదర్శిగా జిల్లా కేంద్ర జోనల్ ఇన్చార్జిగా ఎలిగేడు మండల సంపర్క కేంద్ర కన్వీనర్ గా జిల్లా హాస్టల్ కన్వీనర్ గా ఎస్ ఎఫ్ ఎస్ జిల్లా కన్వీనర్ గా బాధ్యతలు విజయవంతంగా చేపట్టినట్లు జానారెడ్డి తెలిపారు. ఒమేష్ నియామకం పట్ల పెద్దపెల్లి జిల్లా కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఓమేష్ మాట్లాడుతూ, నా పై నమ్మకం తో నాకు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు అదేవిధంగా సమాజానికి రాత్రి పగలు అనకుండా సేవ చేసేటువంటి ప్రయత్నం చేస్తాననితెలిపారు విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటాలు ఉద్యమాలు చేస్తూ, విద్యారంగ సమస్యలపై ఉధృతం గా పోరాడుతామని తెలియజేశారు. నాపై నమ్మకంతో స్టూడెంట్ ఫర్ సేవా రాష్ట్ర ఎస్ ఎఫ్ ఎస్ కో కన్వీనర్ గా బాధ్యతలు ఇచ్చినటువంటి రాష్ట్ర శాఖ కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.




# క్రికెట్ విజేతలకు బహుమతి అందజేత

**రామగిరి(ది క్రైమ్ న్యూస్)డిసెంబర్ 26:-** కమాన్ పూర్ మండల కేంద్రంలో జరిగిన క్రికెట్ విజేతలకు సుందరం ఫౌండేషన్ అధ్యక్షుడు బోనాల మల్లయ్య 5000 అందజేశారు. సుందరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో గోదావరిఖని తిలక్ నగర్ కి చెందిన దిలీప్ లెవన్స్ జట్టు ఫైనల్ లో విజయం సాధించడంతో వారికి సుందరం ఫౌండేషన్ ఫౌండర్ బోనాల వెంకటస్వామి ఆదేశాల మేరకు అధ్యక్షుడు బోనాల మల్లయ్య వారికి 5000 రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సుందరం ఫౌండేషన్ సభ్యులు కర్నూల్ నగేష్, చిప్పగుర్తి అరవింద్, చంద్రశేఖర్, మేడగొని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



# మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**మానకొండూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం నిజాయితీ గూడెం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాముని స్వరూప కుటుంబాన్ని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. నిజాయితీ గూడెం తాజా మాజీ సర్పంచ్ బోళ్ళ మురళి, ఇతర నాయకులు పరామర్శలో పాల్గొన్నారు.

# సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీల విలీన సభను 28న జయప్రదం చేయండి

## - న్యూడెమోక్రసీ సీ పీ ఐ (ఎం ఎల్) జిల్లా నాయకులు ఏ వెంకన్న





**రామగిరి(ది క్రైమ్ న్యూస్)డిసెంబర్ 25:-** హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డిసెంబరు 28న జరిగే రెండు సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీల విలీన సభను జయప్రదం చేయాలని కోరుతూ పెద్దపల్లి జిల్లా పరిధిలోని సెంటర్ కాలనీ లో విలీన సభ పోస్టర్లు ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా సీ పి ఐ (ఎం ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు. ఏ వెంకన్న మాట్లాడుతూ 2013 లో వివిధ కారణాల రీత్యా విడిపోయిన న్యూ డెమోక్రసీ పార్టీలు నేడు విలీనం అవ్వాలనుకోవడం శుభ పరిణామం అన్నారు. దేశంలో మతోన్మాద బిజెపి మోడీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలతో ప్రజలను ఇబ్బందులకు గురిస్తుందన్నారు. సామ్రాజ్యవాద కంపెనీలకు దేశ సంపదను కట్టబెడుతున్నారని, మతం పేరుతో చిచ్చు పెట్టి మనుషుల మధ్య వైశ్యామ్యాలు సృష్టిస్తు నరహంతక పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు.రచయితలను,మేధావులను, కళాకారులను, హక్కుల నేతలను నక్సలైట్లంటూ అక్రమ కేసులు బనాయించి చిత్రహింసలు పెట్టి జైల్లో నిర్బంధిస్తున్నారని ఇటువంటి పరిస్థితులలో దేశంలో ఉన్న విప్లవ పార్టీలన్నీ కలవాలని, ప్రజలందరిని సమీకృతం చెయ్యాలని కోరారు.అందులో భాగంగా సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రెండు విప్లవ పార్టీలు డిసెంబర్ 28న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విలీనం అవుతున్నాయని తెలిపారు. కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి రూపొందించిన ప్రజా యుద్ధ పంధా ప్రతిఘటన పోరాటలను మరింత ముందుకు తీసుకుపోవడానికి ఈ కలయిక దోహదపడుతుందని అన్నారు. ప్రజలు,ప్రజాస్వామికవాదులు, రెండు న్యూడెమోక్రసీ పార్టీల పార్టీల కార్యకర్తలు 28న జరిగే సభకు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీ లక్ష్మి, సదయ్య, పీ రాణీ, రమేష్, సరిత, శంకరమ్మ,రాంబాయి,సత్తయ్య, ఎం తార, శ్రీను, రేణుక,తిరుమల, స్రవంతి, జీ లక్ష్మి.తదితరులు పాల్గొన్నారు.

# అటవీ సంరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలి

## - పిసిసిఎఫ్ సువర్ణ





**అసిఫబాద్:(ది క్రైమ్ న్యూస్):** అటవీ సంరక్షణ అభివృద్ధిలో ఉద్యోగులతో పాటు ప్రజలు భాగస్వాములు కావాలని కంపా పిసిసిఎఫ్ సువర్ణ అన్నారు సిర్పూర్ టి రేంజ్ పరిధిలోని ఇటుకల పహాడ్ గ్రామాన్ని సిఎఫ్ శాంతారాం, డిఎఫ్ఓ నీరజ్ కుమార్ తో కలిసి సందర్శించి అక్కడ కంపా నిధులతో చేసిన ప్లాంటేషన్ పరిశీలించి అనంతరం గ్రామస్తులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్లాంటేషన్ పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. అడవులను సంరక్షిస్తే భావితరాలకు ఎంతో గొప్ప సంపద అందించిన వారమవుతామని అన్నారు. ప్రజలు అటవీ అధికారులకి సహకరించాలని సూచించారు. అటవీ అభివృద్ధి కోసం చేసే ప్రతి పనిలో ప్రజలను భాగస్వాములను చేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ రేంజ్ అధికారి ఇక్బాల్ హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.

# భీమిలీలో నేతల సిగపట్లు

విశాఖపట్టణం, ,: వైసీపీని వలసలు వేధిస్తున్నాయి. మొన్నటి వరకు పార్టీకి బలంగా ఉన్న నేతలు కూడా చెట్టుకొకరు, పుట్టకొకరు ఐపోతున్నారు. మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు ఇప్పుడు వర్గపోరు కూడా తోడైంది. ఇది చాలదన్నట్టు ఖాళీ అయిన నియోజకవర్గంలో ఇన్‌చార్జ్ పోస్ట్ కోసం ఆశావహులు కన్నేస్తున్నారు. మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ రాజీనామాతో ఖాళీ అయిన భీమిలిపై ఇప్పుడు ఇద్దరు నేతల కన్ను పడింది.వైసీపీ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు ఇంతవరకు పలానా నియోజకవర్గం ఫిక్స్ అంటూ ఏమీ లేదు. దీంతో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా.. నియోజకవర్గం వెతుక్కోవాల్సిన దుస్థితి వస్తోంది. 2014-అనకాపల్లి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. 2019లో అనకాపల్లి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. మొన్నటి ఎన్నికల్లో గాజువాక నుంచి పోటీ చేసి ఓడిపోయారు. దీంతో ఆయనకు ఇప్పుడు ఏ నియోజకర్గంలో యాక్టివ్‌గా ఉండాలో తోచడం లేదు. పొలిటికల్ చౌరస్తాలో నిలబడి దిక్కులు చేస్తున్నారు. ఇంతలో ఆయనకు ఊహించని లక్కీ చాన్స్ ఎదురైంది. మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ పార్టీ నుంచి వెళ్లిపోవడంతో భీమిలి వైసీపీ సీటు ఖాళీ అయ్యింది.. దీంతో అమర్‌నాథ్ కన్ను భీమిలీపై పడిందని వైసీపీ వర్గాల ఇన్నర్ టాక్. అంతేకాదు భీమిలి ప్రజలతో టచ్‌లోకి వెళ్లడం, జిల్లా రాజకీయాలను ఫుల్‌గా స్టడీ చేయడం కూడా మొదలుపెట్టారంట అమర్‌నాథ్..గుడివాడ అమర్‌నాథ్ కాపు సామాజిక వర్గానికి చెందిన నాయకుడు. భీమిలీలో కాపుల ఓటు బ్యాంక్‌కు కొదవే లేదు. ఇది తనకు బాగా కలిసొస్తుందని అమర్‌నాథ్ లెక్కలు వేసుకుంటున్నారు. పార్టీలను పక్కన పెడితే.. భీమిలి నుంచి కొంతకాలంగా కాపు లీడర్లే గెలుస్తూ వస్తున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న గంటా శ్రీనివాసరావు కావచ్చు.. అంతకుముందు ఎమ్మెల్యేగా గెలిచిన అవంతి శ్రీనివాస్, అంతకుముందు కర్రి సీతారామ్.. ఇలా చెప్పుకుంటే పోతే.. కాపుల నాయకుల పేర్లే కనిపిస్తున్నాయి. యాదవ సామాజికవర్గం, క్షత్రియుల ప్రాబల్యం ఉన్నప్పటికీ కాపులనే ఫాలో అవుతారని పొలిటీషియన్స్ లెక్క. దీనిని పసిగట్టిన అమర్‌నాథ్.. భీమిలి సీటుపై కర్చీఫ్ వేసుకోవాలని చూస్తున్నారట..అంతేగాక భీమిలి నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాలు తన తాత అప్పన్న, తండ్రి గుర్నాథరావు ప్రాతినిధ్యం వహించిన సింహాచలం, మధురవాడ ప్రాంతాలు కూడా కలిసి ఉన్నాయి. ఇది కూడా తనకు ప్లస్ పాయింట్ అవుతుందనే ఈక్వేషన్స్‌తో అమర్‌నాథ్ భీమిలి వైపు వెళ్తున్నారని లోకల్ టాక్.. అంతేకాదు ఆ టికెట్ దక్కితే తన పొలిటికల్ ఫ్యూచర్‌కు ఢోకా ఉండదనే భావనలో ఆయన ఉన్నారనే తెలుస్తోంది.ఐతే భీమిలి భీముడిని తానే అంటూ ఊహల్లో విహరిస్తున్న అమర్‌నాథ్‌కు పిడుగులాంటి వార్త చెవిన పడిందట. అదే భీమిలి స్థానంపై పొరుగు జిల్లా నేత కూడా కన్నేశారనేది.. ఆయన వస్తే తన సీటుకు ఎసరు వస్తుందని అమర్‌నాథ్ డైలామాలో పడిపోయారని విశాఖ లోకల్ పాలిటిక్స్‌లో వినిపిస్తున్న గాసిప్. విజయనగరం జిల్లాకు చెందిన మజ్జి శ్రీనివాసరావు అలియాస్ చిన్న శ్రీను భీమిలి సీటుపై గురిపెట్టారట. ఈయన మరెవరోకాదు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు స్వయాన మేనల్లుడు. బొత్సకు రాజకీయాల్లో చేదోడు వాదోడుగా ఉంటూనే, జిల్లా రాజకీయాల్ని శాసిస్తుంటారని పేరుంది. వైసీపీ అధినేత జగన్‌కు కూడా కాస్త సన్నిహితంగా కనిపిస్తారు. ఇక ఈ విషయం తెలిసినప్పటి నుంచి అమర్‌నాథ్‌కు కంటిమీద కునుకు ఉండడం లేదట.విజయనగరం జిల్లాకు చెందిన చిన్న శ్రీను, విశాఖకు ఎందుకు వస్తున్నారనే అనుమానాలు కూడా లేకపోలేదు. అసెంబ్లీ లేదా పార్లమెంట్ స్థానానికి ప్రాతినిధ్యం వహించాలని చిన్న శ్రీనుకు ఎప్పటి నుంచో కోరిక ఉంది. టికెట్ వచ్చినట్టే వచ్చి చేజారిపోతుంది. వచ్చే ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో చాన్స్ మిస్ చేసుకోవద్దనే ఆలోచనలో ఉన్నారట చిన్న శ్రీను. విజయగనరం జిల్లాలో ఇప్పటికే బొత్స కుటుంబీకులు చాలా స్థానాల్ని గుప్పిట్లో పెట్టుకున్నారు. ఎక్కడా ఖాళీ లేక చిన్న శ్రీను చూపు భీమిలిపై పడిందని టాక్ నడుస్తోంది.క్యాస్ట్ ఈక్వేషన్స్‌పై గుడివాడ అమర్ ఆశలు పెట్టుకున్నట్లే.. చిన్న శ్రీను కూడా సేమ్ లెక్కలు వేసుకున్నారు. పైగా నియోజకవర్గంలోని మూడు మండలాల్లో చిన్న శ్రీను బంధుగణం ఉంది. దీంతో భీమిలి బెటర్ ఆప్షన్‌గా ఫీలవుతున్నారట చిన్న శ్రీను.మొత్తానికి అవంతి శ్రీనివాస్ వదిలి వెళ్లిన భీమిలి స్థానాన్ని ఎవరికి కేటాయించాలని వైసీపీ అధినేత జగన్ డైలామాలో ఉన్నారని పార్టీలో ఇన్నర్ టాక్. గుడివాడ అమర్, చిన్నశ్రీను ఇద్దరూ మాజీ సీఎం జగన్‌కు చాలా క్లోజ్‌గా ఉంటారు. మరి ఈ ఇద్దరిలో ఎవరిని వద్దన్నా.. అసంతృప్త స్వరాలు వినిపించేలా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో హైకమాండ్ నిర్ణయం ఎలా ఉంటుందోనన్నది ఉత్కంఠగా మారింది.

# బయటకొస్తున్న జగన్ జల్సాతనం



విజయవాడ, : జగన్‌కు సంబంధించి కొత్త కొత్త విషయాలు వెలుగు లోకి వస్తున్నాయి. ఆయన ఖర్చు చూస్తుంటే అధికారులు షాకవుతు న్నారు. ప్రజా ధనాన్ని ఈ విధంగా చేయవచ్చా అంటూ నోరు వెళ్లబెడుతున్నారు. ఏపీని వైసీపీ 2019-24 వరకు పాలించింది. ప్రభుత్వం ఎలాంటి జీవోలు జారీ చేసినా సీక్రెట్‌గా ఉంచేది. బయ టకు రాకుండా చూసేది అప్పటి యంత్రాంగం. కొందరు న్యాయస్థా నాన్ని సైతం ఆశ్రయించారు. అయినా అధికారుల్లో మాత్రం చలనం రాలేదు.వైసీపీ అధికారం కోల్పోయిన తర్వాత జగన్ విలాసాలు ఒకొక్కటిగా బయటకు వస్తున్నాయి. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జీతంగా కేవలం ఒక్క రూపాయి మాత్రమే తీసుకునే వారు. జగన్ నిర్ణయాన్ని చాలామంది స్వాగతించారు. ఎన్టీఆర్ తర్వాత ఆ విధంగా తీసుకున్నవారిలో జగన్ మాత్రమేనని తెగ డప్పుకొట్టారు.టీడీపీ ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టింది. అందులో కీలక విషయాలు బయటపెట్టింది. 20 లక్షలు ఖర్చుకాని హెలిప్యాడ్ నిర్మా ణం కోసం ఏకంగా రూ.8.60 కోట్ల కేటాయించారట. ఏ రేంజ్‌లో జల్సాలు చేశారో అంటూ రాసుకొచ్చింది. ప్రపంచంలో ఏ నియంత ఇలాగ చేసి ఉండరేమో!నని రాసుకొచ్చింది.ప్రజా సేవ చేయాలని అధికారమిస్తే దాన్ని అడ్డ పెట్టుకుని ఎంతకు తెగించారో కళ్లకు కట్టినట్టు చూపించింది. ఇంటి చుట్టుపక్కలే కాదు.. హెలికాప్టర్ ఎక్కేచోటు జనం కనిపించకూడదని ప్రత్యేకంగా హెలిప్యాడ్ నిర్మిం చారని రాసుకొచ్చింది.ఇంకాస్త వెనక్కి వెళ్తే.. జగన్ ఐదేళ్ల పాలనలో చేసిన ఖర్చును ఒకొక్కటిగా బయటకు తీస్తోంది కూటమి సర్కార్. కేవలం ఎగ్ పఫ్స్ కోసం దాదాపు 3.62 కోట్లపైగానే ఖర్చు చేసింది. ఈ విషయం తెలిసి ఏపీ ప్రజలు షాకయ్యారు. ఇక పేపర్, పెన్ను ఖర్చుల కోసం ఏకంగా 9.84 కోట్లు ప్రజాధనం వృధా చేశారని బయటపెట్టింది కూటమ సర్కార్.అందుకు సంబంధించి జీవోను బయటపెట్టింది. ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయి. ఇక తాడేపట్టి ప్యాలెస్ కోసం ఇంటి చుట్టూ ఇనుప కంచె నిర్మాణం చేశారు. దానికి ఖర్చు అక్షరాలా 12.85 కోట్ల రూపాయలు. కంచె బరువు ఈశాన్య బరువు పెరిగిందని పండితులు చెప్పడంతో దాన్ని తొలగించే పనిలో పడ్డారట.ఇవన్నీ గమనిస్తున్న ప్రజలు ఒక్క రూపాయి జీతం ఎందుకు తీసుకున్నారో ఇప్పుడిప్పుడే అర్థమవుతుందని అంటున్నారు. మాజీ సీఎంకు సంబంధించి ఇంకెన్ని విషయాలు వెలుగులోకి వస్తాయో చూడాలి. జగన్ ఖర్చులన్నీ చూసిన తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన ఆలోచనను మార్చుకున్నట్లు కొందరు చెబుతున్నారు. అందుకోసమే జీతం తీసుకోవడానికి పవన్‌కల్యాణ్ అంగీకరించారని అంటున్నారు.

# ఉత్తరాఖండ్ లో విరిగిపడుతున్న కొండ చరియలు

డెహ్రాడూన్, : ఉత్తరాఖండ్ ధార్చులలోని తవాఘాట్ సమీపంలోని హైవేపై ఉన్న పెద్ద కొండలో కొంత భాగం పగుళు వచ్చి రోడ్డుపై పడిపోయింది. కొండచరియలు విరిగిపడటంతో ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విరిగిపడుతున్న రాళ్ల భాగాలు, మట్టితో ఆ ప్రాంతమంతా భయంకర వాతావరణం నెలకొంది. ఈ రహదారి చైనా సరిహద్దును కలుపుతుంది. ఉవ్వెతున ఎగిసిపడుతున్నట్లుగా కొండలో ఒక వైపు భాగం నుంచి కొంత విరిగిపడడం మనం చూడొచ్చు. ఇలాంటి ఎత్తైన కొండలు ఉన్న ప్రాంతంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.లేదంటే ప్రాణాలకే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంటుంది. అయితే.. భారీ కొండచరియ విరిగిపడుతున్నప్పుడు కొందరు ఆ దృశ్యాలను తమ సెల్ ఫోన్లలో చిత్రీకరించారు. విషయం తెలుసుకున్న ఃఖీ బృందం వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుంది.

# ఆకుపచ్చ రంగుగా మారిన మంజీరా వాగు..



చిలిపిచెడ్ : మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండల పరిధిలోని చిట్కుల్ గ్రామ శివారులో గల అతి ప్రసిద్ధిగాంచిన శ్రీ చాముండేశ్వరి ఆలయ పరిసర ప్రాంతంలో గల మంజీరా నదిలో ఉన్నట్టుండి స్వచ్ఛమైన నీరు కాస్త ఆకుపచ్చ రంగులోకి మారి ప్రజలను ఆశ్చర్యపరుస్తుంది. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు స్నానాలు చేసేందుకు వాగులోకి వెళ్లగా ఆ వాగులో ఉన్న ఆకుపచ్చ రంగులో మారిన నీటిని చూసి భయభ్రాంతులకు గురవుతున్నారు. స్వచ్ఛమైన నీళ్లు ఆకుపచ్చ రంగులో మారడానికి నది ప్రవాహంలో వివిధ ఫార్మా కంపెనీల నుండి వెలువడే వ్యర్థ పదార్థాలు, రసాయనాలే కారణం అంటున్నారు. వాటి ద్వారానే నీళ్ల కలుషితమవుతున్నాయని, దీంతోనే ఈ స్వచ్ఛమైన నీరు కాస్త ఆకుపచ్చ రంగులో మారి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు మహారాష్ట్ర, కర్ణాటక, ఇతర రాష్ట్రాల నుండి వేలాది మంది భక్తులు వస్తుంటారు. అమ్మవారి సన్నిధిలో గల మంజీరా నదిలో స్నానాలు చేస్తే పాపాలు తొలుగుతాయని అక్కడి భక్తుల నమ్మకం. అలాంటిది మంజీరా నదిలో ఆకుపచ్చ రంగులో నీళ్లు కనిపించడంతో స్నానాలు చేసేందుకు వీలు లేకుండా పోయింది. స్నానాలు చేయకుండానే దైవ దర్శనానికి ఎలా వెళ్లాలని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి స్వచ్ఛమైన నీటిని కలుషితం చేస్తున్న కంపెనీల పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు పలువురు కోరుతున్నారు. వాగులోని నీళ్లలో స్నానాలు చేసేందుకు భక్తులు జంకుతున్నారు.

# పివి తెలుగువాడు కావడం అదృష్టం

## వర్ధంత సందర్భంగా భట్టి నివాళి

హైదరాబాద్, : భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తెలంగాణ రాష్ట్రంలో పుట్టడం మన అదృష్టమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. పీవీ నరసింహారావు 20వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ నెరక్లెస్ రోడ్‌లోని పీవీ ఘాట్ వద్ద భట్టి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం పీవీ నరసింహారావు అనేక నిధులు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఇక, పీవీ భూ సంస్కరణల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదన్నారు. దేశంలో విద్య వ్యవస్థను పటిష్టం చేసేందుకు పీవీ అద్భుతమైన ప్రణాళికలు రూపొందించారన్నారు.

# ఎవరితోనూ పోల్చకండి..!



**పిల్లల్ని మరొకరితో కంపేర్ చేస్తూ మాట్లాడటం సరికాదంటు న్నారు నిపుణులు. ఇలా పోల్చడం పిల్లల్లో ఆత్మనూన్యతా భావం పెంచినట్లు అవుతుంది. అంతేకాదు ఇలా చేయడం వల్ల వాళ్లు మొండిగా తయారవుతారంటున్నారు. మన చుట్టూ ఉన్న పిల్లల్లో ఏ ఒక్కరూ మరొకరిలా అసలు ఉండనే ఉండరు. పిల్లలేంటి.. పెద్దలైనా.. ఎవరూ మరొకరిలా ఉండరు. అలాంటప్పుడు వేరే వారితో పోల్చడం ఎంత వరకూ సబబు? వాళ్ల ఎదుగుదలకు ఇది ఆటంకంగా మారుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పేరెంటింగ్ ఎలా ఉండాలో సూచనలు చేస్తున్నారు.**

గుణగణాల్లో.. బలాలు, బలహీనతలు ఉంటాయి. వాటిని వేరే పిల్లలతో పోల్చకండి. ఒక పిల్లవాడు లెక్కల్లో టాపర్‌గా ఉండొచ్చు.. మరొకరు ఆటలు బాగా ఆడుతూ, ఫస్ట్ రావొచ్చు. కొందరు చక్కగా, శ్రావ్యంగా పాటలు పాడతారు. ఇలా ఒక్కొక్కరికీ ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. తల్లిదండ్రులుగా వారి వారి ప్రత్యేకతలేమిటో గుర్తించి, ప్రోత్సహించండి. అది వదిలేసి.. 'మామయ్య వాళ్ల పిల్లలు చూడు స్కూల్ నుంచి రాగానే గంటసేపు ఆడుకుంటారు అంతే.. ఎవరూ చెప్పకుండా హోమ్‌వర్క్ ఫినిష్ చేసేస్తారు. ఏమైనా ఆడపిల్లలు నయం. నువ్వూ ఉన్నావు ఎందుకు? ఎంత చెప్పినా వినవు కదా.. నీకు చెప్పినా.. ఆ గోడకు చెప్పినా అంతే.. వేస్ట్‌ఫెలో!' ఇలా పిల్లల్ని కొందరు తల్లిదండ్రులు అనేస్తుంటారు. ఇలా మాట్లాడటం వల్ల పిల్లలు మనోవేదనకు గురవుతారు అంటున్నారు నిపుణులు.. అంతేకాదు ఇలాంటి సందర్భాలు వారిని తీవ్ర ఒత్తిడితో తల్లడిల్లుతారు. ఫలితంగా వారికి అనాసక్తిగా, అన్యమనస్కంగా ఉంటుంటారు. మానసికమైన కుంగుబాటుతోనే ఇలాంటి పరిస్థితులు వస్తాయనేది నిపుణులు చెప్తున్న మాట.

మీ వరకూ వస్తే..: తల్లిదండ్రులు ఒక్కసారి ఆ స్థానంలో మీరుంటే ఏం చేస్తారు? మీరు పనిచేసే సంస్థలో ఒకరి పనిని మరొకరి పనితో పోల్చి క్రిటిసైజ్ చేస్తుంటారు. అలాంటి సమయంలో మీకెంతో బాధకలుగుతుంది కదా! మీరే ఇలాంటి పరిస్థితుల్ని తట్టుకోలేకపోతే.. చిన్న పిల్లలు వాళ్లు ఎంతలా తల్లడిల్లుతారో ఆలోచించాలి అంటున్నారు నిపుణులు. కంపారింగ్ వల్ల కలిగిన బాధ కొన్నిరోజుల పాటు కొనసాగుతుంది అంటున్నారు. పెద్దలే రోజుల తరబడి కుంగిపోతుంటారు. పిల్లలు మరిచిపోతారని అనుకోవద్దు.. వాళ్లు లోలోపల కుంగిపోతారని హెచ్చరిస్తున్నారు. ఈ విషయాలన్నీ పరిగణనలోకి తీసుకొని పిల్లల్ని ఒకరితో పోల్చడం మానుకోవాలంటున్నారు నిపుణులు.

సోదరీ సోదరులతో సైతం..: కొందరు తల్లిదండ్రులు పిల్లల్ని సోదరీ/సోదరులతో పోలుస్తుంటారు.. 'అన్నయ్య చూడు నీకన్నా ముందు లేచి.. చకచకా తన పనులన్నీ తనే చేసేసుకుంటున్నాడు. నువ్వో.. ముద్దపప్పులా ఎప్పుడూ సోంబేరి మొహం వేసుకుని ఉంటావు.. చెల్లి చూడు క్లాస్ ఫస్ట్.. నీకు ట్యూషన్ పెట్టించినా ఫెయిలే.. స్కూల్‌కి చదవడానికేనా వెళ్లేది? ఇలా రకరకాల మాటలతో పిల్లల్ని బాధపెట్టడం మానుకోవాలని చెప్తున్నారు నిపుణులు. దీనివల్ల వారి బలహీనత సరికాకపోగా, పోల్చిన వారిపై ద్వేషం, అసూయ పెరిగిపోతుంది. దీనివల్ల పిల్లల్లో మానసికమైన, ప్రవర్తనాపరమైన లోపాలు ఏర్పడతాయి.. ఫలితంగా పెరిగి, పెద్దయ్యే కొద్దీ ఈ బిహేవియర్ సరికాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

వెనకబడిపోతారు..: మన కుటుంబాల్లో.. పక్కింటి, ఎదురింటి పిల్లలతో పోల్చడం వల్ల నష్టమని చెప్తున్నారు నిపుణులు. ఇలా కంపార్ చేస్తూ ఉంటే పిల్లలు తల్లిదండ్రులతో ఏ విషయాలూ పంచుకోరని అంటున్నారు. ఒంటరిగా ఉండడానికే ఇష్టపడుతూ ఆత్మన్యూనతకు లోనవుతారు. ఇది ఒకరకమైన మానసిక అనారోగ్యం అంటున్నారు నిపుణులు. ఎవరితోనూ కలవడానికీ ఇష్టపడరు.. ముభావంగా ఉంటూ.. తల్లిదండ్రులపై ద్వేష భావాన్ని పెంచుకుంటారు. వీటన్నింటికన్నా పిల్లలు ఏ సబ్జెక్టులో వెనకబడుతున్నారు? అందుకు అసలు కారణాలేమిటి? స్కూల్లో సమస్యలేమిటి? పాఠాలు అర్థమవుతున్నాయా? లేదా? ఇవన్నీ తెలుసుకుని, సమస్య ఎక్కడుందో అది పరిష్కరించడం ఉత్తమమం. ఇలాంటి పేరెంటింగ్ పిల్లల ఎదుగుదలకు ఉపయోగపడుతుందంటున్నారు నిపుణులు.

బుద్ధిగా ఉంటే మెరిట్ కాదు..: పిల్లలు బుద్ధిగా, చెప్పినట్లు వింటూ హోమ్‌వర్క్‌లు చేసేసినంత మాత్రాన మెరిట్ కాదు. పిల్లలు బాగా చదువుతూ.. కాసేపు ఎక్కువ ఆడుకున్నా తప్పు పట్టొద్దు.. అవతలి పిల్లలు చేసినట్లే మన పిల్లలూ అలాగే చేయాలనుకోవడం సరికాదంటున్నారు నిపుణులు. పిల్లలు చదువులో వెనకబడకుండా, యాక్టివ్‌గా ఉంటే అంతకన్నా ఇంకేం కావాలి? అలాకాకుండా చదువు పట్ల అలక్ష్యం ప్రదర్శిస్తుంటే ఏం చేయాలో తల్లిదండ్రులు ఆలోచించాలి. అందుకు వాళ్లకి చదువు విలువ, దాంతో సమాజంలో పెరిగే గౌరవం అర్థమయ్యేలా చెప్పాలి. తోటి పిల్లలతో పోల్చకుండా వీళ్లల్లోని సానుకూలాంశాల్ని ప్రస్తుతించాలి అంటున్నారు నిపుణులు. పిల్లలు తాము ఎక్కడ ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా తల్లిదండ్రులతో పంచుకునేలా అవకాశం ఇవ్వాలి. అందుకోసం పేరెంట్సే పిల్లలతో కలిసి ఆ విషయాలపై చర్చించాలి అంటున్నారు. వచ్చిన సమస్యల్ని ఎలా అధిగమించాలో తల్లిదండ్రులే చెప్పాలంటున్నారు. ఇవన్నీ ఏ రోజుకారోజు జరగాల్సిందేనని చెప్తున్నారు. ఇలా క్రమేణానే పిల్లల్లో మార్పు తేవడానికి తల్లిదండ్రులే ప్రయత్నించాలి.

# డీ పోచంపల్లిలో జోరుగా అక్రమ నిర్మాణాలు..

## అధికారులపై తీవ్ర విమర్శలు

దుండిగల్: ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు కబ్జాదారులకు పరోక్షంగా సహకరిస్తుండడంతో విలువైన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయి. దుండిగల్ మండల పరిధిలోని డీ పోచంపల్లి సర్వే నెం. 120లో జోరుగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నా కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడడం లేదు. సంబంధిత కబ్జాలపై రెవెన్యూ అధికారులను వివరణ కోరితే కబ్జాదారుల నుంచి ఫోన్ కాల్స్ వస్తుండడం రెవెన్యూ అధికారుల తీరుకు అద్దం పడుతోంది. మండలంలో కాసులకు కక్కుర్తి పడుతున్న రెవెన్యూ అధికారులు కబ్జాదారులకు లీకు వీరులుగా మారారంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలను అరికట్టేందుకు 59 జీవోపై ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని ప్రస్తుత ప్రభుత్వం నుంచి స్పష్టంగా ఆదేశాలున్నా దుండిగల్ మండలంలో 59 జీవో పేరుతో అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. కాపాడాల్సిన వారే కాటేసున్నట్లుంది రెవెన్యూ అధికారుల తీరు ఉంది. రెవెన్యూ అధికారులను వివరణ కోరిన నిమిషాల్లో కబ్జాదారుల నుంచి ఫోన్ కాల్స్ వస్తున్నాయంటే రెవెన్యూ అధికారుల తీరు ఏపాటిదో అర్థం అవుతుంది. నిఘా పెంచి కబ్జాల నుంచి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని డిమాండ్ వినిపిస్తుంది.

# కేడర్‌ను కాపాడుకునే యత్నం

### కూటమి ప్రభుత్వం విఫలం అయ్యిందన్న ప్రచారం

### కొత్త ఎత్తులతో ప్రజల్లోకి వెళ్లేలా వైకాపా అడుగులు

అమరావతి,డిసెంబర్26 : ఆంధ్రప్రదేశ్‌లో ఆరు నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ ఘోరంగా పరాజయం పాలయ్యాక ఇప్పుడు మళ్లీ తమదే అధికారం అంటూ..ఆ పార్టీ నేతలు బల్లగుద్ది చెబుతున్నారు. పార్టీ అధినేత కూడా కూటమి ప్రభుత్వానికి కాలంచెల్లిందని విమర్శలు చేస్తున్నారు. ఆరునెలల్లోనే ప్రభుత్వం అప్రతిష్టను మూటకట్టుకుందని, అన్ని రంగాల్లోనూ విఫలంఅయ్యిందని విమర్శలుచేస్తోంది. జనవరి నుంచి నియోజకవర్గాల బాట పట్టాలని వైసీపీ అధినేత జగన్ నిర్ణయించుకున్నారు. దీనికి తగ్గట్టుగానే కేడర్, లీడర్‌లను సమాయత్తం చేసేందుకు అదిగో ఎన్నికలు అన్నట్టు ప్రచారం చేస్తోంది. జమిలి ఎన్నికల బిల్లు పార్లమెంట్‌లో ఉంది. దీనిపై జేపీసీ స్టడీ చేస్తోంది. అది వచ్చే పార్లమెంట్ సమావేశాలకు ఆమోదం పొందుతుంది. అది అమోదం పొంది అమల్లోకి వస్తే మాత్రం 2027లోనే ఎన్నికలు వస్తాయని వైసీపీ చెబుతోంది. అధినేత నుంచి గల్లీ లీడర్ వరకు అంతా అదే ప్రచారం చేస్తున్నారు. దీనికి చాలా కారణాలు ఉన్నాయి. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన షాక్ నుంచి ఇంకా చాలా మంది వైసీపీ నేతలు తేరుకోలేక పోతున్నారు. అలాంటి తీర్పు ఎలా ఇచ్చారనే మధనపడుతున్నారు. మరికొందరు కూటమి పార్టీల్లో ఏదో పార్టీలో చేరిపోవాలనే ఆలోచన చేస్తున్నారు. ఇప్పటికే చాలా మంది ఆ పని చేశారు కూడా. కొన్ని నియోజకవర్గాల్లో ఇన్చార్జ్‌లు లేకపోవడంతో ఎవరితో నడవాలో తెలియని పరిస్థితిలో కేడర్ ఉంది. ఇలాంటి స్థితిని హ్యాండిల్ చేయలేకుంటే పార్టీకి భారీగా డ్యామేజ్ తప్పదని గ్రహించిన వైసీపీ ఇదిగో ఎన్నికలు అంటూ ప్రచారం చేస్తోంది. ఒక వేళ 2027లో ఎన్నికలు జరిగితే ఇంకా మూడేళ్లే నాలుగేళ్లే ఉందని నేతలంతా జనంలో ఉంటారని వైసీపీ ఎలాన్. కేడర్‌లో కూడా ఉత్సాహం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో 151 అసెంబ్లీ స్థానాలతో దేశ చరిత్రలోనే అతి పెద్ద విజయాన్ని అందుకున్న ఆ పార్టీ ఐదేళ్లు తిరిగే సరికి 11 స్థానాలకు పరిమితం అయింది. ఈ షాక్‌లో ఉన్న కేడర్‌ను, పక్క పార్టీల వైపు చూస్తున్న లీడర్‌ను తమతో ఉంచుకునేందుకు ఎన్నికల పాట అందుకుంది. జమిలీ ఎన్నికలు 2027లోనే వస్తాయని అప్పటి కూటమిపై వ్యతిరేకత తీవ్ర స్థాయిలో ఉంటుందని నూరి పోస్తోంది. దీన్నే జనంలోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తోంది. కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో పగ్గాలు చేపట్టి ఆరు నెలలు అవుతోంది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను క్రమంగా అమలు చేస్తూ వస్తోంది. మరోవైపు పారిశ్రామికవేత్తలను రాష్ట్రంవైపు తిప్పుకునేందుకు పాట్లు పడుతోంది. అమరావతిని పట్టాలు ఎక్కిస్తోంది. హామీల అమలు విషయంలో మాత్రం కాస్త తడబాటు ఉంది. దీన్నే వైసీపీ తమకు అనుకూలంగా మార్చుకుంటోంది . ప్రజల్లో వ్యతిరేకత మరింతగా పెంచేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ మధ్య కాలంలోనే రైతులకు సంబంధించిన ధాన్యం కొనుగోలు సరిగా జరగడం లేదని ధర్నాలు చేపట్టింది. విద్యుత్ ఛార్జీలపై కూడా నిరసనలు చేసేందుకు సిద్ధమైంది. ఇలా వివిధ సమస్యలు ప్రజల్లోకి తీసుకెళ్తూనే... గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నగదు బదిలీ పథకాలను గుర్తు చేస్తోంది. ఇప్పుడు వాటిని కూటమి ప్రభుత్వం ఆపేసిందన్న ప్రచారానికి తెరతీసింది. అందుకే అప్పట్లో జగన్ ఉండి ఉంటే అనే ప్రచారం తీసుకొచ్చింది. అది పెద్దగా వర్కౌట్ కాలేదు. నియోజకవర్గాల పునర్విభజన కంటే ముందే ఎన్నికలు వస్తాయని ప్రచారం చేస్తే పార్టీ మారే వారి ఆలోచన కూడా మార్చవచ్చని చెబుతున్నారు. కూటమి హౌస్‌ఫుల్ అయినందున వైసీపీ నుంచి దూకేందుకు సిద్ధంగా ఉన్న వాళ్లు తగ్గుతారని ఎ÷--లాన్. ఇలా నలువైపులా ఆలోచించిన వైసీపీ 2027లోనే ఎన్నికలు రాబోతున్నాయని కచ్చితంగా వైసీపీ అధికారంలోకి వస్తుందని ప్రచారం చేస్తోంది. ఇప్పటి వరకు ఈ ప్రచారం ఎంపీలు, కింది స్థాయి నాయకులు మాత్రమే చేస్తూ వచ్చారు. ఇప్పుడు ఏకంగా అధ్యక్షుడు జగన్ అందుకున్నారు. పులివెందులలో పర్యటించిన జగన్ 2027లో ఎన్నికలు వస్తాయని వైసీపీ అధికారంలోకి వస్తుందని అన్నారు. అమలు చేయలేదని హామీలు ఇచ్చిన ఇప్పుడు ప్రజల వ్యతిరేకత ఎదుర్కొంటున్న చంద్రబాబు సర్కారుకి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. పులివెందుల పర్యటనలో భాగంగా ఆయన కడప నేతలు, కార్పొరేటర్ల, కీలక నేతలతో సమావేశమయ్యారు. జిల్లా, రాష్ట్ర రాజకీయాలు, పార్టీ బలోపేతంపై చర్చించారు. కష్టాలు శాశ్వతం కావని.. పార్టీని అంటిపెట్టుకున్న వాళ్లకు భవిష్యత్‌లో గుర్తింపు ఉంటుందని జగన్ అన్నారు. ఇలాంటి టైంలో వ్యక్తిత్వాన్ని అమ్ముకోకూడదని నేతలకు సూచించారు. దేశ చరిత్రలోనే ఎవరూ చేయని విధంగా సంక్షేమ కార్యక్రమాలు చేశామని అన్నారు. కేవలం అబద్దాలు చెప్పలేకపోవడంతోనే ప్రతిపక్షంలో కూర్చున్నా మన్నారు జగన్. ప్రజలు వాస్తవాలు తెలుసుకుంటారని గత ప్రభుత్వంతో ఈ ప్రభుత్వం పని తీరును పోల్చి చూస్తారని అన్నారు. 2027లో జరిగే ఎన్నికల్లో కచ్చితంగా వైసీపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## విషమంగా మంద జగన్నాథం ఆరోగ్య పరిస్థితి



హైదరాబాద్, డిసెంబర్ 26 : నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మంద జగన్నాథం ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నది. రెండు రోజుల క్రితం గుండెపోటు రావడంతో ఆయన కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు వెల్లడించారు. దీంతో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తోపాటు పలువురు రాజకీయ ప్రముఖులు పరామర్శించారు. 1996లో ఆయన తొలిసారిగా టీడీపీ తరఫున నాగర్‌కర్నూల్ ఎంపీగా విజయం సాధించారు. 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో తెలుగు దేశం టికెట్‌పై విజయం సాధించారు. ఆతర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన 2009 ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలుపొందారు. 2014లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆ ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయారు. 2019 ఎన్నికల్లో ఆయనకు టికెట్ దక్కలేదు. ఈ నేపథ్యంలో 2022, జూలై 1న ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా అప్పటి సీఎం కేసీఆర్ ఆయనను నియమించారు. 2023 నవంబర్ 17న బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే నాగర్‌కర్నూల్ టికెట్ దక్కకపోవడంతో బీఎస్పీ తీర్థం పుచ్చుకున్నారు.

## జొమాటో బాయ్‌ను నిలదీసిన సుమిత్ హర్దియా

### దీపావళి రోజు రాముని వస్త్రాధరణలో డెలివరీ చేస్తారా..?



న్యూఢిల్లీ, డిసెంబర్ 26: దీపావళి రోజున రాముని వేషంలో వస్తారా?.. ఇది శాంటా క్లాజ్ వేషధారణలో ఉన్న ఓ ఫుడ్ డెలివరీ బాయ్‌కి ఎదురైన ప్రశ్న. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో.. క్రిస్మస్ కావడంతో శాంటా క్లాజ్ దుస్తులు వేసుకున్న ఓ జొమాటో డెలివరీ బాయ్ వినియోగధారులకు ఫుడ్ సప్లయ్ చేస్తున్నారు. ఈ క్రమంలో హిందూ జాగరన్ మంచ్ ఇండోర్ అధ్యక్షుడు సుమిత్ హర్దియా అతడిని అడ్డుకున్నారు. మీరు శాంటా క్లాజ్‌లా దుస్తులు ధరించి ఆర్డర్‌ని డెలివరి చేస్తున్నారా అని ప్రశ్నించాడు. దీంతా ఆ ఏజెంట్ అవునని చెప్పాడు. ఇలాగే దీపావళి పండుగ నాడు ఎప్పుడైనా రాముని వేశం వేసుకుని ప్రజల ఇండ్లకు వెళ్లారా అని నిలదీశారు. లేదని, కానీ ఇప్పుడు మాత్రం కంపెనీ ఆదేశాలతోనే ఈ దుస్తులు ధరించాలని, ప్రజలకు సందేశం ఇవ్వాలని చెప్పిందని డెలివరీ బదులిచ్చారు. అనంతరం ఆ దుస్తులను అతడు విప్పేశాడు. మనం హిందువులం. ఇలాంటి దుస్తులు వేసుకుని పిల్లలకు ఏం సందేశం ఇస్తున్నామని సుమిత్ ప్రశ్నించారు. అలాంటి సందేశం ఏదైనా ఇవ్వాలనుకుంటే శాంటాక్లాస్ దుస్తులు వేసుకోవడం తప్పనిసరా అన్నారు. అలాంటప్పుడు భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజావ్‌లా కూడా దుస్తులు ధరించాలని తెలిపారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నది.

## ఇండియాలో కూటమి భగ్గుమన్న విభేదాలు

### ఆప్‌ను తొలగించేందుకు ప్రయత్నాలు..?



న్యూఢిల్లీ, డిసెంబర్ 26: ప్రతిపక్ష ఇండియా కూటమిలో విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. ముఖ్యంగా కూటమి భాగస్వామ్య పక్షాలైన కాంగ్రెస్, ఆప్ మధ్య వైరం రోజురోజుకూ పెరిగిపోతోంది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ ఆమ్ ఆద్మీ పార్టీపై కాంగ్రెస్ ఆరోపణలతో ఈ వైరం మరింత ముదురుతోంది. తాజాగా ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్ పార్టీని బయటకు పంపించేందుకు అధికార ఆమ్ ఆద్మీ పార్టీ ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆమ్ ఆద్మీ పార్టీ ఇస్తున్న ఎన్నికల హామీలపై కాంగ్రెస్ తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే.ఎన్నికల సందర్భంగా ఆచరణ సాధ్యం కాని హామీలు అమలు చేస్తామని కేజ్రీ వాల్ ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్నారంటూ హస్తం పార్టీ ఆరోపించింది.ఈ నేపథ్యంలోనే ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్ పార్టీని బయటకు పంపించేందుకు ఆప్ ప్రయత్ని స్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు కూటమి నుంచి కాంగ్రెస్‌ను బయటకు పంపించేలా ఇతర పార్టీ లను ఒప్పించేందుకు ఆప్ ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు సమాచారం. కేంద్రంలో బీజేపీని అధికారం నుంచిదించేయాలన్న ప్రధానలక్ష్యంతో సుమారు 24విపక్ష పార్టీలతో ఏర్పడిన ఇండియా కూటమి బీటలు వారుతున్నది. ఇప్పటికే కూటమిలో ఉన్న విభేదాలు లోక్ సభ ఎన్నికల్లో ప్రస్ఫుటం కాగా, ఇటీవల జరిగిన పలురాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూటమికి నేతృత్వం వహిస్తున్న రాహుల్ గాంధీ పట్ల అందులోని పార్టీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. 'ఎన్ని కల్లో విజయం సాధించి పెట్టలేని నాయకుడిని మనం ఇంకా ఎంతకాలం భరిం చాలి' అన్న ధోరణి ఆ పార్టీల్లో ఇటీవల అధికమైంది. రాహుల్ నాయకత్వంలో బీజేపీని ఎదుర్కో వడం కష్టమేనని, కాంగ్రెస్‌ను నమ్ముకుంటే తామూ మునగడం ఖాయమని ఆయా పార్టీల నేతలు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రత్యా మ్నాయంగా బెంగాల్ సీఎం మమతా బెనర్జీ నాయకత్వానికి జై కొడుతు న్నారు. ఇప్పటికే సమాజ్‌వాదీ, ఎన్సీపీ (శరద్ చంద్ర పవార్), శివసేన (యూబీటీ) సహా పలు మిత్రపక్ష పార్టీలు దీదీకి మద్దతు తెలిపిన విషయం తెలిసిందే.

## బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్టు



హైదరాబాద్, డిసెంబర్ 26 : బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అరెస్టు సమయంలో దురుసుగా ప్రవర్తించారంటూ ఎర్రోళ్ల శ్రీనివాసపై పోలీసులు కేసు నమోదుచేశారు. ఈనేపథ్యంలో గురువారం ఉదయం నోటీసులు ఇచ్చేందుకు మారేడ్‌పల్లిలోని ఆయన నివాసానికి టాస్క్‌ఫోర్స్ పోలీసులు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున్న శ్రీనివాస్ నివాసానికి చేరుకున్నారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని మాసబ్‌ట్యాంక్ పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్యాయంగా, అక్రమంగా అరెస్టు చేస్తున్నదని విమర్శించారు. ప్రశ్నించిన వారిని కాంగ్రెస్ సర్కార్ వేధిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. 14 ఏండ్లపాటు ఉద్యమంలో పాల్గొన్నానని, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా పనిచేశానని చెప్పారు. తెల్లవారుజామున వచ్చి ఇంటి డోర్లు కొట్టడమేంటని ప్రశ్నించారు. ప్రభుత్వం కుట్రపూరితంగా కేసులు పెడుతున్నదని మండిపడ్డారు. ఎన్నికేసులు పెట్టినా, ఎంత నిర్బంధం విధించినా ప్రశ్నిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు.

## ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ సేవలో అంతరాయం

### అసహనం వ్యక్తం చేసిన ప్రయాణికులు




న్యూఢిల్లీ, డిసెంబర్ 26: రైల్వే టికెట్ల బుకింగ్ కోసం ఏర్పాటైన ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ సేవల్లో అంతరాయం ఏర్పడింది. మెయింటెనెన్స్ కారణంగా సర్వర్ డౌన్ అయ్యింది. ఫలితంగా గురువారం ఉదయం కొన్ని గంటల పాటు ఐఆర్‌సీటీసీ సేవలు నిలిచిపోయాయి. ఉదయం తత్కాల్ టికెట్స్ బుకింగ్ సమయంలో ఈ సమస్య తలెత్తింది. దీంతో యూజర్లు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వెబ్‌సైట్, మొబైల్ యాప్ ఓపెన్ అవ్వట్లేదని పలువురు యూజర్లు ఉదయం నుంచి సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. తాము రైలు ప్రయాణ టికెట్లు బుక్ చేసుకోలేక పోతున్నామంటూ పేర్కొంటున్నారు. ఈ సమస్యపై ఐఆర్‌సీటీసీ స్పందించింది. మెయింటెనెన్స్ కారణంగా ఈటికెట్ సేవలు అందుబాటులో లేవని తెలిపింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. టికెట్ రద్దు చేసుకోవడానికి, ఫైల్ టీడీఆర్ కోసం కస్టమర్ కేర్ నెంబర్ 14646, 08044647999, 08035734999కు ఫోన్ చేయాలని సూచించింది. కాగా, ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ సేవల్లో అంతరాయం కలగడం ఈ నెలలో ఇది రెండో సారి. రెండు వారాల క్రితం కూడా ఇదే సమస్య తలెత్తిన విషయం తెలిసిందే. అప్పుడు కూడా తత్కాల్ బుకింగ్ సమయంలోనే సమస్య తలెత్తింది. తరచూ ఇలాంటి సమస్యల కారణంగా ప్రయాణికులు తీవ్ర అసహకానికి గురవుతున్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల, డిసెంబర్ 26 : వేంకటేశ్వరస్వామిని మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, టేబుల్ టెన్నిస్ ప్లేయర్ నైనా జైస్వాల్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, అమర్నాథ్ రెడ్డి దర్శించుకున్నారు. గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు ఆలయ మర్యాదలతో అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల జరిగిన మహారాష్ట్ర ఎన్నికలు ఎటువంటి ఘర్షణలు లేకుండా శాంతియుతంగా, నిజాయితీగా జరగాలని శ్రీవారిని గతంలో కోరుకున్నట్లు గవర్నర్ తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడంతో స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చినట్లు ఆయన చెప్పారు. ఆ దేవ దేవుడిని ప్రజలు ఎలా అయినా ప్రార్థించవచ్చని, ఆ స్వేచ్ఛ భగవంతుడు మనందరికీ ఇచ్చారని ఆయన అన్నారు. మహిళలపై దాడులు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని, కఠినమైన శిక్షలు అమలు చేస్తేనే నేరాలు చేయాలనుకునే వారి వెన్నులో వణుకు పుడుతుందని ఆయన చెప్పారు. తప్పు ఎవరు చేసినా కఠిన శిక్షలు విధిస్తేనే ఆడవారికి నిజమైన రక్షణ కల్పించిన వాళ్లమవుతామని గవర్నర్ చెప్పుకొచ్చారు. మరోవైపు జనవరి 10 నుంచి 19 వరకూ వైకుంఠద్వార దర్శనాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో జనవరి 7న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 6 నుంచి 10 గంటల వరకూ ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని అర్చకులు నిర్వహించనున్నారు. ఆ తర్వాత భక్తులను దర్శనానికి అనుమతించనున్నారు. కోయిల్ ఆళ్వార్ నేపథ్యంలో 7వ తేదీన వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేసినట్లు టీటీడీ ప్రకటించింది. దీంతో 6వ తేదీన ఎలాంటి సిఫారసు లేఖలను తీసుకోమని ఆలయ అధికారులు తెలిపారు.

## అక్రమ అరెస్టులతో రేవంత్‌రెడ్డి పాలన రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి భంగం : హరీశ్‌రావు



హైదరాబాద్, డిసెంబర్ 26 : సీఎంగా రేవంత్‌రెడ్డి అయిన తరువాత నుంచి అక్రమ అరెస్టులు పెరిగాయని, అక్రమ అరెస్టులతో ప్రజా స్వామ్యానికి తూట్లు పొడుస్తున్నాడని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్టును సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. ఉదయాన్నే పోలీసులు ఇంటి వద్దకు వచ్చి అక్రమ అరెస్టు చేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు కనీస సమాచారం ఇవ్వకుండా, ఎలాంటి నోటీసు లేకుండా అరెస్ట్ చేయడం పూర్తిగా అప్రజాస్వామికమన్నారు. ఇది ఇందిరమ్మ రాజ్యమా.. పోలీస్ రాజ్యమా? అంటూ ఎక్స్ వేదికగా ఫైర్ అయ్యారు. అడిగితే అరెస్టులు.. ప్రశ్నిస్తే కేసులు.. నిలదీస్తే బెదిరింపులు అంటూ విరుచుకుపడ్డారు. ప్రజాస్వామ్య పాలన అని డబ్బా కొడుతూ, రాక్షస పాలన కొనసాగిస్తున్నారన్నారు. సెలవు రోజుల్లో కావాలని బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేస్తూ సీఎం నియంతలా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. హోం మంత్రిగా శాంతి భద్రతల నిర్వహణలో విఫలమైన రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ కార్యకర్తలను వేధించడంపైనే దృష్టి పెట్టారన్నారు. ఈ పైశాచిక ఆనందం ఎక్కువ కాలం నిలవదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మీ పిట్ట బెదిరింపులు, అక్రమ కేసులకు భయపడే వారు మేము కాదని గుర్తుంచుకోండి. తెలంగాణ సమాజమే మీకు తగిన బుద్ధి చెబుతుందని హరీశ్‌రావు ట్వీట్ చేశారు.

## ఎమ్మెల్యేపై కోడిగుడ్లతో దాడి



బెంగళూరు, డిసెంబర్ 26 : కర్ణాటక మాజీ మంత్రి, రాజ రాజేశ్వరి నగర్ ఎమ్మెల్యే, బీజేపీ నేత మునిరత్న నాయుడిపై కొందరూగుర్తు తెలియని వ్యక్తులు కోడిగుడ్లతో దాడి చేశారు. అత్యాచారం కేసులో అరెస్ట్ అయ్యి మునిరత్న బెయిల్ మీద బయటకి వచ్చిన విషయం తెలిసిందే. అయితే నేడు వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా.. లక్ష్మినగర్‌లో నిర్వహించిన వేడుకలో మునిరత్న పాల్గొన్నారు. ఈ వేడుక అనంతరం మునిరత్నం తిరిగి వెళుతుండగా.. కొందరు వ్యక్తులు అతడిపై గుడ్లతో దాడి చేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు వైరల్‌గా మారాయి. మరోవైపు ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మునిరత్న స్పందిస్తూ.. కర్నాటక డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ అతని తమ్ముడు నన్ను చంపడానికి కుట్ర పన్నారని ఆరోపించాడు.

## ఖరీదైన కారుకు మంటలు

### 45 నిమిషాలు శ్రమించి మంటలు ఆర్పివేసిన సిబ్బంది



ముంబై,డిసెంబర్ 26: మహారాష్ట్ర ముంబైలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. కోస్టల్ రోడ్‌లో కోట్ల ఖరీదైన లగ్జరీ లాంబోర్గినీ కారు మంటల్లో చిక్కుకుంది. బుధవారం రాత్రి 10:20 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకొని దాదాపు 45 నిమిషాలు శ్రమించి మంటలను ఆర్పివేశారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు తెలియరాలేదు. గుజరాత్ రిజిస్ట్రేషన్‌తో ఉన్న ఆరెంజ్ కలర్ కారు క్యాబిన్‌లో మంటలు వస్తున్న వీడియోను వ్యాపార దిగ్గజం గౌతమ్ సింఘానియా ఎక్స్ వేదికగా షేర్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది. ఈ కారు ఖరీదు రూ.9 కోట్లు అని సమాచారం.

## ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి

### మహిళను నిట్టనిలువునా మోసం చేసిన బాబు

### వైసిపి మహిళ విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి

విశాఖపట్టణం,డిసెంబర్26: క్రిస్మస్ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరొకసారి మహిళలను నిట్ట నిలువుగా మోసం చేసారని శాసన మండలి సభ్యురాలు, వైఎస్ఆర్సిపి రాష్ట్ర మహిళ విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి ఘాటుగా విమర్శించారు. విశాఖలోని ఆమె క్యాంపు కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో సూపర్ సిక్స్‌తో పాటు పండగ కానుకలు కూడా ఇస్తానని ప్రకటించారని, క్రిస్టమస్ కానుక ఏది చంద్రబాబు నాయుడు అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఎన్నో పథకాలు మహిళలకు ఇస్తానని చెప్పి నమ్మించి ఓట్లు వేయించుకొని ఈరోజు నట్టేట ముంచారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు అయినా మేనిఫెస్టోలో ఇచ్చిన ఏ పథకం కూడా అమలు చేయలేదని,తల్లికి వందనం పథకం కింద ప్రతి బిడ్డకి 15000 రూపాయలు ఇస్తానని చెప్పిన చంద్రబాబు నాయుడు డిసెంబర్ వచ్చినా ఇవ్వకుండా రాష్ట్రంలో ఉన్న 80 లక్షల మంది విద్యార్థులను నిట్టనిలువునా మోసం చేశారని దుయ్య బట్టారు.విద్య దీవెన లేదు, వసతి దీవెన లేదు,పెద్ద చదువులు చదివే పిల్లల ఫీజులు తల్లిదండ్రులు కట్టలేక చాలా ఇబ్బందులు పడుతున్నారని,ఎన్నికల సమయంలో 50 సంవత్సరాలు దాటిన బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీలకు పెన్షన్ ఇస్తానని ఈరోజుకు ఇవ్వలేదని మండిపడ్డారు. ఫ్రీ బస్సు పథకాన్ని అన్ని రాష్ట్రాలు అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే అమలు చేశాయని, రాష్ట్రంలో మాత్రం కమిటీల పేరుతో కాలం వెళ్లబుచ్చుతున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చి 7నెలలైనా ఏ ఒక్క ఆడబిడ్డకు పెళ్లి కానుక అందలేదని, 19 నుంచి 59 సంవత్సరాల మహిళలకు మహాశక్తి పథకం కింద నెలకి 1500 చొప్పున సంవత్సరానికి 18000 ఇస్తానని ఎన్నికల హామీల్లో ఊదరగొట్టారని, బ్జడెట్లో దానికోసం ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా మహిళలను మోసగిస్తున్న మోసపూరిత ప్రభుత్వంగా ఈ కూటమి ప్రభుత్వం నిలిచిందని ఎద్దేవా చేసారు. మహిళా ద్రోహి ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు నిలిచారని,జగన్మోహన్ రెడ్డి ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు గంజాయిని ఉక్కుపాదంతో అణిచివేసారని, అలాంటి వ్యవస్థను ఏర్పాటు చేసి గంజాయిని అరికట్టాలని, విచ్చలవిడిగా ఏర్పాటుచేసిన బెల్ షాప్స్ తక్షణమే తొలగించాలని వరుదు కళ్యాణి ప్రకటనలో డిమాండ్ చేసారు.

# వ్యాపారం

## పోస్టాఫీసులో అదిరిపోయే స్కీమ్..

### ఇందులో ఇన్వెస్ట్ చేస్తే రెట్టింపు ఆదాయం



ప్రస్తుతం సంపాదించేందుకు రకరకాల పథకాలు అందుబాటులో ఉన్నాయి. తరచుగా ప్రజలు అలాంటి పథకాల కోసం చూస్తున్నారు. ఇది వారికి భారీ లాభాలను ఇస్తుంది. ఎటువంటి రిస్క్ ఉండదు. మీ పెట్టుబడిని రెట్టింపు చేసే అటువంటి పథకం తెలుసుకుందాం. ప్రభుత్వ పథకం కావడంతో ఇందులో ఎలాంటి ప్రమాదం ఉండదు. ఈ పథకం పోస్టాఫీసులో అందుబాటులో ఉంది. పోస్టాఫీసు ఈ పథకం మీకు హామీతో కూడిన రాబడిని అందిస్తుంది. పోస్టాఫీసు ఈ పథకంలో డబ్బు రెట్టింపు గ్యారంటీ ఉంటుంది. కిసాన్ వికాస్ పత్ర పథకం ప్రస్తుతం 7.5% చొప్పున వార్షిక వడ్డీని అందిస్తోంది. కిసాన్ వికాస్ పత్ర అనేది భారత ప్రభుత్వంచే నిర్వహించబడే మొత్తం పెట్టుబడి పథకం. ఈ పథకంలో మీరు మీ డబ్బును నిర్ణీత వ్యవధిలో రెట్టింపు చేసుకోవచ్చు. మీరు ఈ పథకంలో పోస్టాఫీసు లేదా పెద్ద బ్యాంకుల ద్వారా పెట్టుబడి పెట్టవచ్చు. డబ్బు రెట్టింపు కావడానికి ఎంత సమయం పడుతుంది? పోస్టాఫీస్ కిసాన్ వికాస్ పత్ర యోజన (కెవిపి) కింద కనీస పెట్టుబడి రూ. 1000. అయితే, మీరు ఎక్కువ పెట్టుబడి పెట్టాలనుకుంటే మీకు కావలసినంత డబ్బు పెట్టుబడి పెట్టవచ్చు. ఈ పథకం సంవత్సరానికి 7.5 శాతం చొప్పున రాబడిని ఇస్తుంది. గత సంవత్సరం ఏప్రిల్ 2023 లో దాని వడ్డీ రేట్లు 7.2 శాతం నుండి 7.5 శాతానికి పెరిగింది. ఇంతకుముందు ఈ పథకంలో డబ్బు రెట్టింపు కావడానికి 120 నెలలు పట్టేది. కానీ ఇప్పుడు డబ్బు 115 నెలల్లో అంటే 9 సంవత్సరాల ఏడు నెలలలో రెట్టింపు అవుతుంది. రూ.5 లక్షలు ఇన్వెస్ట్ చేస్తే రూ.10 లక్షల మీరు ఈ పథకంలో రూ. 5 లక్షలు పెట్టుబడి పెడితే సంవత్సరానికి 7.5 శాతం చొప్పున రిటర్న్‌లు వస్తాయి. ఈ లెక్కన డబ్బు రెట్టింపు కావాలంటే 115 నెలలు ఆగాల్సిందే. అంటే 9 సంవత్సరాల 7 నెలల్లో మీ డబ్బు రెట్టింపు అవుతుంది. మీరు ఏకమొత్తంలో రూ. 6 లక్షలు పెట్టుబడి పెడితే, ఈ కాలంలో ఈ మొత్తం రూ. 12 లక్షలు అవుతుంది. మీరు ఈ పథకం కింద ఖాతాను తెరవాలనుకుంటే, మీరు కిసాన్ వికాస్ పత్ర ఖాతాను సింగిల్, జాయింట్ ఖాతాను తెరవవచ్చు. పోస్టాఫీసు ఈ పథకం కింద ముగ్గురు వ్యక్తులు ఉమ్మడి ఖాతాను తెరవవచ్చు. అయితే, ఈ పథకం కింద నామినీని జోడించడం తప్పనిసరి. మీకు కావాలంటే మీరు 2 సంవత్సరాల 6 నెలల తర్వాత ఈ ఖాతాను మూసివేయవచ్చు.

## వీటిని సాగు చేస్తే.. నెలల్లోనే లక్షాధికారి కావొచ్చు..



వాణిజ్య పంటల ద్వారా భారీ ఆర్జించవచ్చని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు పొందొచ్చు. అలాంటి వాటిలో ఏలకుల సాగు ఒకటి. ప్రతీ వంటింట్లో కచ్చితంగా ఉండే వస్తువుల్లో ఏలకులు మొదటి స్థానంలో ఉంటాయి. వీటిలోని ఎన్నో ఔషధ గుణాలు ఆరోగ్యాన్ని మేలు చేస్తే, దీని వాసన ఆహారానికి మంచి సువాసనను తీసుకొస్తుంది. అనునిత్యం డిమాండ్ ఉంటే వీటిని సాగు చేస్తే భారీగా లాభాలు ఆర్జించవచ్చు. ఇంతకీ ఏలకులను ఎలా సాగు చేయాలి.? వీటి ద్వారా ఎలాంటి లాభాలు పొందొచ్చు.? ఇప్పుడు తెలుసుకుందాం. సాధారణంగా ఏలకుల్లో రెండు రకాలు ఉంటాయి. ఒకటి ఆకుపచ్చ రెండోది గోధుల ఏలకులు. మనం ఎక్కువగా గోధుమ ఎలకులను ఉపయోగిస్తుంటాం. ఇక ఏలకుల మొక్క 1 నుంచి 2 అడుగుల పొడవు పెరుగుతుంది. ఈ మొక్క యొక్క కాండం 1 నుంచి 2 మీటర్ల పొడవు ఉంటుంది. ఏలకుల మొక్క క ఆకులు 30 నుంచి 60 సెం.మీ పొడవు, వెడల్పు 5 నుంచి 9 సెం.మీ వరకు ఉంటుంది. ఏలకు సాగుకు ఎర్రమట్టి నేల మంచిదని చెబుతుంటారు. ఇందకు భూమి పీహెచ్ విలువ 5 నుంచి 7.5 వరకు ఉండాలి. అలాగే సాగుకు 10ళీ నుంచి 35ళీ%జ% ఉష్ణోగ్రత అవసరం ఉంటుంది. ఏలకుల మొక్కలను 2 నుంచి 3 అడుగుల దూరంలో నాటాలి. ఇక ఏలకులు చేతికి వచ్చాక చాలా రోజుల పాటు ఎండలో ఆరబెట్టాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం ఇందుకు ప్రత్యేక యంత్రాలు కూడా అందుబాటులోకి వచ్చాయి. వీటి సహాయంతో వేడి ఉష్ణోగ్రత వద్ద 18 నుంచి 24 గంటలు ఎండబెడితే సరిపోతుంది. వీటిని నాటడానికి జులై నెల సరైన సమయంగా చెప్పొచ్చు. ఏలకుల మొక్కలకు ఎండ ఎక్కువగా తగలకుండా చూసుకోవాలి. ఇక లాభాల విషయానికొస్తే సాగు సరిగ్గా వస్తే లక్షలు ఆర్జించవచ్చు. ముఖ్యంగా ఏలకుల ధర వాటి పరిమాణంపై ఆధారపడి ఉంటుంది. మంచి పరిమాణంలో ఉంటే ఎక్కువ ధర పలుకుతుంది. సాధారణంగా మార్కెట్లో కిలో ఏలకుల ధర రూ. 1100 నుంచి రూ. 2000 వరకు ఉంటుంది. సుమారు రెండు ఎకరాల్లో ఏలకుల మొక్కలను నాటితే ఏకంగా 135 నుంచి 150 కిలోల వరకు ఏలకుల సాగు లభిస్తుంది. దీంతో కనీసం రూ. 3 లక్షల ఆధాయం పొందొచ్చు.

## ఉపయోగంలో లేని క్రెడిట్ కార్డ్‌ను ఎలా క్లోజ్ చేయాలో తెలుసా..?

ప్రస్తుతం క్రెడిట్ కార్డుల వినియోగం భారీగా పెరిగిపోయింది. ఒకప్పుడు క్రెడిట్ కార్డులను ఇవ్వడానికి ఎన్నో రకాల అంశాలను పరిగణలోకి తీసుకున్న బ్యాంకులు ప్రస్తుతం మాత్రం పెరిగిన పోటీ నేపథ్యంలో క్రెడిట్ కార్డులను సులభంగా ఇస్తున్నాయి. ముఖ్యంగా ప్రైవేట్ బ్యాంకులు రకరకాల ఆఫర్లతో కూడిన క్రెడిట్ కార్డులను ఇస్తున్నాయి. దీంతో అవసరానికి మించి క్రెడిట్ కార్డులను ఉపయోగిస్తున్న వారి సంఖ్య సైతం పెరుగుతోంది. అయితే ఒకానొక సందర్భంగా నిరుపయోగంగా ఉన్న కార్డులను తొలగించుకోవాలనే ఆలోచన మనకు వస్తుంది. మరి అలాంటి సమయాల్లో కార్డును ఎలా క్లోజ్ చేయాలి.? ఇందుకోసం ఎలాంటి విధానాన్ని పాటించాలి.? లాంటి పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం. ఆన్‌లైన్ సైట్స్‌లో క్రెడిట్ కార్డులతో భారీ ఆఫర్లు ప్రకటిస్తున్న నేపథ్యంలో చాలా మంది క్రెడిట్ కార్డులను తీసుకుంటున్నారు. అయితే ప్రతీ ఏటా క్రెడిట్ కార్డ్ చార్జీ చెల్లించడంలో మాత్రం ఇబ్బందిగా మారుతుంది. అందుకే అవసరం లేని కార్డులను క్లోజ్ చేయాలనుకుంటారు. మీ క్రెడిట్ కార్డును ఒకవేళ క్లోజ్ చేయాలనుకుంటే ముందుగా మీ బ్యాంక్ కస్టమర్ కేర్‌కు కాల్ చేయాలి. అనంతరం క్రెడిట్ కార్డును క్లోజ్ చేయాలని అనుకుంటున్నట్లు కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్‌కు తెలియజేయాలి. కార్డ్ క్లోజ్ చేయడానికి గల కారణం ఏంటన్న ప్రశ్నకు బదులు ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకోసం మీ మెయిల్ ఐడీ, పుట్టిన తేదీ వంటి వివరాలను అడుగుతారు. ఇక ఆన్‌లైన్‌లో కూడా కార్డ్‌ను క్లోజ్ చేసుకోవచ్చు. ఇందుకోసం క్రెడిట్ విభాగానికి సంబంధించిన వెడ్‌సైట్‌లోకి వెళ్లి సంబంధిత లింక్ ఓపెన్ చేయడం ద్వారా కార్డ్‌ను క్లోజ్ చేసుకోవచ్చు. అయితే మీ కార్డును క్లోజ్ చేయాలనుకునే ముందు కొన్ని విషయాలు గమనించాలి. ముందుగా మీ కార్డ్‌పై ఏమైనా డ్యూ ఉంటే వెంటనే చెల్లించాలి. ఒకవేళ చెల్లించకుండా కార్డును క్లోజ్ చేస్తే సిబిల్ స్కోర్‌పై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా వడ్డీ కూడా పడుతుంది. ఇక రీడిమ్ పాయింట్స్ ఏమైనా ఉన్నాయా చూసుకొని వాటిని ఉపయోగించుకోవాలి. ఇక మీ క్రెడిట్ కార్డ్‌పై ఏవైనా ఈఎమ్ఐ పేమెంట్స్, ఆటో డెబిట్ ఉన్నాయా చూసుకొని వాటిని క్లోజ్ చేయాలి.

# ఆల్‌టైమ్ రికార్డుకు బంగారం ధర..

బంగారం అంటేనే వామ్మో అని పరిస్థితి నెలకొంది. రోజురోజుకీ పెరుగుతోన్న బంగారం ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. దేశంలో అన్ని నగరాల్లో బంగారం ధరలు జెట్ స్పీడ్‌తో దూసుకుపోతున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా శుక్రవారం బంగారం ధరలు ఆల్‌టైమ్ రికార్డు ధరలకు చేరుకున్నాయి. 12వ తేదీన 10 గ్రాముల బంగారంపై ఏకంగా రూ. 1090కి చేరింది. దీంతో పది గ్రాముల బంగారం ధర ఏకంగా రూ. 73,310కి చేరింది. ఇదిలా ఉంటే ద్రవ్యోల్బణం, అంతర్జాతీయ ధరలలో మార్పు, సెంట్రల్ బ్యాంక్ గోల్డ్ రిజర్వ్, వడ్డీ రేట్లు ఇలా రకరకాల కారణాలతో బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. రానున్న రోజుల్లో బంగారం ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదే జోరు కొనసాగితే తులం లక్ష దాటడం ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవతున్నాయి.



తాజాగా తెలుగు రాష్ట్రాల్లో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 67,200గా ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1090 పెరిగి ప్రస్తుతం రూ. 73,310 వద్ద కొనసాగుతోంది. ఇక దేశంలోని పలు ప్రధాన నగరాల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయో ఇప్పుడు చూద్దాం.. దేశ రాజధాని న్యూఢిల్లీలో శుక్రవారం 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1000 పెరిగి రూ. 67,200 వద్ద కొనసాగుతోంది. అలాగే 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1090 పెరిగి రూ. 73,460గా ఉంది. చెన్నైలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 800 పెరిగి అత్యధికంగా రూ. 68,050గా ఉండగా, 24 క్యారెట్ల గోల్డ్‌పై రూ. 880 పెరిగి రూ. 74,240 వద్ద కొనసాగుతోంది. ఇక బెంగళూరు విషయానికొస్తే ఇక్కడ 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1000 పెరిగి రూ. 67,200 వద్ద కొనసాగుతుండగా, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 73,310 వద్ద కొనసాగుతోంది. దేశ ఆర్థిక రాజధాని ముంబయిలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారంపై రూ. 1000 పెరిగి రూ. 67,200 వద్ద కొనసాగుతోంది. ఇక 24 క్యారెట్ల గోల్డ్ విషయానికొస్తే రూ. 73,310 వద్ద కొనసాగుతోంది.

# చదివింది 8వ తరగతే.. కానీ సంపాదన మాత్రం రూ.10 వేల కోట్లు..

దేశంలో చాలా మంది పేరుమోసిన వ్యాపారవేత్తలు ఉన్నారు. అనేక మంది కనీసం పాఠశాల విద్యను కూడా పూర్తి చేయలేని వారు కూడా ఈ రోజుల్లో కోట్లాది రూపాయలకు యజమానులుగా ఉన్నారు. పెద్దగా చదువుకోని వారు కూడా వ్యాపార రంగంలో రాణిస్తూ ఉన్నత శిఖరాలకు ఎదుగుతున్నారు. అటువంటి వారు నేడు బిలియన్ల విలువైన కంపెనీలకు యజమానులుగా ఉన్నారు. దేశంలోని విజయవంతమైన వ్యాపారవేత్త శివ రతన్ అగర్వాల్. ఈ రోజు 72 సంవత్సరాల వయస్సులో రూ. 13,430 కోట్ల విలువైన కంపెనీకి యజమాని. ఇటీవల అతను ఫోర్బ్స్ వరల్డ్ బిలియనీర్ లిస్ట్ 2024లో కూడా చేరారు. శివ రతన్ అగర్వాల్ బికాజీ ఫుడ్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు. అలాగే ఛైర్మన్. 8వ తరగతి వరకే చదివి మానేశాడు. శివరతన్ సంస్థ నేడు చిరుధాన్యాల మార్కెట్‌లో పెప్సీకో, ఫ్రిటో-లే వంటి పెద్ద కంపెనీలతో పోటీ పడుతున్నారు. అతను భారతదేశంలోని ప్రతి ఇంటికి బికాజీ నమ్‌కీన్‌ను ఎలా తీసుకువచ్చాడో తెలుసుకుందాం. బికాజీ కథ 80 సంవత్సరాల క్రితం 1940 సంవత్సరంలో రాజస్థాన్‌లోని బికనీర్ నగరంలో ఒక చిన్న కొలిమిలో భుజియాను తయారు చేయడం ద్వారా ప్రారంభమైంది. అతని దుకాణం పేరు అంతకుముందు 'హల్దీరామ్ భుజివాలా', దీనిని గంగాభీషన్ 'హల్దీరామ్' అగర్వాల్ ప్రారంభించారు. మొదట్లో ఇది చిన్న దుకాణం. అదే దుకాణంలో భుజియా తయారు చేసి విక్రయించారు. హల్దీరామ్ స్వయంగా తన చేతులతో భుజియాను తయారు చేసేవాడు. అతని దుకాణం క్రమంగా నగరం అంతటా ప్రసిద్ధి చెందింది. ఆ తర్వాత నగరాలు, రాష్ట్రాలకు విస్తరించింది. హల్దీరామ్ తర్వాత కోల్‌కతా వెళ్లి అక్కడ స్థిరపడ్డాడు. శివరతన్ అగర్వాల్ 'హల్దీరామ్' భుజివాలా మనవడు. అతని తండ్రి మూల్‌చంద్ కూడా రాజస్థాన్‌లో భుజియా తయారీ వ్యాపారం చేసేవాడు. 8వ తరగతి పాసయ్యాక చదువుపై ఆసక్తి లేకపోవడంతో చదువు మానేసి తండ్రితో కలిసి భుజియా తయారీలో పని చేశాడు. శివరతన్ బికాజీకి పునాది వేశాడు హల్దీరామ్ తర్వాత 'హల్దీరామ్ భుజివాలా' వ్యాపారం అతని కొడుకు మూల్‌చంద్ అగర్వాల్‌కి చేరింది. మూల్‌చంద్ అగర్వాల్‌కు శివకిసన్ అగర్వాల్, మనోహర్ లాల్ అగర్వాల్, మధు అగర్వాల్, శివరతన్ అగర్వాల్ అనే నలుగురు కుమారులు ఉన్నారు. శివకిసన్, మనోహర్‌లాల్, మధు కలిసి భుజియా కొత్త బ్రాండ్‌ను ప్రారంభించారు. దానికి వారి తాత




పేరు 'హల్దీరామ్' అని పేరు పెట్టారు. కానీ ముగ్గురు సోదరులతో కలిసి వ్యాపారం చేయకుండా, నాల్గవ కుమారుడు శివరతన్ అగర్వాల్ 1980లో కొత్త బ్రాండ్‌ను ప్రారంభించాడు. దానికి బికాజీ అని పేరు పెట్టాడు. నికర విలువ రూ. 10,000 కోట్ల కంటే ఎక్కువ శివరతన్ అగర్వాల్ బికాజీ బ్రాండ్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్. అతని కంపెనీ భుజియా, నమ్కీన్, క్యాన్డ్ స్వీట్లు, పాపడ్, అనేక ఇతర ఉత్పత్తులను తయారు చేస్తుంది. బికాజీ భారతదేశపు మూడవ అతిపెద్ద సాంప్రదాయ స్నాక్స్ తయారీదారు. బికాజీ 1992లో నేషనల్ అవార్డ్ ఫర్ ఇండస్ట్రియల్‌ఎక్సలెన్స్‌తో సత్కారం అందుకున్నాడు.నేడు బికాజీ 250కి పైగా ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. బికాజీ ఉత్పత్తులను విదేశాలకు కూడా పంపుతారు. వారి ఉత్పత్తులలో పాశ్చాత్య స్నాక్స్, ఇతర ప్రోడక్ట్‌లు కూడా ఉన్నాయి. నేడు బికాజీ ఉత్పత్తులు దేశవ్యాప్తంగా 8లక్షల కంటే ఎక్కువ దుకాణాలలో అందుబాటులో ఉన్నాయి.నివేదిక ప్రకారంశివరతన్ అగర్వాల్ నికర విలువ దాదాపు రూ.10,830 కోట్లు.

## ఈ-బైక్ బ్యాటరీ టెన్షన్లన్నింటికీ చెక్.. ఏకంగా 8లక్షల కి.మీ. వరకూ వారంటీ..



మన దేశంలో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలకు డిమాండ్ బాగా ఉంది. ముఖ్యంగా ఎలక్ట్రిక్ స్కూటర్లను వినియోగదారులు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. అయితే ఎలక్ట్రిక్ బైక్ లు అదే తరహాలో విక్రయాలు పెంచేలా కంపెనీలు కసరత్తు చేస్తున్నాయి. అందులో భాగంగా గ్లోబల్ ఈవీ కంపెనీ అయిన అల్ట్రావయోలెట్ ఆటోమోటివ్ ఓ అద్భుతమైన ఆఫర్ ప్రకటించింది. తన ఫ్లాగ్ షిప్ అయిన ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్ అయిన ఎఫ్77 బ్యాటరీపై ఈ ఆఫర్ అందిస్తోంది. 8లక్షల కిలోమీటర్ల వరకూ డ్రైవ్ ట్రెయిన్ వారంటీని పొడిగించినట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈ ఆఫర్‌కు సంబంధించిన పూర్తి వివరాలతో పాటు ఎఫ్77 ఎలక్ట్రిక్ బైక్ కు సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం.. ఆఫర్ ఇది.. అల్ట్రావయోలెట్ ఆటోమోటివ్ నుంచి వచ్చిన ఎఫ్77 బైక్‌పై మంచి ఆఫర్ అందుబాటులో ఉంది. ఈ బైక్ లోని బ్యాటరీపై అదనపు వారంటీని కంపెనీ ప్రకటించింది. ఏకంగా 8లక్షల కిలోమీటర్ల వరకూ బ్యాటరీకి వారంటీ ఉంటుంది. ఈ కొత్త వారంటీలో మూడు ప్యాకేజీలు ఉన్నాయి. యూవీ కేర్, యూవీ కేర్ ప్లస్, యూవీ కేర్ మ్యాక్స్. యూవీ కేర్, యూవీ కేర్ ప్లస్ ప్యాకేజీలో రెండింతలు కిలోమీటర్ల కాగా.. యూవీ కేర్ మ్యాక్స్ లో ఎనిమిది రెట్లు అధిక కిలోమీటర్ల పరిధిని అందిస్తుంది. ఈ సందర్భంగా అల్ట్రావయోలెట్ సీటీఓ, సహ వ్యవస్థాపకుడు నీరజ్ రాజ్ మోహన్ మాట్లాడుతూ బ్యాటరీ, డ్రైవ్‌ట్రెయిన్ కొత్త వారంటీ స్ట్రక్చర్ బ్యాటరీ ఇంజనీరింగ్‌లో కఠినమైన ప్రయత్నాల ద్వారా అందించామన్నారు. ఇందులో ఐదు స్థాయిల భద్రత, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న బ్యాటరీ సాంకేతికతతో సహా కచ్చితమైన ధ్రువీకరణ ప్రక్రియలు ఉన్నాయన్నారు. ఎఫ్77 టెస్ట్ మోటార్‌సైకిళ్లలో ఒకటి ఇటీవలే 100,000 కిలోమీటర్లను అధిగమించింది. దాని అసలు రేటింగ్ సామర్థ్యంలో 95 శాతానికి పైగా నిలుపుకుంది. ఇటీవలి పరీక్ష తర్వాత, ఇదే మోటార్‌సైకిల్ అసాధారణమైన ఐడీసీ (ఇండియన్ డ్రైవింగ్ సైకిల్) శ్రేణిని ప్రదర్శించింది, కంపెనీ ప్రకారం దాదాపు రూ. 441,000 విలువైన ఇంధన ఆదాతో పాటు సింగ్ చార్జ్ పై 304 కిలోమీటర్ల పరిధిని అందించింది. అల్ట్రావయోలెట్ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు నారాయణ్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా తాము బ్యాటరీ సాంకేతికత, ప్రమాణాలపై కృషి చేసి, గణనీయంగా అభివృద్ధి సాధించామన్నారు. ఈ కొత్త ఆఫర్‌తో ఎఫ్77 కేవలం వేగంగా, సామర్థ్యాన్ని కలిగి ఉండటమే కాకుండా సొంతం చేసుకునేందుకు భరోసానిస్తుందని అన్నారు. అల్ట్రావయోలెట్ (యూవీ) అనేది భవిష్యత్తులో ఎలక్ట్రిక్ వాహనాల ప్లాట్‌ఫారమ్‌లు, బ్యాటరీ టెక్నాలజీలో ఒక కొత్త ట్రెండ్ సృష్టిస్తుందని ఆయన పేర్కొన్నారు. కాగా ఈ అల్ట్రావయోలెట్ కంపెనీకి ఎక్సోర్ ఎన్వీ లింగొట్టో, క్వాల్కమ్ వెంచర్స్, జోహో కార్పొరేషన్, టీవీఎస్ మోటార్ వంటి ప్రపంచ స్థాయి కంపెనీల మద్దతు ఉంది.

## కొత్త, పాత పన్ను విధానాల్లో ఏది బెటర్..? పన్ను చెల్లింపుదారులకు మేలు కలిగించే నియమాలివే..!

అసెస్‌మెంట్ ఇయర్ 2024-25 (లేదా ఎఫ్‌వై 2023-24) ఆదాయపు పన్ను రిటర్న్‌ల (ఐటీఆర్) ఆన్‌లైన్ ఫైలింగ్ ఐటీఆర్-1, ఐటీఆర్-2 కోసం ఈ-ఫైలింగ్ ఫారమ్‌లను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఐటీఆర్ ఫైల్ చేస్తున్నప్పుడు పన్ను చెల్లింపుదారులు కొత్త పన్ను విధానం, పాత పన్ను విధానం మధ్య ఆదాయపు పన్ను విధానాన్ని ఎంచుకోవాలి. పన్ను రేట్లు, ప్రయోజనాలు రెండు విధానాల్లో భిన్నంగా ఉంటాయి. విధానాలతో పాటు వాటి పన్ను రేట్లు, ఎవరు ఏమి ఎంచుకోవాలి అనే పూర్తి వివరాలను తెలుసుకుందాం. 2023 బడ్జెట్‌లో కొత్త పన్ను విధానంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రూ. 50,000 నుండి రూ. 3 లక్షలకు పెంచారు. ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 87 ఏ కింద రాయితీని కూడా రూ. 5 లక్షల నుంచి రూ. 7 లక్షలకు పెంచారు. రూ. 7 లక్షల వరకు సంపాదిస్తున్న వారు కొత్త పన్ను విధానంలో ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. ఇది కాకుండా ఆదాయపు పన్నుపై 4 శాతం ఆరోగ్య, విద్య సెస్ విధిస్తారు. అయితే పన్ను చెల్లింపుదారులు పాత పన్ను విధానాన్ని లేదా కొత్త పన్ను విధానాన్ని ఎంచుకునే అవకాశం ఉన్నా డిఫాల్ట్ పథకంగా కొత్త పన్ను విధానంగా ఉంటుంది. కొత్త పన్ను విధానంలో నివాసి వ్యక్తి (నికర ఆదాయం రూ. 7 లక్షలకు మించని వ్యక్తి) సెక్షన్ 87ఏ కింద రాయితీని పొందవచ్చు. రాయితీ మొత్తం ఆదాయపు పన్నులో 100 శాతం లేదా రూ. 25,000, ఏది తక్కువైతే అది. పాత పన్ను విధానంలో నివాసి వ్యక్తిగత పన్ను చెల్లింపుదారు (నికర ఆదాయం రూ. 5 లక్షల వరకు ఉంటుంది) సెక్షన్ 87ఏ కింద రాయితీని పొందవచ్చు. రాయితీ మొత్తం ఆదాయపు పన్నులో 100 శాతం లేదా రూ. 12,500, ఏది తక్కువైతే అది. ఏ పన్ను విధానం బెటర్.? ఆదాయపు పన్ను నిపుణుల అభిప్రాయం ప్రకారం, మీకు పొదుపులు, పెట్టుబడులు, మినహాయింపులు లేకుంటే కొత్త పన్ను విధానం ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే మీరు పొదుపులు, పెట్టుబడులు, తగ్గింపులను ఉపయోగించినట్లయితే పాత పన్ను విధానం ఆకర్షణీయంగా ఉంటుంది. కొత్త పన్ను విధానం తక్కువ పన్ను రేట్లను అందిస్తుంది కానీ పాత పాలనలో అందుబాటులో ఉన్న అనేక మినహాయింపులు, తగ్గింపులను తొలగిస్తుంది. మరోవైపు పాత పన్ను విధానం అధిక పన్ను రేట్లను కలిగి ఉంది కానీ తగ్గింపులు, మినహాయింపులను అనుమతిస్తుంది. ఒక నిర్ణయం తీసుకునే ముందు మీ పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం, తగ్గింపులు, మినహాయింపులతో సహా మీ వ్యక్తిగత ఆర్థిక పరిస్థితులను అంచనా వేయాలని సిఫార్సు చేయబడింది. అదనంగా మీకు ఏ పన్ను విధానం మరింత ప్రయోజనకరంగా ఉంటుందో నిర్ణయించడంలో సహాయపడటానికి మీరు పన్ను నిపుణులను సంప్రదించవచ్చు. అంతిమంగా కొత్త పన్ను విధానం, పాత పన్ను విధానం మధ్య ఎంపిక మీ వ్యక్తిగత ఆర్థిక పరిస్థితి మరియు పన్ను బాధ్యతలపై ఆధారపడి ఉంటుందని నిపుణులు వివరిస్తున్నారు. అయితే స్థూలంగా రూ. 7 లక్షల వరకు ఆదాయం ఉన్నవారు నేరుగా కొత్త పన్ను విధానంలోకి వెళ్తే ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదని పేర్కొంటున్నారు.




# చందన

# ఆమె నదిని దాటించింది



కింద గాఢంగా పారే చీనాబ్ నది. పైన 359 మీటర్ల ఎత్తులో రైలు బ్రిడ్జి. కశ్మీర్ లోయలో ఉధమ్‌పూర్ నుంచి బారాముల్లా వరకు వేయదలచిన భారీ రైలు మార్గంలో చీనాబ్‌ను దాటడం ఒక సవాలు. దాని కోసం సాగిన ఆర్చ్ బ్రిడ్జి నిర్మాణంలో మన తెలుగు ఇంజినీర్ మాధవీ లత కృషి కీలకం. 'వరల్డ్ హైయ్యస్ట్ రైల్వే బ్రిడ్జి' నిర్మాణంలో పాల్గొన్న మాధవీ లత పరిచయం. ఒక సుదీర్ఘకల నెరవేరబోతోంది. సుదీర్ఘ నిర్మాణం ఫలవంతం కాబోతూ ఉంది. దేశ అభివృద్ధిలో కీలకమైన రవాణా రంగంలో ఎన్ని ఘన నిర్మాణాలు సాగితే అంత ముందుకు పోతాము. అటువంటి ఘన నిర్మాణం జాతికి అందుబాటులో రానుంది. జమ్ము కశ్మీర్‌లో ప్రపంచంలోనే అతి ఎత్తయిన రైల్వేవంతెన ట్రయల్ రన్ పూర్తి చేసుకుని త్వరలోనే కార్యకలాపాలు నిర్వహించనుంది. అయితే ఈ క్లిష్టమైన నిర్మాణంలో తెలుగు మహిళా ఇంజినీర్ కీలకపాత్ర పోషించడం ఘనంగా చెప్పుకోవాల్సిన సంగతి. తెనాలికి చెందిన ప్రొఫెసర్ గాలి మాధవీలతదే ఈ ఘనత. చీనాబ్ ఆర్చ్ బ్రిడ్జ్.. భారతీయ రైల్వే 2004లో జమ్ము కశ్మీర్‌లో భారీ రైలు ప్రాజెక్ట్‌కు అంకురార్పణ చేసింది. జమ్ము సమీపంలోని ఉధంపూర్ నుంచి శ్రీనగర్ సమీపంలోని బారాముల్లా వరకు రైలు మార్గం నిర్మించడం ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. ఈ మార్గంలో రీసీ జిల్లా బాక్కల్ దగ్గర చీనాబ్ నదిపై వంతెన నిర్మించాల్సి వచ్చింది. ఇది చాలా క్లిష్టమైన నిర్మాణం. ఎందుకంటే ఇది ఐఫిల్ టవర్ కంటే 35 మీటర్ల ఎత్తు వంతెన అవుతుంది. అయినప్పటికీ మన ఇంజినీర్లు దశల వారీగా నిర్మాణం పూర్తి చేయగలిగారు. జూలైలో దీని కార్యకలాపాలు పూర్తిస్థాయిలో మొదలవుతాయి. ప్రొఫెసర్‌గా పని చేస్తూ... ప్రకాశం జిల్లా ఏడుగుండ్లపాడుకు చెందిన మాధవీలత కాకినాడలో ఇంజినీరింగ్ చేశారు. ఐ.ఐ.టి. మద్రాస్‌లో పీహెచ్‌డీ చేశారు. బెంగళూరులోని ఐ.ఐ.ఎస్.సి.లో 'రాక్ మెకానిక్స్'లో పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌ను కొనసాగించారు. బెంగళూరులో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ లో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న మాధవీలత అక్కడే సెంటర్ ఫర్ సస్టెయినబుల్ టెక్నాలజీస్ విభాగానికి చైర్‌పర్సన్ గా కూడా ఉంటూ సైన్స్‌ను, టెక్నాలజీని గ్రామీణాభివృద్ధికి చేరువ చేసే ప్రాజెక్టులకు నాయకత్వం వహిస్తున్నారు. అయితే 'రాక్ మెకానిక్స్'లో మాధవీలతకు ఉన్న అనుభవమే ఆమెను చీనాబ్ వంతెన నిర్మాణంలో పాల్గొనేలా చేసింది. చీనాబ్ వంతెన నిర్మాణానికి రూ.1400 కోట్లు వ్యయం చేస్తే 300 మంది సివిల్ ఇంజినీర్లు, 1300 మంది వర్కర్లు రేయింబవళ్లు పని చేశారు. బ్రిడ్జ్‌ను రెండు కొండల మధ్య నిర్మించాల్సి ఉన్నందున ఇంజినీరింగ్ డిజైన్ చాలా క్లిష్టంగా మారింది. అయినప్పటికీ అక్కడి రాళ్లను పరిశోధించి, అధ్యయనం చేసిన మాధవీలత, పటిష్టమైన వాలు స్థిరీకరణ ప్రణాళికను రూపొందించి, అమలును నిరంతరం పర్యవేక్షిస్తూ వచ్చారు. ఆమె విశ్లేషణ, సాంకేతిక సూచనలను దేశంతోపాటు విదేశాల్లోని పలువురు నిపుణులు తనిఖీ చేసి ఆమోదించడంతో వంతెన నిర్మాణం ముందుకు సాగింది. ఈ రైలు మార్గంలో నిర్మించిన కొన్ని సొరంగాల నిర్మాణంలోనూ మాధవీలత పాల్గొన్నారు. అవకాశం ఇలా... ఉధంపూర్ బారాముల్లా కొత్త రైలుమార్గంలో చీనాబ్ నదిపై స్టీల్ ఆర్చ్ వంతెన నిర్మాణ బాధ్యతను కొంకణ్ రైల్వేస్ 'ఆఫ్కాన్స్ ' సంస్థకు ఇచ్చింది. ఆఫ్కాన్స్ సంస్థకు జియో టెక్నికల్ కన్సల్టెంటుగా ఉన్న మాధవీలతకు అలా ప్రాజెక్టులో పనిచేసే అవకాశం లభించింది. 'ప్రాజెక్టు నిర్మాణంలో అనేక సవాళ్లు ఎదురయ్యాయి. చీనాబ్ నదిపై రెండు ఎత్తయిన వాలుకొండలను కలుపుతూ సాగిన ఈ వంతెన నిర్మాణంలో వాలు స్థిరత్వం కీలకమైంది. రాక్ మెకానిక్స్ సాంకేతికత, స్థిరత్వ అంశాలను అర్థం చేసుకోవటం, కొండ వాలుల స్థిరత్వాన్ని పొందటానికి నేను పరిష్కారాలను అందించటంతో ఇప్పుడో ఇంజినీరింగ్ అద్భుతం సాక్షాత్కరించింది. జోన్ భూకంపాలను, గంటకు 266 కి.మీ వేగంతో వీచే గాలులను, తీవ్రమైన పేలుళ్లను తట్టుకునేలా ఈ వంతెన నిర్మితమైంది' అన్నారు మాధవీలత. 'నేల పటిష్టతపై ఐ.ఐ.టి మద్రాస్‌లో నా పీహెచ్‌డీ పరిశోధనల్లో భాగంగా పాలిమర్‌లను ఉపయోగించి పటిష్టమైన రోడ్ల నిర్మాణానికి వినూత్న సాంకేతిక విధానాన్ని రూపొందించాను. ఆ దిశగా మూడు దశాబ్దాలపాటు చేసిన పరిశోధనల ఫలితంగా నేడు భూకంప నిరోధక శక్తి కలిగిన నిర్మాణాల్లో పాలిమర్‌లని, రబ్బర్ టైర్ల వంటి వ్యర్థపదార్థాలని వినియోగించగలుగుతున్నాం' అన్నారు. చీనాబ్ వంతెన నిర్మాణానికి రేయింబవళ్లు శ్రమించిన మాధవీలత, ఈ ప్రాజెక్టు కోసం ఎన్నో వ్యక్తిగత త్యాగాలు చేయాల్సి వచ్చిందని చెప్పారు. తన కుటుంబ ప్రాధాన్యతలను పక్కనపెట్టి, సైట్‌ను సందర్శించిన సందర్భాలను గుర్తు చేసుకుంటూ, 'నా పిల్లల పరీక్షల సమయాల్లో కూడా వాళ్లను వదిలి వెళ్లాల్సి వచ్చేది. నా భర్త హరిప్రసాద్‌రెడ్డి, పిల్లలు అభిజ్ఞ, శౌర్యల సహనం, సహకారాలతో ఇది సాధ్యమైంది. చీనాబ్ వంతెన నా సొంత ప్రాజెక్టులా మారిపోయింది' అన్నారు.



## డీహైడ్రేషన్‌కు చెక్‌పెట్టేవి ఇవే..!

సమ్మర్ ఇలా ప్రారంభమయ్యిందో లేదో అప్పుడే ఎండలు దంచికొడుతున్నాయి. ఓ పక్క జనాలు వడదెబ్బకు తాళ్లలేక పిట్టల్లా రాలిపోతున్నారు. ఈ కాలంలో మండే ఎండలను తట్టుకోవాలంటే అధికంగా నీరు తాగడమే కాక శరీరం డీహైడ్రేషన్‌కి గురికాకుండా ఉండేలా చూసుకోవాలి. కేవలం నీరు, మజ్జిగ రూపంలో ద్రవ పదార్థాలు తీసుకోవడమే కాకుండా వాటర్ కంటెంట్ ఎక్కువగా ఉ?న్న పండు తీసుకోవడం మరింత మేలు. అందుకోసం తీసుకోవాల్సిన పండ్లు ఏంటో సవివరంగా తెలుసుకుందామా..! పుచ్చకాయ.. అధిక వాటర్ కంటెంట్‌కి ప్రసిద్ధ. వేసవిలో దీన్ని తీసుకుంటే దాహం కట్టడుతుంది. వడదెబ్బ నుంచి సులభంగా బయటపడగలుగుతాం. వేసవి తాపం నుంచి మంచి ఉపశమనం కలిగించే ఫ్రూట్ పుచ్చకాయ అని చెప్పొచ్చు. దోసకాయలు.. ఇది ఏకంగా 96% నీటిని కలిగి ఉంటుంది. నీటితో ప్యాక్ చేసిన మంచి ఫ్రూట్‌గా పేర్కొనవచ్చు. కేలరీలు తక్కువగా ఉండటమే గాకుండా కావల్సినన్నీ విటమిన్లు, ఫైబర్లు ఉంటాయి. ఈ దోసకాయని సలాడ్‌రూపంలో లేదా అల్పాహారంగానూ తీసుకోవడం వల్ల మంచి ప్రయోజనం ఉంటుంది. కొబ్బరి నీరు.. ఇది ద్రవాల తోపాటు కోల్పోయిన నీటిని ఎలక్ట్రోలైట్‌లను తిరిగి నింపుతుంది. ఇందులో ఉండే సోడియం, కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి ఎలక్ట్రోలైట్లు కీలకమైన శారీరక విధులకు మద్దతు ఇవ్వడంలో కీలక పాత్ర పోషిస్తాయి. డీహైడ్రేషన్ నుంచి కాపాడటంలో సమర్థవంతంగా ఉంటుంది. టమోటాలు.. వీటిలో కూడా 94% నీటి కంటెంట్ ఉంటుంది. ఫైబర్, కేలరీలు సమృద్ధిగా ఉంటాయి. ఇందులో ఉండే లైకోపిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు రోగ నిరోధక శక్తిని అందించి గుండె ఆరోగ్యాన్ని మెరుగ్గా ఉంచుతాయి. చర్మ ఆరోగ్యంలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులో ఉండే కాల్షియం కంటెంట్ ఎముకల ఆరోగ్యానికి దోహదం చేస్తుంది. బూడిద గుమ్మడికాయ.. ఇందులో 96% నీటి కంటెంట్ ఉంటుంది. పేగు ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. ఆమ్లత్వంతో కూడిన ఫైబర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల పెద్దప్రేగుని నిర్వహించడంలోను జీర్ణ సమస్యలను తగ్గించడంలోనూ సమర్థవంతంగా ఉంటుంది. బెల్ పెప్పర్స్.. క్యాప్సికంనే బెల్ పెప్పర్స్ అని కూడా అంటారు. ఇది వంటకాలకు మంచి రుచిని, వాసనను అందిస్తాయి. విటమిన్ సీ, విటమిన్ బీ6, బీటా కెరోటిన్, థయామిన్, ఫోలిక్ యాసిడ్ వంటి విటమిన్లు ఉంటాయి. స్ట్రాబెర్రీలు.. స్ట్రాబెర్రీల్లో దాదాపు 91% నీటి శాతాన్ని కలిగి ఉంటాయి. దీనిలో విటమిన్ సి, ఫోలేట్, మాంగనీస్‌తో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ఇది కడుపులో మంటను తగ్గించడంలోనూ వివిధ వ్యాధుల నుంచి రక్షించడంలోనూ కీలక పాత్ర పోషిస్తాయి. నారింజలు.. ఇందులో కూడా మంచి నీరు కంటెంట్ ఉంటుంది. విటమిన్ సీ, పొటాషియం, వంటి యాంటి యాక్సిడెట్లు సమృద్ధిగా ఉంటాయి. గుండె ఆరోగ్యం, వాపు తగ్గింపుకు తోడ్పడుతుంది. దీన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే మూత్ర పిండాల్లో రాళ్లను నివారించడంలో సహాయ పడుతుంది. ఇందులో సిట్రిక్‌యాసిడ్ కంటెంట్, ఆర్ద్రీకరణను ప్రోత్సహించే లక్షణాలు కారణంగా డీహైడ్రేన్‌ని నివారించడంలో సమర్థవంతంగా పనిచేస్తుంది.

## గుండె సమస్యలు.. తీసుకోవాల్సిన జాగ్రత్తలు

గుండెకు సంబంధించిన అన్ని విషయాల్లో జాగ్రత్తగా ఉండాలి. ఈ ఎండాకాలంలో ఎండలు గతంలో కంటే ఎక్కువగా ఉంటున్నందున ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. గుండె చాలా సున్నితమైన అవయవం, మానసికంగా కొంచం ఇబ్బందులకు గురి అయినా గుండె చాలా దెబ్బతింటుంది. ఒంటి కాల్చేసే, శరీరంలోని నీటిని మొత్తం పీల్చేసే ఎండల వల్ల బాడీ పూర్తిగా డీహైడ్రేట్ అయిపోతుంది. ఇలాంటప్పుడు గుండెకు సంబంధించి వైద్యులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోమంటున్నారో తెలుసుకుందాం. బ్లడ్ క్లాట్ డీహైడ్రేషన్ శరీరం డీహైడ్రేట్ అయిపోవడం వల్ల రక్తం మరింత చిక్కగా అయిపోయి క్లాట్ అయ్యే అవకాశం ఉందంటున్నారు. అలా డీహైడ్రేషన్‌తో గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటున్నారు. తాజాగా జరిపిన సర్వేల ప్రకారం ప్రతీ సంవత్సరం గుండెపోటు సమస్యలు పెరిగిపోతూనే ఉన్నాయ్. సమ్మర్‌లో ఎండలను లెక్కచేయకుండా క్రీడలు, స్విమ్మింగ్, టూర్లు, బయట ఎక్కువ తిరగడం వల్ల యువకుల్లో కూడా గుండెపోటు వచ్చే అవకాశాలు పెరిగాయని చెబుతున్నారు. వైటమిన్ డి సూర్యుడి నుంచి శరీరానికి కావలసిన వైటమిన్-డి అందుతోంది. కాని ఎక్కువ సూర్యతాపం వల్ల డీహైడ్రేట్ కాకుండా ఉండాలంటే సన్‌స్క్రీన్ లోషన్స్ అప్లై చేసుకోవడం, నీరు నిరంతరంగా తాగుతూ ఉండడం చేస్తుండాలి. వడదెబ్బ తగలకముందే వాటి లక్షణాలను గుర్తించాలి. వడ దెబ్బ తగిలితే శరీరం ఒకవైపు పనిచేయనట్టు అనిపిస్తుంది. కంటి చూపు మందగిస్తుంది, అలసట, వికారంగా ఉంటుంది. మెడ, కండరాళ్ల నొప్పి ఉంటుంది. తలనొప్పి, కోమా, మతిమరుపు లాంటి లక్షణాలు ఉంటాయ్. కూలర్ కొనే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..! వడదెబ్బ లేదా గుండెపోటు రాకుండా ఉండాలంటే.. నీరు లేదా నీరు ఎక్కువగా ఉన్న పుచ్చపండు, కొబ్బరిబోండా, బటర్ మిల్క్ లాంటివి తీసుకోవాలి. మీరు ఒక వేల గుండె, కిడ్నీ, లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్టే అయితే ఈ పళ్లను తినే ముందు వైద్యుడిని తప్పకుండా సంప్రదించాలి.

## మీరు ఎప్పటికీ యవ్వనంగా కనిపించాలంటే, ఈ తప్పులు చేయకండి



ప్రతి వ్యక్తి తన వయస్సు ఎంత పెరిగినా తన చర్మం కనిపించకూడదని కోరుకుంటాడు. ప్రజలు దీని కోసం చాలా ప్రయత్నాలు చేస్తారు మరియు అత్యంత సాధారణమైనవి మేకప్ మరియు రసాయన ఆధారిత సౌందర్య సాధనాలు. అయితే, చర్మం మరియు శరీరాన్ని యవ్వనంగా ఉంచడం చాలా కష్టం కాదు, కొన్ని సాధారణ విషయాలను గుర్తుంచుకోవాలి. అలాగే, రోజువారీ జీవితంలో కొన్ని పొరపాట్లు ఉంటాయి, వాటికి దూరంగా ఉండాలి. కాబట్టి మీ చర్మం యవ్వనంగా ఉండాలంటే ఏ తప్పులు చేయకూడదో ఈరోజు తెలుసుకుందాం. మిమ్మల్ని యవ్వనంగా ఉంచుకోవాలనుకుంటే, మీ చర్మం, మనస్సు మరియు భావోద్వేగాలను జాగ్రత్తగా చూసుకోండి. కానీ మీరు దానిని యవ్వనంగా ఉంచాలనుకుంటే, వీలైనంత ఎక్కువ నీరు త్రాగండి మరియు మీ చర్మాన్ని తేమగా ఉంచుకోండి మరియు ఆరోగ్యంగా ఉండటానికి ప్రయత్నించండి. మీరు మీ శరీరం మరియు చర్మాన్ని ఎంత ఎక్కువ శ్రద్ధ తీసుకుంటే, మీరు ఎక్కువ కాలం యవ్వనంగా ఉండగలరు. ఏప్రిల్ 24 మేషరాశిలో శుక్రుడు ఎంట్రీ ఈ 3 రాశులకు శుక్రదశ ప్రారంభం.. వ్యాపారంలో మంచి లాభాలను పొందుతారు. రోజువారీ జీవితంలో మనం ఇలాంటి ఎనిమిది తప్పులు చేస్తాం, దీని వల్ల మన చర్మం కాలానికి ముందే మసలి లక్షణాలు కనిబడుతాయి. మొబైల్ నుండి దూరం ఉంచండి మరియు దాని స్క్రీన్‌పై అనవసరంగా సమయం గడపకండి. కాబట్టి ఏ తప్పులను నివారించాలో ఇక్కడ తెలుసుకోండి. 1. మేకప్ తొలగించకపోవడం: ఈ రోజుల్లో చాలా మంది మేకప్ వాడుతున్నారు. ఇప్పటి వరకు నేను దానిని ఉపయోగించలేదు. కానీ మీరు మీ పని కారణంగా మేకప్ వేసుకున్నట్లయితే, రాత్రి పడుకునే ముందు మేకప్‌ను సరిగ్గా శుభ్రం చేసుకోండి. ఈ క్లీనింగ్ మేకప్ కంటే రెండు రెట్లు ఎక్కువ సమయం తీసుకోవాలి. 1717 ఇదొక ఏంజెల్ నంబర్:మరి మీ ఏంజెల్ నంబర్ మీకు తెలుసా? దీన్ని బట్టి మీ భవిష్యత్తును అర్థం చేసుకోండి..! 2. చర్మాన్ని శుభ్రం చేయకపోవడం: మీ చర్మాన్ని సరిగ్గా శుభ్రం చేసుకోండి. దీని అర్థం మీరు ఫేస్ వాష్‌తో శుభ్రం చేస్తారని కాదు, ఎక్స్‌ఫోలియేట్ కూడా చేయండి. 3. ముఖం తప్ప మరేదైనా దృష్టి పెట్టవద్దు: ఉగాది పంచాంగం 2024-25: ఈ సంవత్సరం సింహరాశి వారి జాతకం ఏమిటి?ఆదాయం తక్కువ ఖర్చులు ఎక్కువ? మీ మెడ మరియు చేతులను పూర్తిగా శుభ్రం చేసుకోండి.

## ఈ పువ్వులతో మధుమేహానికి చెక్ పెట్టొచ్చు! ఎలాగంటే..?

మధుమేహాన్ని అదుపులో ఉంచే పండ్లు, ఆయుర్వేద మూలికలు, ఆకులు గురించి విన్నాం. కానీ పూలతో



మధుమేహాన్ని నిర్వహించొచ్చు అనే దాని గురించి విన్నారా..?. ఈ పువ్వులు మధుమేహ వ్యాధిగ్రస్తులకు మేలే చేస్తాయట. ఇదేంటి పువ్వులా అనుకోకండి ఎందుకంటే వీటిని పనీర్ పువ్వు లేదా పనీర్ దోడి అని పిలుస్తారు. మధుమేహానికి సంబధించిన గాయాలను నయం చేయడంలో సమర్థవంతంగా పనిచేస్తుందట. డయాబెటిస్ రోగిల పాలిట దీన్ని వరం అని పిలుస్తారు. ఇంతకీ ఏంటి పనీర్ పువ్వులు..? ఎక్కడ లభిస్తాయి తదితరాలు చూద్దామా..! పనీర్ పువ్వును పనీర్ దోడి అని కూడా అంటారు. ఎందుకిలా అంటారంటే..ఈ మొక్క పండ్లు పాలు గడ్డకట్టే లక్షణాల కారణంగా దీన్ని పనీర్‌దోడి అంటారు. ఇది మేజిక్ హీలర్‌గా పనిచస్తుంది. ఇది ఎక్కువగా తూర్పు మధ్యధరా ప్రాంతంలో కనిపిస్తుంద. భారతదేశంలో ఎక్కువగా హర్యాన, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ వంటి పొడి ప్రాంతాల్లో సాధారణంగా కనిపిస్తుంది. ఈ మొక్క గుబురుగా ఉండి, ఇది చిన్న పువ్వులను కలిగి ఉంటుంది. ఈ పూలను ఔషధంగా ఉపయోగిస్తారు. మధుమేహాన్ని నయం చేస్తుంది.. పనీర్ పువ్వు ఓ మూలికలా పనిచేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇది శరీరంలోని ప్యాంక్రియాస్ బీటా కణాలను నయం చేస్తుంది. ప్యాంక్రియాస్ శరీరంలో ఇన్సులిన్ తయారు చేయడానికి పనిచేస్తుంది. బీటా కణాలు దెబ్బతినడం వల్ల ఇన్సులిన్ ఉత్పత్తి ప్రక్రియ మందగిస్తుంది. అటువంటి పరిస్థితిలో పనీర్ పువ్వు బీటా కణాలను నయం చేస్తుంది. నీరు త్రాగిన ఒక గంట తర్వాత మాత్రమే ఆహారం తినండి. రక్తంలో చక్కెర స్థాయి సాధారణంగా ఉంది అనిపించినప్పుడు దీన్ని వినియోగించడం ఆపేయొచ్చు. ఇతర వ్యాధులకు కూడా.. పనీర్ ఫ్లవర్ మధుమేహంతో పాటు అల్జీమర్స్, ఎర్లీ ఫెటీగ్, బ్లడ్ శుద్ధి, ఆస్తమా, నిద్రలేమి, ఊబకాయం, చర్మ సమస్యలు, జలుబు వంటి సమస్యలను కూడా నయం చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. దీనితో పాటు.. ఇది ఫంగల్ ఇన్ఫెక్షన్, వాపు, కాలేయం, గుండె సంబంధిత వ్యాధుల నుంచి కూడా ఉపశమనాన్ని అందిస్తుంది. అంతేగాకుండా కంటి వాపు, పైల్స్, ఉబ్బసం, పంటి సమస్యలు నుంచి బయటపడటంలో సమర్థవంతంగా పనిచేస్తుంది. దుష్ప్రభావాలు.. దీని వినియోగం వల్ల ఎలాంటి దుష్పరిణామాలు వాటిల్లినిట్లు నిర్ధారణ కాలేదు. కానీ ఇది అన్ని రకాల ఆరోగ్య సమస్యలకు మంచి ఔషధంలా పనిచేస్తుంది. కాకపోతే దీన్ని బాలింతలు, గర్భిణి స్త్రీలు, చిన్నారు, వృద్ధులు దీన్ని తీసుకోకపోవటమే మంచిదని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. గమనిక: ఈ కథనం కేవలం అవగాహన కోసం మాత్రమే ఇచ్చాం. దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలనుకుంటే వ్యక్తిగత వైద్యులు, నిపుణుల సలహాల సూచనల మేరకు పాటించటం ఉత్తమం.

## నేను సాధించగలను అనే పట్టుదల ఉన్న వారికి ఏ ఫీల్డ్ అయినా ఒకటే



ఫీల్డ్ మారడం అనేది మంచి నీళ్లు తాగినంత సులభం కాదు.కాస్త అటూ ఇటూ అయితే మూడు చెరువుల నీళ్లు తాగాల్సి ఉంటుంది.'నేను సాధించగలను' అనే పట్టుదల ఉన్న వారికి మాత్రం ఏ ఫీల్డ్ అయినా ఒకటే. అలాంటి ప్రతిభావంతులలో తేజ ఒకరు. ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్‌గా పనిచేసిన తేజ ఐటీ రంగంలోకి అడుగుపెట్టి టెక్ లీడర్‌గా మంచి పేరు సంపాదించింది. కర్ణాటకలోని బెల్గాంలో పెరిగిన తేజ మనకమె డాక్టర్ అయిన తండ్రి నుంచి విజ్ఞానప్రపంచానికి సంబంధించిన ఎన్నో విషయాలు తెలుసుకునేది. డిఐవై (డూ ఇట్ యువర్ సెల్ఫ్) పాజెక్ట్స్ చేసేది. కర్ణాటక యూనివర్శిటీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ కోర్సు చేసింది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ తొలిసారిగా నాన్ మెడికల్ ఏరియాలలో మహిళల కోసం ద్వారాలు తెరుస్తున్న సమయం అది. తన సీనియర్స్ ఎయిర్ ఫోర్స్‌లో చేరిపోయారు. వారిని యూనిఫామ్‌లో చూడడం తేజాకు ఎగ్జయిటింగ్‌గా అనిపించింది. వారి స్ఫూర్తితోనే ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లోకి వచ్చింది. బెంగళూరులోని ఎయిర్ ఫోర్స్ టెక్నికల్ కాలేజీలోప్రాథమిక శిక్షణ తరువాత మౌంట్ అబూలో పాస్టింగ్ ఇచ్చారు. మౌంట్ అబూ స్టేషన్‌లోని ఉద్యోగులలో ఇద్దరు మాత్రమే మహిళలు. అందులో తాను ఒకరు. మహిళల కోసం ప్రత్యేక వాష్ రూమ్స్ ఉండేవి కావు. ఇలాంటి సమస్యలు ఎన్ని ఉన్నా ఎప్పుడూ నిరాశపడేది కాదు తేజ,మౌంట్ అబూ తరువాత నాసిక్, బెంగళూరులలో కూడా పనిచేసింది. మన దేశాన్ని ఐటీ బూమ్ తాకిన సమయం అది.ఐటీ ఫీల్డ్‌లో ఉన్న సోదరుడు తేజాతో ఆ రంగానికి సంబంధించి ఎన్నో విషయాలు పంచుకునేవాడు. దీంతో ఐటీ రంగంపై తనకు ఆసక్తి పెరిగింది. అలా ఎయిర్ ఫోర్స్‌ను వదిలి ఐటీ రంగంలోకి అడుగు పెట్టింది. టీసీఎస్(టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్)లో డెవలపర్‌గా చేరింది. ఫ్రెషర్‌గా ఐటీ రంగంలో కెరీర్ మొదలు పెట్టిన తేజ అక్కడ ఎన్నో విషయాలు నేర్చుకుంది. ఆ తరువాత టెక్నాలజీస్‌లో పనిచేసింది. 2005లో డెల్ టెక్నాలజీలో మేనేజర్‌గా చేరింది. ఒక్కోమెట్టు ఎక్కుతూ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ (ఐటీ) స్థాయికి చేరింది. జెండర్ స్టీరియో టైప్స్‌ను బ్రేక్ చేస్తూ డెల్ ఐటీ%-- %ఇండియాలో కీలక స్థానంలో చేరిన తొలి మహిళగా గుర్తింపు ?పొందింది.డెల్ ఫౌండేషన్‌లో సేల్స్ అండ్ మార్కెటింగ్, సప్లై చైన్, డేటా సైన్స్... మొదలైన విభాగాల్లో పట్టు సాధించింది. సీఎస్ఆర్ యాక్టివిటీస్‌పై బాగా ఆసక్తి చూపేది. 'టెక్నాలజీ సహాయంతో ఎన్నో మంచిపనులు చేయవచ్చు' అంటున్న తేజ రకరకాల స్వచ్ఛంద సంస్థలతో కలిసి ఎన్నో మంచి కార్యక్రమాలు చేసింది. కోవిడ్ మహమ్మారి సమయంలో బుద్ధ ఫౌండేషన్‌తో కలిసి వలస కార్మికులకు పునరావాసం కల్పించింది.'ప్రతి మహిళకు ఒక రోల్‌మోడల్, మెంటర్ ఉండాలి. అప్పుడే ఎన్నో విజయాలు సాధించగలరు' అంటున్న తేజ డెల్‌లో 'మెంటర్ సర్కిల్ కాన్సెప్ట్'ను అమలు చేసింది. ప్రతి సర్కిల్‌లో కొందరు మహిళలు ఉంటారు. వారికో మెంటర్ ఉంటారు. ఈ సర్కిల్‌లో తమ సమస్యలను చర్చించుకోవచ్చు, సలహాలు తీసుకోవచ్చు. ఒకరికొకరు సహాయంగా నిలవచ్చు. 'ఇంజినీరింగ్ కాలేజీలో క్లాసులో నలుగురు అమ్మాయిలు మాత్రమే ఉండేవాళ్లం. ఇప్పటి పరిస్థితి గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మా కుటుంబంలో నేను ఫస్ట్ ఉమెన్ ఇంజనీర్‌ని. ఇప్పుడు ఎంతోమంది ఉన్నారు. ఒక ముక్కలో చెపాలంటే సమాజంలో చాలా మార్పు వచ్చింది. ఇది ఆహ్వానించదగిన మార్పు. నేను నేర్చుకున్న విషయాల ద్వారా ఇతరులకు ఏ రకంగా సహాయం చేయగలను అని ఎప్పటికప్పుడు ఆలోచిస్తుంటాను. టైమ్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి ఎన్నో సమావేశాలు నిర్వహించాను' అంటుంది తేజ.

# ఎండు కొబ్బరి ముక్క తింటే ఎన్ని లాభాలో తెలుసా..?



## నరాల సమస్యతో బాధపడే వారికి వరంలాంటిది..!

మన దేశంలో ఎండు కొబ్బరిని అందరి ఇళ్లలో వాడుతుంటారు. పూజ నుండి వంట వరకు అన్నింటిలో కొబ్బరిని ఉపయోగిస్తుంటారు. ఎండు కొబ్బరిని అనేక వంటకాల తయారీలో కూడా వాడుతుంటారు. ఇది తినడానికి చాలా రుచిగా కూడా ఉంటాయి. ఎండు కొబ్బరిని ఉపయోగించడం వల్ల ఆహారం రుచి పెరగడమే కాకుండా, దాని వినియోగం ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరం అంటున్నారు నిపుణులు. ఎండుకొబ్బరిలో ప్రొటీన్లు, విటమిన్లు, ఐరన్, కాల్షియం, మాంగనీస్, సెలీనియం, కాపర్, ఫాస్పరస్, పొటాషియం, మెగ్నీషియం వంటి మూలకాలు ఉంటాయి. అంతే కాకుండా ఎండు కొబ్బరిలో యాంటీ ఆక్సిడెంట్ గుణాలు కూడా ఉన్నాయి. అయితే ఎండు కొబ్బరి తినడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ, కొన్ని నష్టాలు కూడా ఉన్నాయి. కాబట్టి ఎండు కొబ్బరి వల్ల కలిగే లాభనష్టాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.. రుచి కోసం ఎండు కొబ్బరి తినడం వల్ల మనకు అనేక ప్రయోజనాలు లభిస్తుండగా, ఏదైనా తీపి లేదా కూరగాయలలో ఎండు కొబ్బరిని కలుపుకుంటే, దాని రుచి మరింత పెరుగుతుంది. ఎండు కొబ్బరిని తీసుకోవడం వల్ల రోగనిరోధక వ్యవస్థ బలపడుతుంది. అనేక ఇతర వ్యాధులు కూడా నయమవుతాయి. ఇందులో ఉండే గుణాలు దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం కలిగించడమే కాకుండా శరీరంలోని కొలెస్ట్రాల్ ను కూడా సులభంగా తగ్గిస్తాయి. కాబట్టి తరచుగా అనారోగ్య సమస్యలతో బాధపడేవారు తప్పకుండా ఎండుకొబ్బరిని ఆహారంలో తీసుకోవాలి. ఎండు కొబ్బరి తినడం వల్ల మన మెదడుకు పదును పెట్టడంతోపాటు జ్ఞాపకశక్తి పెరుగుతుంది. అదే సమయంలో మన హృదయాన్ని బలపరుస్తుంది. కొబ్బరిని పొడి లేదా తడి రూపంలో తినడం వల్ల మన జుట్టుకు చాలా మేలు జరుగుతుంది. ఎండు కొబ్బరిని తినడం వల్ల మన జుట్టు రాలడం ఆగిపోతుంది. క్రమంగా కొత్త జుట్టు పెరిగేలా చేస్తుంది. పైగా మీ కేశాలు నల్లటి రంగులో నిగనిగలాడుతుంది. అంతేకాదు.. ఎముకలకు కూడా మేలు చేస్తుంది. ఎండు కొబ్బరి తినడం వల్ల మన ఎముకలకు బలం చేకూరడంతో పాటు వాటిలోని పగుళ్ల శబ్దం కూడా ఆగుతుంది. ఎండు కొబ్బరి తినడం తలనొప్పితో బాధపడేవారికి చాలా మేలు చేస్తుంది. ఎండు కొబ్బరి తింటే మన శరీరానికి బలం చేకూరుతుంది. ఎండు కొబ్బరిని తీసుకోవడం వల్ల రక్తహీనత సమస్య నుండి ఉపశమనం లభిస్తుంది. ఎందుకంటే ఎండు కొబ్బరిలో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. అందువల్ల, మీరు ఎండు కొబ్బరిని తీసుకుంటే, అది శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిని పెంచుతుంది. దీని వల్ల రక్తం లేకపోవడం పోతుంది. ఎండు కొబ్బరిని తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఎందుకంటే ఎండు కొబ్బరిలో యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. అందువల్ల, మీరు ఎండు కొబ్బరిని తీసుకుంటే, అది మీ రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. దీని వల్ల మీరు ఎలాంటి వైరల్ ఇన్ఫెక్షన్ను చాలా వరకు నివారించవచ్చు. ఎండిన కొబ్బరిని తీసుకోవడం గుండెకు చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. ఎండు కొబ్బరిని రోజూ తీసుకుంటే గుండె ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే, ఎండు కొబ్బరి శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను మెరుగ్గా ఉంచడంలో సహాయపడుతుంది. ఎందుకంటే ఇందులో ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ఎండు కొబ్బరిని ఎక్కువ పరిమాణంలో తీసుకోవడం వల్ల బరువు పెరుగుతారు. కాబట్టి బరువు తగ్గాలనుకునే వారు కొబ్బరిని ఎక్కువ మోతాదులో తినకూడదు. ఎండు కొబ్బరిని తీసుకోవడం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఎందుకంటే ఎండు కొబ్బరిలో చాలా పోషకాలు ఉంటాయి. అందువల్ల, మీరు దీనిని తీసుకుంటే, ఇది రొమ్ము క్యాన్సర్ మరియు ప్రోస్టేట్ క్యాన్సర్ కణాలు ఏర్పడకుండా నిరోధించవచ్చు. ఎండు కొబ్బరిని ఎక్కువ పరిమాణంలో తీసుకోవడం వల్ల కడుపు సంబంధిత సమస్యలు వస్తాయి. మీరు దానిని ఎక్కువగా తీసుకుంటే, వాంతులు, కడుపు నొప్పికి కారణం కావచ్చు. ఎండిన కొబ్బరిని అధికంగా తీసుకోవడం మధుమేహ రోగులకు మంచికాదంటున్నారు. ఎందుకంటే కొబ్బరిలో చాలా చక్కెర ఉంటుంది. కాబట్టి దీన్ని తీసుకోవడం వల్ల షుగర్ లెవల్స్ పెరుగుతాయి.



## ఫ్రిజ్‌లో ఉంచిన ఆహారాన్ని ఎన్ని గంటల తర్వాత తినకూడదు?



బిజీగా ఉన్న నగర జీవితంలో ఆకలితో ఉన్నప్పుడు తాజా ఆహారాన్ని తయారు చేయడం సాధ్యం కాదు. అయితే ఆహారం త్వరగా చెడిపోకుండా ఉండేందుకు, ఎక్కువ సేపు పాడైపోకుండా ఉండేందుకు ఆహారాన్ని తయారు చేసి ఫ్రిజ్‌లో పెట్టే వారు చాలా మందే ఉన్నారు. సమయాన్ని ఆదా చేయడానికి రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేస్తారు. రిఫ్రిజిరేటర్‌లో మిగిలిపోయిన వాటిని నిల్వ చేయడం ఉద్దేశ్యం ఆహారం వృధా కాకుండా నిరోధించడం లేదా సమయాన్ని ఆదా చేయడం. ఫ్రిజ్‌లో ఉంచిన ఆహారం పాడైపోకుండా కాపాడుతుంది. గడ్డకట్టడం ఉద్దేశ్యం ఏమిటంటే, కూరగాయలు, పండ్లు పాడవకుండా నిరోధించడం ద్వారా ఎక్కువ కాలం తాజాగా ఉంచడం. కానీ అన్ని ఆహారాలు ఎక్కువ కాలం ఉండవు. అందుకే రిఫ్రిజిరేటర్‌లో ఉంచిన ఆహారం, పండ్లు, కూరగాయలు ఎంత సమయం తర్వాత తినకూడదో తెలుసుకుందాం. రిఫ్రిజిరేటర్‌లో ఉంచిన వండిన అన్నం 1 రోజులోపు తినాలి. మీరు వండిన ఆహారాన్ని రిఫ్రిజిరేటర్‌లో ఉంచినట్లయితే అది తక్కువ సమయంలో దాని పోషక విలువలను కోల్పోతుంది. అయితే ఆయుర్వేదం ప్రకారం, అన్ని వండిన ఆహారం కేవలం 6 గంటల పాటు పోషకాహారాన్ని అందిస్తుంది. ఆ తర్వాత దానిలోని పోషకాలు కోల్పోతాయి. మీరు గోధుమ రోటీని రిఫ్రిజిరేటర్‌లో ఉంచినట్లయితే, అది రోటీని తయారు చేసిన 12 నుండి 14 గంటలలోపు తినాలి. అలా చేయకపోతే, అందులో ఉన్న పోషకాలు పోతాయి. ఎక్కువసేపు ఫ్రిజ్‌లో ఉంచిన బ్రెడ్‌ను తిన్నట్లయితే మీకు కడుపు నొప్పిని కూడా వస్తుంది మీరు మీ భోజనంలో మిగిలిపోయిన పప్పును చెడిపోకుండా ఉండటానికి మీరు ఫ్రిజ్‌లో ఉంచినట్లయితే, దానిని 2 రోజులలోపు తినండి. రిఫ్రిజిరేటర్‌లో నిల్వ ఉంచిన పప్పును 2 రోజుల తర్వాత తింటే, కడుపులో గ్యాస్ ఉత్పత్తి ప్రారంభమవుతుంది. చాలా సార్లు మనం ఫ్రిజ్‌లో ఒక వారం పాటు పండ్లు, కూరగాయలను నిల్వ చేస్తాము. అయితే ఎక్కువ కాలం పాటు ఫ్రిజ్‌లో ఉంచిన కూరగాయలు, పండ్లు వాటి పోషక విలువలను కోల్పోతాయి. వాటిని తినడం వల్ల మీకు మంచి కంటే హాని ఎక్కువ. కూరగాయలు, పండ్లు కోయకుండా 3 నుండి 4 రోజులు ఉంచవచ్చు. అంతకంటే ఎక్కువ రోజులు ఉంచకూడదని నిపుణులు సూచిస్తున్నారు. మీరు తరిగిన పండ్లను శీతలీకరించినట్లయితే, అది 6 గంటలలోపు తినాలి. లేకుంటే అది మీ అనారోగ్యానికి కారణమవుతుంది. బియ్యం, పప్పు, రోటీ లేదా రోటీ పిండి వంటి ఏదైనా రిఫ్రిజిరేటర్‌లో ఉంచిన తర్వాత అన్ని వస్తువులను పూర్తిగా పాత్రతో కప్పి, వండిన ఆహారాన్ని 24 గంటల్లోపు తినాలి.

## ఈ గింజాలు ఆరోగ్యానికి వరం కంటే ఎక్కువ..! రోజూ తింటే రోగాలు మాయం.. మెరిసే, అందమైన చర్మం మీ సొంతం..!!



జాక్‌ఫ్రూట్ లాగానే జాక్‌ఫ్రూట్ విత్తనాలను తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. జాక్‌ఫ్రూట్ గింజల్లో ఐరన్, కాల్షియం, కాపర్, పొటాషియం వంటి అంశాలు ఉంటాయి. ఇవి అనేక వ్యాధులను నయం చేయడంలో సహాయపడతాయి. జాక్‌ఫ్రూట్ గింజలలో రిబోఫ్లావిన్, థయామిన్ కూడా ఉన్నాయి. ఇవి కళ్ళు, చర్మం, జుట్టుకు మేలు చేస్తాయి. అనేక పోషకాలు పుష్కలంగా ఉన్న పనస గింజలు జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో సహాయపడతాయి. రక్తహీనతను అధిగమించడంలో జాక్‌ఫ్రూట్ గింజలు కూడా ప్రయోజనకరంగా పరిగణించబడతాయి. కావున, జాక్‌ఫ్రూట్ విత్తనాలను ఖచ్చితంగా తినండి. రక్తహీనతను అధిగమించడానికి జాక్‌ఫ్రూట్ విత్తనాలను తీసుకోవడం ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. ఎందుకంటే జాక్‌ఫ్రూట్ గింజలు ఇనుముకు మంచి మూలం. జాక్‌ఫ్రూట్ గింజలను తీసుకోవడం వల్ల శరీరంలో ఐరన్ పరిమాణం పెరుగుతుంది. ఇది రక్తహీనతను దూరం చేస్తుంది. జాక్‌ఫ్రూట్ గింజల్లో మంచి మొత్తంలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. జాక్‌ఫ్రూట్ గింజలను తీసుకోవడం కళ్ళకు చాలా ప్రయోజనకరం అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఎందుకంటే జాక్‌ఫ్రూట్ గింజల్లో విటమిన్ ఎ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది కంటి చూపును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అందువల్ల, కంటి చూపును మెరుగుపరచడానికి, మీరు తప్పనిసరిగా జాక్‌ఫ్రూట్ గింజలను తినాలి. రోగ నిరోధక శక్తిని పెంచడంలో జాక్‌ఫ్రూట్ విత్తనాలను తీసుకోవడం చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. ఎందుకంటే జాక్‌ఫ్రూట్ సీడ్స్‌లో యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసే విటమిన్ సి గుణాలు ఉంటాయి. దీని కారణంగా రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. బూస్ట్ జాక్‌ఫ్రూట్ గింజల్లో కార్బోహైడ్రేట్లు మరియు విటమిన్ బి కాంప్లెక్స్ ఉంటాయి. ఇవి మీ ఆహారాన్ని శక్తిగా మార్చడంలో మరియు ఆరోగ్యకరమైన జీవక్రియను పెంచడంలో సహాయపడతాయి. జాక్‌ఫ్రూట్ గింజలను తీసుకోవడం జీర్ణవ్యవస్థకు చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. ఎందుకంటే జాక్‌ఫ్రూట్ గింజల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. జాక్‌ఫ్రూట్ గింజలను తీసుకోవడం ద్వారా మలబద్ధకం, కడుపు సంబంధిత సమస్యలు నయమవుతాయి.

## మధుమేహుల ఆరోగ్యంపై సబ్జా గింజల మ్యాజిక్..లాభాలు మామూలుగా లేవుగా!!

జీవనశైలి సరిగ్గా లేకపోతే, శరీరంలో అనేక వ్యాధులు రావడం ప్రారంభమవుతాయి. అలసట, అనారోగ్యం ఒక వ్యక్తిని ఒత్తిడికి గురి చేస్తుంది. చెడు ఆహారపు అలవాట్లు, అస్తవ్యస్థమైన జీవనశైలి కారణంగా అనేక రోగాలు ప్రజలను వెంటాడుతున్నాయి. ప్రస్తుతం చాలా మంది ప్రజలు మధుమేహం, మలబద్ధకం వంటి ఆరోగ్య సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నారు. మధుమేహం రావడం సర్వసాధారణం. నీరు, ఫైబర్ లేకపోవడం వల్ల మలబద్ధకం సమస్య ఏర్పడుతుంది. ఇటువంటి సమస్యలను తగ్గించడానికి లేదా ఉపశమనం పొందడానికి ఇంటి నివారణలు చక్కటి ఫలితాలను ఇస్తాయి. ఆయుర్వేదంలో చాలా ప్రయోజనకరంగా భావించే సబ్జా గింజలతో మధుమేహం, మలబద్ధకాన్ని ఎలా నివారించవచ్చో తెలుసుకుందాం.. మధుమేహం నయం కాదు. అయితే, కొన్ని ఇంటి చిట్కాలు, ఆయుర్వేద ఔషధాలు తీసుకోవడం వల్ల బ్లడ్ షుగర్‌ను అదుపులో ఉంచుకోవచ్చు. సబ్జా విత్తనాల్లో ప్రోటీన్, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు, కార్బోహైడ్రేట్లు పుష్కలంగా ఉన్నాయి. మీరు తరచుగా మలబద్ధకంతో బాధపడుతుంటే, ప్రతిరోజూ సబ్జా గింజలను తినండి. ఇందులో పీచు పుష్కలంగా ఉండి మలబద్ధకాన్ని దూరం చేస్తుంది. మధుమేహంతో బాధపడేవారు సబ్జా గింజలను తీసుకోవచ్చు. వీటిని మీరు తాగే నీళ్లలో నానబెట్టుకుని తాగటం ఉత్తమం. ఖాళీ కడుపుతో ఈ నీటిని తాగటం వల్ల ఫలితం ఉంటుంది. శరీరంలోని బ్లడ్ షుగర్ లెవెల్‌ను కంట్రోల్‌లో ఉంచడంలో సహాయపడుతుంది. తక్కువ నీరు త్రాగడం, సరైన జీవనశైలి కారణంగా యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ వస్తుంది. సబ్జా గింజలు వీలైనంత ఎక్కువ నీరు త్రాగడమే కాకుండా మూత్రనాళ ఇన్ఫెక్షన్లను కూడా నయం చేస్తాయి.

## కొవ్వే కదా అని లైట్ తీసుకోకండి.. తేడా కొడితే మీ పని అంతేనట.. బీకేర్‌ఫుల్..



కొలెస్ట్రాల్ సమస్య ఇప్పుడు ప్రతీ ఇంట్లో కూడా పట్టిపీడిస్తోంది. అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు ఈ సమస్యకు ప్రధాన కారణం.. బయటి ఆహారం ఎంత ఎక్కువగా తీసుకుంటే అంత చెడ్డ కొలెస్ట్రాల్ ఉంటుంది. ప్రతీరోజూ వ్యాయామం చేయకపోతే ప్రమాదం ఎక్కువ అవుతుంది. అయితే, మీ జీవక్రియ బాగా ఉంటే, కొలెస్ట్రాల్ స్థాయిల గురించి పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కానీ చెడు కొలెస్ట్రాల్ లెవెల్స్ ఒక్కసారిగా పెరిగితే ప్రమాదం కొనితెచ్చున్నట్లే.. చెడు కొలెస్ట్రాల్ స్థాయి పెరిగినప్పుడు, అది రక్తనాళాల్లో పేరుకుపోతుంది. దీని వల్ల రక్తనాళాలు ఇరుకుగా మారి రక్తప్రసరణకు ఆటంకం ఏర్పడుతుంది. ఇది రక్తపోటు, గుండె జబ్బులు ప్రమాదాన్ని పెంచుతుంది. అధిక కొలెస్ట్రాల్ గుండె జబ్బుల ప్రమాదాన్ని రెట్టింపు చేస్తుంది. చెడు కొలెస్ట్రాల్ అధిక స్థాయిలు ఏ సమయంలోనైనా గుండె సమస్యలకు దారితీస్తుంది. కానీ చాలా తక్కువ మందికి అధిక కొలెస్ట్రాల్, దాని ప్రభావాల గురించి తెలుసు.. అందుకే గుండెపోటు, పక్షవాతం లాంటి ప్రమాదకర వ్యాధులకు దూరంగా ఉండాలంటే.. కొలెస్ట్రాల్ స్థాయులను తగ్గించుకోవాలి. అధిక కొలెస్ట్రాల్ లక్షణాలు: కొలెస్ట్రాల్ స్థాయి పెరిగినప్పుడు, హృదయ స్పందన రేటు పెరుగుతుంది. కొంచెం గట్టిగా నడిచినా, మెట్లు ఎక్కినా ఊపిరి పీల్చుకునేందుకు ఆయాసంతో ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఇలాంటి సమయంలో చాలా మందికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటుంది. కళ్ల కింద ఉబ్బడం కొలెస్ట్రాల్ లక్షణం. కొన్నిసార్లు పసుపు రంగు మచ్చల్లాంటివి కళ్ళపై కనిపిస్తాయి. ఇది హై కొలెస్ట్రాల్ లక్షణం కూడా కొలెస్ట్రాల్ స్థాయి పెరిగితే శరీరంలో రక్త ప్రసరణకు ఆటంకం ఏర్పడుతుంది. ఒక్కసారిగా నరాలు మొద్దుబారిపోతాయి. ఆ సమయంలో కాళ్లకు చలనం కూడా అనిపించదు.. ఛాతీ నొప్పి, ఛాతీలో ఒత్తిడి, అసౌకర్యం కొలెస్ట్రాల్ పెరిగిన లక్షణాలు. ధమనులలో కొలెస్ట్రాల్ పేరుకుపోవడం వల్ల అడ్డంకులు ఏర్పడతాయి. దీనివల్ల గుండె జబ్బులు పెరుగుతాయి. కొలెస్ట్రాల్ వల్ల కూడా అధిక రక్తపోటు రావచ్చు. అధిక రక్త కొలెస్ట్రాల్ స్థాయిలు ధమనులపై ఒత్తిడిని కలిగిస్తాయి. దీని కారణంగా, రక్త ప్రసరణ చెదిరిపోతుంది.. రక్తపోటు పెరుగుతుంది. కొలెస్ట్రాల్ వల్ల దృష్టి మసకబారుతుంది. కళ్లు దెబ్బతింటాయి. అందుకే.. ఇలాంటి పరిస్థితిని తెచ్చుకోవద్దంటున్నారు ఆరోగ్య నిపుణులు.. కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుకునే మార్గాలు.. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి తినడం, మద్యం త్రాగటం నియంత్రించాలి. వీధి ఆహారాన్ని తరచుగా తినవద్దు. నూనె, కొవ్వు రహిత ఆహారానికి దూరంగా ఉండాలి. కూరగాయలు, ధాన్యాలు, గింజలు, పండ్లు, చేపలు మొదలైన వాటిని ఎక్కువగా తినండి. తినడం, త్రాగడంతో పాటు, క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. తగినంత నిద్ర పొందండి, ఒత్తిడిని తగ్గించుకోండి. ప్రతి 3 నెలలకు రక్త పరీక్ష చేయడం ద్వారా కొలెస్ట్రాల్ స్థాయిలను తనిఖీ చేయండి. ఇవన్నీ కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచుతాయి..

## ఇంత చిన్న వెల్లుల్లి ఏం చేస్తుందనుకుంటే పొరపాటే..! ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఇలా తింటే.. ఎన్నో రోగాలకు దివ్యౌషధం..!!

అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలిగించే ఆహార పదార్థాలలో వెల్లుల్లి ఒకటి. వెల్లుల్లిలో విటమిన్లు సి, కె, ఫోలేట్, మాంగనీస్, సెలీనియం, ఫైబర్, ఐరన్, కాల్షియం, ఫాస్పరస్, కాపర్, పొటాషియం వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. విటమిన్ సి, ఇతర యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే వెల్లుల్లి రసాన్ని ఉదయాన్నే పరగడుపున తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఉదయం ఖాళీ కడుపుతో వెల్లుల్లి రసం తాగితే ఎన్నో అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చునని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం.. జీర్ణ సమస్యలు రాకుండా ఉండాలంటే వెల్లుల్లిని ఆహారంలో చేర్చుకోవడం మంచిది. వెల్లుల్లి రసం తాగడం వల్ల పొట్టలోని ఇన్ఫెక్షన్లు, గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు రాకుండా కాపాడుతుంది. జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేస్తుంది. ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలకు చెక్ పెడుతుంది. ఉదయం ఖాళీ కడుపుతో వెల్లుల్లి రసం తాగడం వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ కూడా అదుపులో ఉంటుంది. వెల్లుల్లిలోని అల్లిసిన్ దీనికి సహాయపడుతుంది. అధిక కొలెస్ట్రాల్ తో బాధపడేవారు ఉదయాన్నే బ్రేక్ ఫాస్ట్ సమయంలో వెల్లుల్లి రసం తాగాలి. ఇది చెడు కొలెస్ట్రాల్‌తో పోరాడి టాక్సిన్స్ ను బయటకు పంపిస్తుంది. వెల్లుల్లి రసం తాగడం వల్ల గుండె ఆరోగ్యానికి మంచిది. రోజూ వెల్లుల్లి రసం తీసుకుంటే గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె సంబంధిత వ్యాధులు దూరం అవుతాయి. ఇవి రక్తపోటును తగ్గించడానికి, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. వెల్లుల్లి శ్వాసకోశసమస్యలనుండికూడాఉపశమనంకలిగిస్తుంది.వెల్లుల్లిలోఉండే యాంటీబ్యాక్టీరియల్ భాగాలు దీనికి సహాయపడతాయి. ఉదయాన్నే వెల్లుల్లి రసాన్ని తాగడం వల్ల ఇన్ఫెక్షన్లు, వ్యాధులు దూరం అవుతాయి. ఇమ్యూనిటీ పెరుగుతుంది. వెల్లుల్లి కాలేయ ఆరోగ్యానికి కూడా మంచిది. కాలేయం, మూత్రపిండాలు, రక్తప్రవాహానికి అద్భుతమై డిటాక్స్ ఫైయర్ గా పనిచేస్తుంది. మెదడు పనితీరును రక్షిస్తుంది. జ్ఞాపకశక్తి, దృష్టి మెరుగుపరుస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే వెల్లుల్లిని తినడం వల్ల కొన్ని రకాల క్యాన్సర్‌ల రిస్క్ తగ్గుతుంది. బరువు తగ్గడానికి వెల్లుల్లి రసాన్ని కూడా ఆహారంలో చేర్చుకోవచ్చు. శరీరంలోని అనవసరమైన క్యాలరీలను కరిగించడంలో ఇవి మేలు చేస్తాయి. వెల్లుల్లి రసం బరువును తగ్గించడంలో సహాయపడుతుంది. యాంటీ ఆక్సిడెంట్లు ఉండే వెల్లుల్లి రసం తాగడం వల్ల మెదడు ఆరోగ్యానికి కూడా మంచిది. విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే వెల్లుల్లి రసం తాగడం వల్ల చర్మ ఆరోగ్యానికి కూడా మంచిది. చర్మ ఆరోగ్యానికి కూడా వెల్లుల్లి తోడ్పడుతుంది. మొటిమలను, మంటను తగ్గిస్తుంది.





## నిర్దోషిగా బయటకు వస్తా : జానిమాస్టర్

లైంగిక వేధింపుల కేసులో అరెస్ట్ అయ్యి బెయిల్ మీద బయటకు వచ్చిన కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌పై పోలీసులు కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారంటూ వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలపై జానీ మాస్టర్ క్లారిటీ ఇచ్చాడు. మీడియాలో వస్తున్న వార్తలు అబద్ధం. న్యాయస్థానంపై నాకు నమ్మకం ఉంది. న్యాయస్థానంలో న్యాయం ఉంది కాబట్టే ఈరోజు ఇలా నేను బయటకు వచ్చి నా పని నేను చేసుకుంటున్నాను అని పేర్కొన్నారు. నా మనసుకు తెలుసు ఏం జరిగిందని.. ఆ దేవుడికి తెలుసు. నా విషయంలో తీర్పును న్యాయం స్థానం నిర్ణయిస్తుంది. న్యాయస్థానం నుంచి నేను నిర్దోషిగా బయటికి వస్తాను. ఆరోజు అందరి ముందుకు వచ్చి మాట్లాడుతాను. నేను ఇప్పుడు నిందితుడిని మాత్రమే. నాకు తెలిసింది ఒక్కటే విద్య. డాన్స్‌తో మిమల్ని ఎంటర్‌టైన్ చేయడం. మీ అందరి దీవెనల వల్లనే నేను ఇప్పుడు ఈ స్థానంలో ఉన్నాను.. మీ అందరిని అలరించడానికి కష్టపడతాను.. మీ ప్రేమ ఎల్లప్పుడూ ఇలానే ఉండాలని కోరుకుంటున్నాను అని ఆయన చెప్పుకొచ్చారు.



# యశ్ టాక్సిస్ చిత్రంలో అక్షయ్ ఒబెరాయ్

యశ్ హీరోగా మలయాళ దర్శకురాలు గీతూమోహన్ దాస్ 'టాక్సిక్' తెరకెక్కిస్తున్న సినిమా షూటింగ్ ఇటీవలే ప్రారంభమైంది. ఇందులో బాలీవుడ్ నటుడు అక్షయ్ ఒబెరాయ్ భాగమయ్యారు. ఈ విషయాన్ని తెలుపుతూ అక్షయ్ పోస్ట్ పెట్టారు. ఆయన్ని టీమ్‌లోకి ఆహ్వానిస్తూ మూవీ యూనిట్ పంపిన లెటర్‌ను షేర్ చేశారు. 'మీలాంటి ప్రతిభావంతులైన నటులతో కలిసి పనిచేసేందుకు 'టాక్సిక్' టీమ్ ఆసక్తిగా ఉంది' అంటూ అక్షయ్‌ను ప్రాజెక్ట్‌లోకి ఆహ్వానించింది మూవీ యూనిట్. ఈ చిత్రం ప్రకటించిన తర్వాత ఇప్పటివరకు ఇందులోని నటీనటులు గురించి వెల్లడించలేదు. మొదటిసారి అక్షయ్ భాగమైనట్లు తెలుపుతూ పోస్ట్ చేయడంతో అభిమానులు సంబరపడుతున్నారు. ఈ ఏడాదిలో 'ఫైటర్'తో పలకరించిన అక్షయ్.. 'టాక్సిక్'తో కన్నడ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వనున్నారు. యశ్ నటిస్తోన్న 19వ చిత్రమిది. ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్.. అన్నది ఉపశీర్షిక. వచ్చే ఏడాది ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకురానుంది. 'కేజీఎఫ్' సిరీస్ విజయాల తర్వాత యశ్ నుంచి వస్తున్న సినిమా కావడంతో దీనిపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# ప్రభాస్ సినిమాలో నేను లేను

### అభిమానులకు షాకిచ్చిన మృణాల్ ఠాకూర్

వరుస విజయాలతో జోష్ మీదున్నారు ప్రభాస్. ఆయన హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన 'సీతారామం' బ్యూటీ మృణాల్ నటించనున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా వీటిపై ఆమె స్పందించారు. ప్రభాస్‌తో మృణాల్ ఉన్న ఫొటోను ఇన్‌స్టాలో ఓ నెటిజన్ పోస్ట్ చేశారు. 'ఇది హను రాఘవపూడి చిత్రం ఫస్ట్‌లుక్' అని ఆ ఫొటోకు క్యాప్షన్ పెట్టారు. ఈ పోస్ట్‌పై మృణాల్ స్పందించారు. 'మీ ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పెడుతున్నందుకు క్షమించండి. నేను ఈ ప్రాజెక్ట్‌లో లేను' అని కామెంట్ చేశారు. దీంతో రూమర్‌కు చెక్ పడింది. మరి ఇందులో ప్రభాస్ సరసన ఎవరు కనిపిస్తారో అనే చర్చ మరోసారి మొదలైంది. హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా ఓ పీరియాడికల్ డ్రామాగా ఈ చిత్రం రానుంది. దీనికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. పాన్ ఇండియా స్థాయిలో ఇది తెరకెక్కనుంది. తాజాగా దీనికి సంబంధించిన టైటిల్ కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ చిత్రానికి 'ఫౌజీ' అనే పేరును పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన ఆగస్టు 17న రానున్నట్లు తెలుస్తోంది.



## ఎల్లమ్మలో నాయికగా సాయిపల్లవి

సినిమాల ఎంపికలో సాయిపల్లవి చాలా సెలెక్టివ్‌గా ఉంటుంది. కథలో కొత్తదనంతో పాటు ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్ ఉంటేనే అంగీకరిస్తుంది. అందుకే ఆమె ఒప్పుకునే సినిమాల గురించి ప్రేక్షకులు ఆసక్తిని కనబరుస్తారు. ఈ నేపథ్యంలో సాయిపల్లవి తెలుగులో మరో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే..'బలగం' చిత్రంతో విమర్శకుల ప్రశంసలందుకున్నారు దర్శకుడు వేణు యెల్దండి. ఆయన తన తదుపరి చిత్రంగా 'ఎల్లమ్మ'ను తెరకెక్కించబోతున్నారు. నితిన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి దిల్‌రాజు నిర్మాత. తెలంగాణ నేపథ్య కథాంశమిది. ఇందులో కథానాయిక పాత్ర చాలా కీలకంగా ఉంటుందని తెలిసింది. ఈ కథ సాయిపల్లవికి బాగా నచ్చడంతో వెంటనే అంగీకరించిందట. అయితే ఈ వార్తలో వాస్తవమేమిటో తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. ప్రస్తుతం సాయిపల్లవి 'తండేల్' చిత్రంలో నటిస్తున్నది. ఫిబ్రవరిలో ఈ సినిమా విడుదలకానుంది. అనంతరం 'ఎల్లమ్మ' సినిమా పట్టాలెక్కుతుందని సమాచారం.







# స్నేహానికి ప్రాణమిచ్చే వ్యక్తి అల్లు అర్జున్

ఆయ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో బన్నీ వాసు భావోద్వేగం స్నేహితుడికి అవసరం ఉందంటే ఎలాంటి పరిస్థితుల్లోనైనా అల్లు అర్జున్ అండగా ఉంటారని నిర్మాత బన్నీ వాసు అన్నారు. 'ఆయ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆయన మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. అల్లు అర్జున్‌తో తనకున్న స్నేహాన్ని గుర్తుచేసుకున్నారు. 'నాకు కష్టం వచ్చిందంటే ఇద్దరు వ్యక్తులు ఎప్పుడూ మందుంటారు. వాళ్లలో ఒకరు మా అమ్మ అయితే.. రెండో వ్యక్తి నా స్నేహితుడు అల్లు అర్జున్. 'ఆయ్' సినిమా ప్రచారం సరిగ్గా జరగడంలేదని.. బన్నీని పోస్ట్ పెట్టమని అడగాలని మా టీమ్ వాళ్లు కోరారు. కానీ, నేను ఆయన్ను అడగలేదు. నేను సమాచారం ఇవ్వకుండానే ఆయనే తన ఎక్స్‌లో ఈ చిత్రం గురించి పోస్ట్ చేశారు. నాకు అవసరం ఉన్న ప్రతిసారి ఆయన ముందుండి నడిపిస్తారు. ఒక స్నేహితుడికి కష్టమొస్తే.. తనకు ఎలా సపోర్ట్ చేయాలని తెలిసిన ఏకైక వ్యక్తి నా దృష్టిలో అల్లు అర్జునే. 20 ఏళ్ల క్రితం నేను గీతా ఆర్ట్స్ నుంచి వెళ్లిపోవాల్సిన సంఘటన ఎదురైంది. ఆరోజు బన్నీ నాకు సపోర్ట్ చేయడం కోసం వాళ్ల నాన్నను కూడా ఎదిరించారు. అప్పుడు ఆయన సపోర్ట్ చేయకపోతే ఈరోజు నేను ఈ స్థానంలో ఉండేవాడిని కాదు. తన స్నేహితుల్లో ఎవరికి అవసరం వచ్చినా ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా బన్నీ సపోర్ట్ చేస్తాడు. మంచి వ్యక్తి' అంటూ తమ స్నేహాన్ని గుర్తుచేసుకున్నారు. 'సినిమాలకు సంబంధించిన విషయాలను సినిమా వరకు మాత్రమే ఆలోచించగల హీరో ఎన్టీఆర్. 'ఆయ్' ట్రైలర్‌ను పిఠాపురంలో చేయాలని నాకు అనిపించినప్పుడు ఎన్టీఆర్‌కు ఈ సమాచారాన్ని అందించాం. నిర్మాతకు ఉపయోగ పడుతుందంటే మిగతా విషయాలేవీ పట్టించుకోవద్దు అని చెప్పారు. ఈ విషయంలో ఆయనకు కృతజ్ఞతలు చెప్పాలి. నేను మొదటి నుంచి పవన్ కల్యాణ్ అభిమానిని. ఈరోజు ఆయనతో పాటు పొలిటికల్ జర్నీలో ఉంటున్నానంటే నా అదృష్టమని చెప్పాలి' అంటూ బన్నీ వాసు భావోద్వేగానికి గురయ్యారు. ఎన్టీఆర్ బావ మరిది నార్నే నితిన్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'ఆయ్' ... మేం ఫ్రెండ్సండి అనేది ఉపశీర్షిక. నయన్ సారిక హీరోయిన్. అంజి కె.మణిపుత్ర దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకు రానుంది.



# ఆదిపురుష్ ఫెయిల్ కావడంతో ఏడ్చేశాను

### నటి కృతి సనన్ తాజా వేదన

రెబల్ స్టార్ ప్రభాస్, బాలీవుడ్ నటి కృతి సనన్ ప్రధాన పాత్రల్లో వచ్చిన చిత్రం ఆదిపురుష్ బాక్సాఫీస్ వద్ద అట్టర్‌ప్లాప్‌గా నిలిచింది. ఇక ప్రభాస్ రాధేశ్యామ్ తర్వాత మరో డిజాస్టర్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. అయితే ఈ సినిమా పరాజయంపై తాజాగా స్పందించింది నటి కృతి సనన్. ఆదిపురుష్ ఫ్లాప్ అయినప్పుడు నేను చాలా బాధపడ్డాను. మనం ప్రాణం పెట్టిన సినిమాలు పరాజయం అయితే తీవ్ర కుంగుబాటుకు లోనవుతాం. కొన్నిసార్లు ఏడ్చేస్తాం. అయితే ఈ తప్పు ఎక్కడ జరిగిందోనని ఆలోచిస్తాం. ఎదుటివారి విశ్వాసాలు, మనోభావాలను దెబ్బతీయడం అనేది మా లక్ష్యం కాదు. ప్రతి ప్రాజెక్ట్ వెనుక ఉద్దేశం పాజిటివ్‌గానే ఉంటుంది. అయితే అప్పుడప్పుడు అది కొందరికి నచ్చకపోవచ్చు. ఏది ఏమైనా ఈ అనుభవాల నుండి మనం చాలా నేర్చుకుంటాం. ఒక నటిగా నేను ఎప్పుడు పాజిటివ్‌గా ముందుకెళ్లాలి. తర్వాతి ప్రాజెక్ట్‌లపై దృష్టి పెట్టాలి. ఒక సినిమా హిట్ అవ్వడం అనేది చాలా అంశాల మీదా ఆధారపడి ఉంటుంది. అప్పటివరకు మన పనిని మనం 100 శాతం పూర్తి చేసుకుంటూ వెళ్లాలి అంటూ కృతి వెల్లడించింది. గతేడాది 'క్రూ', 'తేరీ బాతోన్ మే ఐసా ఉల్జా జియా' సినిమాలతో హిట్లు అందుకున్న ఈ భామ ప్రస్తుతం దోపట్టి అనే సినిమాలో నటిస్తుంది. బాలీవుడ్ నటి కాజోల్ దేవ్‌గణ్ నటిస్తున్న ఈ సినిమాకు శశాంక చతుర్వేది దర్శకత్వం వహిస్తున్నాడు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com